నారాయణమూర్తి, భోగరాజు

నా. రో. జా

రాజమహేంద్రవరము, 1926

Record no. 524

Nārāyaṇamūrti, Bhōgarāju

Nau. Rō. Jā

Rājamahēndravaramu, 1926

Record no. 524

**SUNDARAYYA VIGNANA KENDRAM**
1-8-1/B/25/A, Bagh Lingampalli
Hyderabad – 500 044, Andhra Pradesh, India

## Bibliographic Record Target

నారాయణమూర్తి, భోగరాజు.

నౌ. రో. జా / కృతికర్త భోగరాజు నారాయణమూర్తి.- రాజమహేంద్రవరము : సరస్వతీ పవర్ ప్రెస్, 1926.

x, 100 p. ;22 cm.

Record no. 524

Nārāyaṇamūrti, Bhōgarāju.

Nau. Rō. Jā / kṛtikarta Bhōgarāju Nārāyaṇamūrti.- Rājamahēndravaramu : Sarasvatī pavar Pres, 1926.

x, 100 p. ;22 cm.

Record no. 524

35 mm microfilm

Image placement: IA (IIA) IB IIB          Date filming began:

కవితాకల్పలతాప్రచురములు. నెం.—2

# నౌ రో జా

కృతికర్త

భోగరాజు నారాయణమూర్తి

విజయనగరమహారాజాస్థానకవి

విజయనగరము



సరస్వతీ పవర్ ప్రెస్‌లో ముద్రితము

రాజమహేంద్రవరము

1926

పోస్టేజి వేరు    రు 1—0—0

## సరస్వతీ స్తవము.

అపారహామస్మదీయ హృదయాంచితకాంచన పీఠిపై శుభా
వహమగు త్వన్నిజాకృతిని భద్రముగా నెలకొల్పి, భక్తిమై
బహుగతులన్నుతింతు నెడబాయక నన్గరుణించి, భారతీ
తుహినకరాననా! యెటుల దోడ్పడెదో నవకావ్యకల్పనన్.

కృతికర్త.

# పుష్పాంజలి.

కవితాకల్పలతా గ్రంథమాలికలో నీ 'సారోజా' ద్వితీయప్రచురము. శ్రమయనక యీనాటకమునకు విపులమైన యుపోద్ఘాతమును వ్రాసియిచ్చిన—ఎలమంచిలిబోర్డు హైస్కూలు హెడ్మాస్టరువారగు మ. రా. శ్రీ రావికంటి సీతారామచంద్రరావుపంతులు ఎం. ఏ. యల్. టి. గారికి మేము నిరంతరము కృతజ్ఞులము. ఈనాటకము కళాశాలలయందుఁ బఠనీయగ్రంథమగునెడల, విమర్శదృష్టితో వ్రాసిన పంతులుగారి యుపోద్ఘాతము విద్యార్థులకే గాక యుపాధ్యాయులకుఁ గూడ మిక్కిలి యుపయోగకరమగునని మానమ్మకము. ఆంధ్రదేశమున కత్యంతోపయుక్తములై పిల్లలు పెద్దలు స్త్రీలుపురుషులు పండితులు పామరులుగూడ నామోదింపఁగల యుత్తమగ్రంథములనన్గా చరిత్రలు చిత్రకథలు నవలలు, నాటకములు ప్రహసనములు ప్రబంధములు మహాపురుషుల జీవితములు మున్నగువానిని బ్రచురించుట యీమండలియొక్క ముఖ్యోద్దేశము. పూర్వపు మనమతము మనదేశము మనసంఘము మనరాజకీయ పరిస్థితులును ఆయాగ్రంథములయందు నిరూపింపఁబడుచుండును. యశోవంతులైన కవిరాజులును ధనవంతులైన మహారాజులును మాయుద్యమమునకు సాహ్యమగు సంతసమునకుఁ దోడుపడఁ బ్రార్థించుచున్నాము.

చిత్తగించవలెను.

విజయనగరము
6—1—26

పసుమర్తి వీరభద్రస్వామి బి. ఏ.
సంపాదకుఁడు.

## ఈ నాటకమున వచ్చు పాత్రలు.

ఉదయసింగు—చిత్తూరు రాణా

ప్రతాపసింహుఁడు—ఉదయసింగు కుమారుఁడు.

విక్రమసింగు—మారుపేరుగల ప్రతాపసింహుఁడు

ఉగ్రసేనుఁడు—చిత్తూరు రాజాస్థానకవి.

కుమారభట్టు—చిత్తూరు రాజాస్థానకవి.

కుమారసింగు—మారువేషము ధరించిన నర్మద.

హమీరసింగు—మారువేషము ధరించిన లతాంగి

అక్బరు—ఢిల్లీ చక్రవర్తి.

మానసింగు—అక్బరు ముఖ్యమంత్రి.

జయచంద్రుఁడు—అక్బరు సేనానాయకుఁడు.

వీరాభాయి—చిత్తూరు మహారాజ్ఞి

లతాంగి—ప్రతాపసింహుఁడు వరించిన రాజకన్య.

ప్రమద—జయచంద్రుని చెల్లెలు.

నర్మద—జయచంద్రుని భార్య.

జహనారా—అక్బరు ఉంపుడుకత్తె.

వీరుగాక జమాన్ ఖాను మొదలగు కొందఱు మొగలాయి భటులును, మరికొందరు రాజభటులును గలరు.

**N. B.** కృతికర్తయనుమతిలేక, యీనాటకము నేనాటక సంఘమువారును ప్రదర్శింపఁగూడదు.

# ఉపోద్ఘాతము

కవిప్రసంశ.

మ. రా. శ్రీ భోగరాజు. నారాయణమూర్తి పంతులు కవి గారిని ప్రత్యేకముగా నాంధ్రప్రపంచమున కెఱింగింప, నవసరము లేదు. వారి 'విమలాదేవి', 'కృష్ణాకుమారి', 'ఆంగ్లరాజ్యస్థాపనము ఆంధ్రకవిత్వచరిత్రము' మున్నగునవి యిదివరకే వారిని సుపరిచితులుగా నొనర్చినవి. ఐనను 'విమలాదేవి' నాటి బాలకవులు, 'సారోజా' నాటికిఁ బ్రౌఢకవులగుటయే గాక నాటకరచనయందు విజయము గాంచుటచేత, వారియాశయములఁ గొన్నిటి నెఱింగిన నేను విమర్శనదృష్టితో నీవ్యాసమును వ్రాయసమకట్టినాఁడను.

మన వాఙ్మయస్థితి

ఆంధ్రవాఙ్మయమునందుఁ బ్రస్తుతము క్రొత్తయాశలు పొడముచున్నవి. ఆంధ్రభోజుఁడని ప్రఖ్యాతివడసిన రాయలకాలమునఁ బ్రబంధరచనయందెట్టి చలనము కలిగినదో నేఁడట్టి కొంత నాటకరచనయందుఁ గాన్పించుచున్నది. ఇంతకాలమువఱకు నట్టిప్రోత్సాహము కలుగనందుకు విచారించుటయే గాని, ప్రాప్తించిన నవోజ్జీవముయొక్క ప్రాశస్త్యమునుగూర్చి విస్తరింపనవసరము లేదు. సంస్కృతమునకుఁ గాళిదాసుకలఁడు. ఆంగ్లమునకు షేక్స్పియరున్నాఁడు. ఉభయభాషల మైత్రిగల మనమాతృభాషయందింతను నట్టిజెట్టిపుట్టి యుండలేదు. పొరబడితినిగాఁబోలు! మైత్రియంటిని! ఎట్టిమైత్రి? కేవలస్వశ్రేయోభిలాషులకడ నెన్నఁడైన నితరులు వృద్ధిగాంచిరా? చాలఁగాలము సంస్కృతముచే సవతితల్లి ప్రాపుగాంచి—కడచిన నూరునూటయేబదియేండ్లనుండియు రాజభాషావ్యామోహాయత్తచిత్తులమైన మనచేఁ దిరస్కరింపఁబడి—యాంగ్ల భాష యిప్పుడిప్పుడే బంధవిమోచనము గాంచుచున్నది. ఆంగ్లవిద్యాధికులీసడించుచున్నను, తగురీతి నామోదింపక విశ్వవిద్యాలయములు యథాశక్తి బహిష్కరించుచున్నను, నిక్కముగఁ బట్టిచూచినఁ దెనుఁగులో నేమికలదని పండితులు నిరసించుచున్నను, మానవవిధాన మెంతయుఁ గాలాధీనమగుటచేఁ గాలానుకూల్యమువలన నీకాలమునాఁడు మన తెనుఁగుభాష యొకింత యాదరణము గాంచుచున్నది.

దేశభాషోద్యమము

తిలక్—బంకిమ్—డి. ఎల్. రోయ్—మహానుభావులు దేశభాషోద్యమమునకుఁ స్వచ్ఛందసైనికులుగఁ బనిచేసిరి. ఇందు వంగదేశపు షేక్స్పియరనఁ డి. యల్. రోయ్ తాను వ్రాసిన కొన్ని యాంగ్లగీతములను గవీంద్రుఁడగు రవీంద్రునకుఁ జూపఁగాఁ దత్కవితాపటిమ కమ్మహానుభావుం డెంతయు సంతసించి యిట్టిమహత్తరకవిత్వపటుత్వమును స్వభాషయందు వినియోగించిన నెయిమడుంగు లధిక ఫలము గాంచునని

శ్లాఘించుచు వానిని వంగనాటకరచనకై పురికొల్పెను. తత్ఫలితముగ నేడు రాయ్ గారి నాటకములలో షేక్స్పియరునాటకములను ధిక్కరించునవి యనేకములుగలవు.

**తెనుఁగు వారలవిధి**

ఈరీతిగనే యీకోటఁ గలాశాలలనుండి వెలువడు పట్టభద్రులు భాషామతల్లి నలంకరించుట కించుక శ్రద్ధవహించినచో నచిరకాలములోనే నిశ్చయముగ మనభాషాయోషయు నవాలంకార శోభితయగును. గ్రంథరచన సరస్వతీ సేవకులలోఁ గొందరికే యలవడును. కాని గ్రంథాదరణముమాత్ర మందరికిని నలవడవలసినది. మనవారు ప్రప్రథమమునఁ జూపవలసిన యౌదార్యమును మన గ్రంథములయందే చూపవలెను. ప్రాచీనులయెడ గౌరవము, ఆధునికులయెడఁ బ్రేమభావము కలిగియుండుట ప్రస్తుతము మనకు విధియైయున్నది.

**మననాటకములు**

ఇది నాటకయుగమని తొలుతనే మనవిచేసికొంటిని. నాటకములు రచించుటయందు వానిని బ్రదర్శించుటయందు సర్వత్రా అమితోత్సాహము గానవచ్చుచున్నది. ఆంధ్రనాటక పితామహుని జీవితచరిత్ర మిందుకు సాక్ష్యము. ఇంకను పేరుగాంచిన కవు లనేకులు నాటకవాఙ్మయశాఖకుఁ దగురీతికానుక లర్పించుచున్నారు. దినదినమును గ్రొత్తనాటకము లనేకములు రచింపఁబడుచున్నవి. కాని యిట్టివాఙ్మయసృష్టికి వెనువెంటనే విమర్శనము వెలువడవలసియున్నది. కవితాకళకు విమర్శనాకళ చెల్లెలేకదా! ఐనను విమర్శనాకళ కాలానుసరణముగ విపరీతములగు వేషములు వేయుచుండును. ఒకప్పుడు కవిత్వమునకుఁ గేవలము బానిసగనుండును. వేఱొకప్పు డధికారిణిగ నుండును. ఇంకొకప్పుడు సహచారిణిగ నుండును. ఎప్పుడెట్లున్నను విషపూరితము గానంతవరకుఁ దప్పక కవిత్వమునకు వెంటనేకాని నిడివిపైఁ గాని సహాయము చేయుచుండును. అట్టివిమర్శనాదృష్టితోఁ బరిశీలించునప్పుడు మన నాటకములపట్ల విద్యాధికులలో ననేకులకొకింత విముఖత గాన్పించుచున్నది. పురాణగాథలయందు యాథార్థ్యము తక్కువయై కల్పనలు అసంభావ్యములు నెక్కుడగుటచే నట్టి నాటకములు రుచింపకున్నవి. కన్యాశుల్కమును దప్పించినచో సాంఘికసమస్యలను నిరూపించు నాటకములు లేవనియేచెప్పవచ్చును. ఇంకఁ జారిత్రక నాటకములా! చాలవఱకుఁ జప్పట్లకు వీలుకలిగించు పద్యము లుండుటచే వ్యాప్తిగాంచినవియేకాని యీ వాఙ్మయశాఖలో స్థిరముగా నిలుచునట్టివికావు. వానియందలి చారిత్రకాంశములును, పాక్షికబుద్ధితోడను, బరస్పరవైషమ్యములను బెంపొందించు నుద్దేశముతోడను వ్రాయఁబడిన చారిత్రక గ్రంథములనుండి గ్రహింపఁబడినవి. కేవలము హిందూమహమ్మదీయ పరస్పరవైర ప్రసంగములేనా నాటకములకాధారమగు కథాంశములు? హిందూదేశ చరిత్రమునం దింకొకవిధమైన కథాంశములు లేనే



లేవా? పోనిండు! మనమిప్పు డట్టిజాత్యైకమత్యము కలిగింప నక్కఱలేదనుకొందము. ఆచరిత్ర యథార్థమేనా యనునువిషయ మామూలాగ్రముగఁ జర్చింపఁబడి నిర్ధారణము చేయఁబడలేదుకదా? నిర్వివాదములగు తార్కాణములతోఁ బ్రస్తుతము మనకుఁ జిక్కిన దేశచరిత్రము తప్పని చారిత్రకపరిశోధకు లనేకులు నూతన సిద్ధాంతములను బయలుపెట్టుచున్నారుకదా? నాటకరచనము లిట్లుండ నాటకరంగస్థలములుగూడ నిందుకుఁ దోడుపడుచునేయున్నవి. ప్రపంచములో ధనముగలవాఁడే యోగ్యుఁడుగను పౌరుషవంతుఁడుగను నెట్లుపరిగణింపఁబడుచున్నాడో అట్లే సంగీతమను భ్రమతో నాత్మరహితమగు 'హార్మోనియము'ను అనుకరణముగ నుంచుకొని కేకలిడువాఁడే నటుఁడుగా లెక్కింపఁబడుచున్నాడు. భావప్రకటన-పాత్రపోషణ-కవి హృదయావిష్కరణము మున్నగునవి యీ గావుకేకలనడుమ నధ్యాహారములగుచున్నవి. చదివిన ప్రతిపద్యమును జప్పట్లబహుమానముఁ బడయునో లేదోయను దృష్టికలవానికి యివి యెట్లలవడును? చాలవఱకు నిట్టినటుని దృక్పథమందుంచుకొనియే నాటకములు వ్రాయఁబడుచుండుట కడుశోచనీయము. ముఖ్యముగ నిట్టినాటకములలో మ్లేచ్ఛనిరసనఘట్టమే కవిగారికిని నటునకునుగూడ ముద్దుబిడ్డయై యొప్పుచున్నది. అయ్యది క్రమమైన చరిత్ర కాఁజాలకపోవుటయే గాక భావికాలమున నెట్టిక్షోభమును సమకూర్పకుండుటగూడ సిద్ధాంతము.

**నారోజా**

మన నారోజా యిట్టిస్థితులనుండి విముక్తిగలిగించు నొక చరిత్రాత్మక నాటకము. దేశపరిస్థితులలో వేయిసంవత్సరములనుండి యార్యావర్తముతో సంబంధము గలిగించుకొని, సంబంధము కలిగిన నాటకమునుండియు నార్యావర్తమే మాతృభూమిగ నెంచుకొనుచుండిన మహమ్మదీయులకును, దేశీయులకునుగల పరస్పరమిత్రత్వ శత్రుత్వముల రహస్యము, ఒకమహాయుగమునాటి చరిత్రమున నెట్లు గ్రహింపఁబడెనో కవిచే నిందు సూచింపఁబడెను. రాజపుత్రులలో ప్రతాపసింహుఁడు తలమానికముగ గణింపఁబడుచున్నాడు. మహమ్మదీయులలో 'అక్బరు' విశ్వజనీనుఁడుగ నెన్నఁబడుచున్నాడు. అట్టి మహాపురుషులకుఁగల పరస్పరవైషమ్య మెన్నఁడును హింసాపరమును ద్వేషజన్యమును గానేరదు. వారి హృదయముల నేవో మహత్తరావేశము లావరించుకొని యుండును. అవి తుదకు సఖ్యముతోడను, హిందూమహమ్మదీయైకమత్యముతోడను బరిసమాప్తిచెందినట్లు నీనాటకము సూచించుచున్నది.

**కథాసంగ్రహము**

చిరకాలమునుండి చిత్తూరుకోట వశపరచుకొనవలయునను తలంపున నక్బరుచక్రవర్తి తత్ప్రయత్నములు జరుపుచుండును. కాని వాని పరివారములోని యున్నతాధికారులైన మానసింహాదులు చిత్తూరు రాజపుత్రుల మహిమాతిశయములు చక్రవర్తి కతిం

గించుచు నట్టిదండయాత్రా ప్రయత్నములనుండి వానిని వారించుచుండిరి. చిత్తూరు రాణాను బంధువుఁడును విరోధియునగు 'జయచంద్రుఁ'డను నొక సేనాధిపతి మాత్రమే యీవిషయములోఁ జక్రవర్తిని ప్రోత్సహించుచుండెను. మానసింహునితోసమానమైన యున్నతోద్యోగము పడయవలెనని జయచంద్రుని యభీష్టము. చిత్తూరుకోట స్వాధీనముచేసికొని, తనయొద్దనున్న లతాంగియనుకన్యకనొసంగికొని, చక్రవర్తిని మెప్పించి తనయభీష్టము నెరవేర్చుకొనుటకు జయచంద్రుఁడు ప్రయత్నించుచుండెను.

ఒకానొక నౌరోజాయుత్సవములోఁ జక్రవర్తి స్త్రీవేషముధరించి స్త్రీలమధ్య సంచరించుచు లతాంగియను చెలిమితో 'ప్రమద'యను నొకకన్యకను మోహించెను. ప్రమద జయచంద్రునకుఁ జెల్లెలు వావిగలబంధుగురాలు. ఆసంగతి నర్మద తెలిసికొని లతాంగిని వెంటనే చిత్తూరుపంపివేసెను. చిత్తూరుయువరాజగు ప్రతాపసింహుఁడాదినములలో విక్రమసింగను మారుపేరుతోఁ బ్రచ్ఛన్నవేషమున సంచరించుచు, నుత్సవమునకు వచ్చినరాజపుత్రులకుఁ జక్రవర్తిగావించిన యకార్యము నెఱింగించి పౌరుషముపుట్టించి వారిని జక్రవర్తిపైకిఁ బురికొల్పెను. తానువరించిన లతాంగిని జిత్తూరువారే కొనిపోయిరని జయచంద్రుని మాటలునమ్మి చక్రవర్తి చిత్తూరు ముట్టడించెను.

రాణాయుదయసింగు చక్రవర్తితో సంధిచేసుకొనుటకుఁ బ్రయత్నించును. భార్యాపుత్రులైన వీరాభాయి ప్రతాపసింహులందు కంగీకరింపక చక్రవర్తి నెదిరించిరి. రాజపుత్రులును మొగలాయీలు యుద్ధముచేయుచుండఁగా నాకస్మికముగ రాణా శత్రువులకుఁ బట్టుపడెను. ఆక్షేపమున వీరాభాయి తన కుమారునిపై నాగ్రహించి తానే స్వయముగాఁ జక్రవర్తి శిబిరమును ముట్టడించును. రాణా పట్టుపడుటకుఁ గారకుఁడైన జయచంద్రుని బ్రతాపుఁ డెదిరించి యోడించి వానిని గారాగారబద్ధునిఁ గావించును. వాని ప్రియురాలైన లతాంగినియుఁ బురుషవేషముతో వీరాభాయికిఁ దోడుగా రణరంగమునందే యుండును. యుద్ధరంగ మంతకంతకు భీభత్సమగుచుండఁగాఁ బ్రమద "నన్ను నీవు పరిగ్రహించి యుద్ధమింకఁ జాలింపు"మని లతాంగి వ్రాసినట్లు చక్రవర్తికొక యుత్తరమువ్రాసి యాయుత్తరమును దానే ఫకీరువేషముతో వానికిచ్చును. అందుపైఁ జక్రవర్తియుఁ గృతకృత్యుఁడై సంతసించును. రాణా మొదలైనవారుఁగూడ ప్రమదను జక్రవర్తికొసఁగుటకు సమ్మతింతురు. అంతతో యుద్ధముముగియుటయు రాజపుత్ర మొగలాయిలకు సంధిజరుగుటయుఁ దటస్థించెను. ప్రమదాచక్రవర్తులకును లతాంగీప్రతాపులకును వివాహమహోత్సవములతోఁ గథముగిసెను.



**చరిత్రయెట్లు పయోగింపఁబడెను.**

మున్ముందొకసంశయము కలుగుచుండును. నాటకములో సూచింపఁబడిన ప్రత్యంశమును చరిత్రయొక్క గీటురాతి పరీక్షకు నిలుచునా? ప్రతాపునకును అక్బరునకును నట్టిపరస్పర స్నేహము కలిగెనా? ప్రమదాక్బరుల వివాహము చరిత్రచే నామోదింపఁబడునా? ప్రతాపునిభార్య లతాంగియేనా? ఉదయసింగంతటి సాత్వికమానిసియా? కేవలము పిఱికిపందకాఁడా? చరిత్రలోలేని జయచంద్రున కింతటి ప్రాధాన్యము నీయవచ్చునా మొదలగు నీప్రశ్నముల కన్నిటికి నొక్కటియే ప్రత్యుత్తరము. ఈయది సారస్వతసంబంధమైన నాటకముగాని చరిత్రభాగమున కుపయోగింపఁబడు వాచకము (a text book on History) కాదు. ఇందులకుఁ గార్యసూచనప్రాధాన్యము గానేరదు. కార్యమున కతీతమైన కారణములు, వానిరహస్యార్థములు, తన్మూలమున రసోత్పత్తి ముఖ్యముగ గమనింపవలసిన యంశములు. కేవల మసంభవమునకుమాత్ర మదనుగల్పింపక, చారిత్రకవిషయములను గ్రహించి యథేచ్ఛగాఁ గథనడపించు స్వాతంత్ర్యము కవికిఁబూర్తిగాఁ గలదను వరువడి, కాళిదాసు, భవభూతి, షేక్స్పియరు పెట్టియే యున్నారు. అట్టి స్వాతంత్ర్యము రసభూయిష్ఠముగ నుండవలెనుగాని, రసభంగము గలిగించి, యసంభవములను అసందర్భములను మాత్రము సృష్టింపరాదు. ఈ 'హిందూమహమ్మదీయ సమ్మేళనము'లో మూలమునఁ జరిత్రకు విరోధముగాకుండ మహత్తరములైన సమస్యలకు సమాధానములు గాన్పించుచున్నవి. భారతీయ మహమ్మదీయ సఖ్యతయే దేశక్షేమమని యీనాటకము నిరూపించుచున్నది. రక్తపాతము హేయమని మనకు దృఢవిశ్వాసమును బ్రోత్సహించుచున్నది. ఏకాలమునందైనను గుత్సితోద్యోగుల స్వార్థపరాయణత ప్రత్యేకవ్యక్తులకేగాక యొకప్పుడు దేశమునకుఁగూడ నెట్టిముప్పు వాటిల్లఁజేయునో వివరించుచున్నది. పూర్వదేశచరిత్రముయొక్క గూఢార్థమును వెలిబుచ్చుచుఁ బ్రకృతపు ముఖ్యాదర్శమగు హిందూమహమ్మదీయ మైత్రిని ధ్వనిగా సూచించుచున్నది. ఇన్నికారణములచే నీనాటకము రసవంతమై జనరంజకముగ నుండక తప్పదు. మఱియు యశోవంతమైన యార్యావర్తముయొక్క యహింసాతత్త్వమును విపులముగ వ్యక్తీకరించుటచేఁ గవియు నిజమైన దేశసేవాఫలమును గాంచుచున్నాడు.

**ప్రేమయొక్క స్వాతంత్ర్యత.**

చరిత్రవిషయమై యిట్లుండఁగ సారస్వతాంశమగు వేఱొక సందర్భమునఁ గృతికర్తస్వతంత్రత సాహసము గాన్పించుచున్నవి. ప్రపంచసృష్టి మొదలు నేటివరకును మహాకవులనేకులు ప్రేమనుగూర్చి వారివారి తత్త్వములను వెల్లడిచేసియే యున్నారు. అందు ముఖ్యముగ రెండుతెగ లేర్పడినట్లు తోచుచున్నది. ప్రేమ దేశ

ప్రధానకథ నణఁగఁద్రొక్కక లలితముగనే సూచింపఁబడెను. ఇంక వీరాభాయి రంగస్థలముపైఁ బ్రవేశించునపుడు తప్పక చండీశ్వరీదేవతను స్ఫురింపఁజేయుచు హిందూస్త్రీత్వమునకు వన్నె దెచ్చుచుండుననుట పొగడ్తగాదు. ఒకవిషయములోఁ గవిగారు తమవర్గము వారియెడఁగల పక్షపాతమును గ్రంథము చేసికొనిరని చెప్పక తీరదు. అస్థానకవియైన కుమారభట్టు పాత్రకై 'నేను ధరించెదను', 'నేనుధరించెదను' అని నాటకసంఘాధ్యక్షుని సామాజికులు వినిగింపక మానరు. తక్కుంగల పాత్ర లనవసరముగఁజొరఁబడక నాటకమునకు ముఖ్యములై యున్నవి.

**మారు వేషములు**

నవలలు వ్రాయుటయందు దారితేరినకవి తత్సాంప్రదాయములను నాటక రచనయందుఁగూడ విడువలేదు. వారినవలల యందువలెనే యీ నాటకమునందుఁగూడ నవలలు పురుషవేషములను ధరించెదరు. ఇట్టి విచిత్రపాత్రలసృష్టి షేక్స్పియరు నాటకములయందుఁ గలదు. బాల్యయౌవనకౌమారవార్ధక దశలన్నిటిలోను నిట్టిసందర్భములుఁగల నాటకములు, "The two gentlemen of Verona" As you like it' 'All is well that ends well,' Cymbline మొదలైనవి. కాని యిట్టిపరిస్థితి నాటకముయొక్క మూలభాగమును నసంభవమగు సంకోచస్థితిలో నుంచును గనుక వీలగునెడల నాటకములలో నట్టిమార్పులులేకుండఁ జేయుటకు మనము కవులను గోరవచ్చును. కష్టపడి యేకృష్ణమూర్తియో యేసత్యనారాయణయో లేక మరి యేవెంకయ్యయో స్త్రీవేషముతో సిద్ధమైనపిదప, వానినే తొందరగా నంటియు నంటని మీసములతోను, అట్టహాసముపైని 'విగ్గు'నుగప్పు తట్టపాగాతోను, చీరయే పంచగా వెనుకకు విరిచికట్టిన చిలకట్టుతోను, రంగస్థలముపైఁ బ్రవేశింపఁజేసిన, రూపకమునం దొకప్పుడు హాస్యరసము కొదువయైనచో నాలోపమును బూర్తి చేయునుగాని యందువలన మరియొక ప్రయోజనముండదు. వేరొకని నిందులకు నియమించుకొనవచ్చునన్న సమానమైన పోలికలుగలవా రుండుటదుర్లభము. పోలికలు లేకపోయినను ప్రేక్షకులెట్టులో సరిపెట్టుకొనెద రనుకొందము. కాని రసోత్పత్తికై రంగస్థలమునందే స్త్రీత్వమును బయలుపరచు సందర్భమునెట్లు సూచింపవీలగును? అపనుండుమునకు 'సెట్టు' తగ్గించి 'పటాష్కాయలు' పేల్చి వాడావిడిగా నియాడుమగవానిని బొమ్మని, మన మగయాడువానిని రమ్మనవలసినదేకదా? ఈయది రంగస్థలమునకు సంబంధించిన రహస్యమై, మనదేశమందు పురుషులే స్త్రీపాత్రలను ధరించెడు నాచారమునుబట్టి నాటకప్రదర్శనమునకుఁ బ్రతిబంధకము కలిగించుచుండును. కావున సాధ్యమైనంతవరకుఁ గవులు నటుల కష్టసుఖముల నాలోచింపవలసియుండును.



**నాటకరచన**

సామాన్యమగు నీయొక్క ప్రతిబంధకముదక్క నీనాటకమునం దసంభవప్రదర్శనముల కవసరము లేదనియే చెప్పవచ్చును. మఱియుఁ బ్రధానకథయు నుపకథయుఁ జక్కని యనుక్రమణమునుగాంచి, పాత్రధారులకుఁ దగువిశ్రాంతిని గలుగఁజేయుచుండును. ఒకపాత్ర సామాన్యముగ రెండురంగములయందు విశేషము పనిగలిగియుండదు. నటుఁడు తెరవైపునకే చూచుచు మొఱలిడనక్కరలేకుండ, ఎక్కడనో వీలులేని యుద్ధఘట్టములలోఁ దక్కఁ దక్కినచోటులఁ గథయంతయు రంగస్థలముమీదనే సూచింపఁబడినది. ఉత్తమదృశ్యకావ్యలక్షణలక్షితంబై యీనాటకము కొంతసంస్కరణ దృష్టితో వ్రాయఁబడినదని చెప్పవచ్చును. పద్యములు తగ్గింపఁబడినవి. పాత్రల యౌచిత్య మాసమయములయందుఁ బాటింపఁబడినది. ముందు ముందు వ్రాయఁబడు గద్యనాటకముల కియ్యది మార్గదర్శికాకబోదు. ముద్దుపలుకులకుఁ బేరుగాంచిన కవికైలింగూర్చి వేరుగవ్రాయనవసరములేదు. అనవసరపాండిత్యప్రకర్షతో వ్యర్థశబ్దాడంబరములేని యేతత్కవి యార్థికుఁడుగాని వాచకుఁడుగాడు. నాటకములయందుఁ బద్యగద్యరచన మెట్లుండవలయునో యిందు గ్రహింపవచ్చుననుటయు నతిశయోక్తి గానేరదు.

**నీతి**

ఈనాటకమందు మహత్తరమైన యంశము, ప్రకృతమున దేశభక్తులదృష్టిని కేంద్రీకరించు సాంఘిక సమస్యయగు హిందూ మహమ్మదీయసమ్మేళనము. ఇది యాదర్శప్రాయముగ నిందు సూచింపఁబడుచున్నది. మరియుఁ బ్రపంచమునందు వైరము ప్రబలకారణములు లేకయే, యసూయచేతనో మోసముచేతనో పరస్పరగుణావగుణగ్రహణ విజ్ఞానరాహిత్యముచేతనో, యెట్లు సాధారణముగఁ బెంపఁబడుచుండునో యీనాటకము ధ్వనిగా సూచించుచుఁ దన్మూలమున మార్దవమైనట్టియు నత్యంతనీతిదాయకమైనట్టియు నొకవిధమగు నున్నతహాస్యరసము సృష్టించుచున్నది. అక్బరు ప్రతాపుల విగ్రహకారణము నొకింత సూక్ష్మదృష్టితోఁ జూచిన నయ్యది తెల్లమగును. వైరమునకుఁ [illegible]ణము క్షాత్రరక్షణముగదా? అది యీనాటకమునం దెట్లు పరిణమించెను? మనస్ఫూర్తిగఁ జక్రవర్తిని బెండ్లాడ నిశ్చయించిన లతాంగి (అనఁగా ప్రమద) యొక్క క్షాత్రరక్షణమునకై కదా ప్రతాపుఁడింతటి విక్రమాటోపమును బొందినట్లు తేలినది? ఏలతాంగికై తాను ని[illegible]రఁదలఁచెనో యాలతాంగి యెన్నఁడును దనమానము పరులచే రక్షింపఁబడవలసినంత [illegible] యపాయస్థితిలో నుండలేదు. అందుచేఁ బ్రతాపుని విక్రమాటోప మనవసరప్రాగల్భ్యమై తుదకుఁ దండ్రిగారి శాంతిమతమునకే లోనయినది. ఆవేశపూరితులై చీమచిటుక్కుమన్న మాత్రమున శౌర్యముతో విజృంభింపఁ జూచువారిస్థితి యూరడెగరఁబోయి బొరదు

"క్రుంగు" నట్లు తప్పక విధి నిర్ణయముచే నగుచుండునని ప్రతాపుని శీలమువలన గ్రహింప నగును. ఆరీతినే అక్బరుకూడఁ దగురీతి ఖండలింపఁబడెను. యుద్ధమున జయించి పిదప శాంతి నెలకొల్ప నెంచెనుగాని, "అన్యథా చింతితంకార్యం దైవమన్యత్ర చింతయేత్" అనునట్లు, దరిదాపుగ వీరాభాయిచేఁ బట్టువడుటకు సిద్ధమగుటచే, సంగ్రామ ఫలనిర్ణయము కేవలమానవాధీనము కాదనియు, మానవశక్తికిఁ బరమైన శక్తి దైవరూపమునఁ గలదనియు, నయ్యది రక్తస్రావము కోరువారి గర్వోన్నత దశయందు బుద్ధి నచ్చెదురీతిని దగు మొట్టికాయలు మొట్టకమానదనియు నక్బరుశీల మెఱుఁగఁజేయును. ఉద్రేకపీడితులైన వీరిరువురును ఉదయసింగునకు లోఁబడు నట్లు చేయుటలో, హింసాపరులై యధికారగర్వముచేతను, పశుబలముచేతను విఱ్ఱవీగువారు విధినిర్ణయమును బాగుగ నెఱింగెదరుగాక!

దేశభక్తి, అహింసాతత్త్వము, అవ్యాజప్రేమావిధానము మొదలగు మహత్తరోద్దేశములను సూచించుచుఁ దననామధేయమగు 'నౌరోజా' యను మాటవలననే హిందువులకుఁ బ్రియమగు నవరాత్రదీక్షను స్ఫురింపఁజేయుచు, హిందూమహమ్మదీయ సమ్మేళనము సమకూర్పు నీనాటక నౌరోజా (fresh rose) ఆంధ్రులకేగాక హైందవుల కందరకు నాహ్లాదజనకంబగుఁగాక!!!

ఇట్లు విన్నవించు సారస్వతసేవకుఁడు
రా. సీ. రామచంద్రరావు, ఎం. ఏ. ఎల్. టి.
ఎలమంచిలి.

# నౌరోజా

## ప్రథమాంకము

### ప్రథమరంగము

[జయచంద్రుని మందిరము-ప్రవేశము-ప్రయాణసన్నాహముతో నిలువుటద్దముకడ దుస్తులు సవరించుకొనుచు జయచంద్రుఁడు - తాంబూలపళ్లెరముతో ప్రమద.]

జయ—ప్రమదా! నేనిచ్చిన యుత్తరములన్నియు నాచేతిపెట్టెలో నుంచితివికదా.

ప్రమ—మీరుచెప్పినట్టులే భద్రముగా నుంచితిని. బండి యింకను రాలేదు. మీరు సావకాశముగాఁ దాంబూలమునుగూడ వేసికొన వచ్చును. (అందించును.)

జయ—(నవ్వుచుఁ గైకొని) అమ్మాయీ! నాకొఱకుఁ దాంబూలము సైతము సిద్ధముచేసితివా?

ప్రమ—ఔను. వదినగారితో మీరు మాటలాడుట మానివేసినప్పుడు మీ సంరక్షణము—

జయ—(మొగము చిట్లించుకొని) ఆమూర్ఖురాలి ప్రసంగ మిప్పు డెందుకు?

ప్రమ—మీకింత యాగ్రహము వచ్చుట కామెచేసిన యపరాధమేమి?

జయ—ఏమియునులేదు. అపరాధమంతయు నాయందే యున్నది. అందుకే యనుభవించుచున్నాను. అనుదానికి లొంగిన యప్రయోజకులలో నీనిర్భాగ్య జయచంద్రుఁ డొకఁడు.

గీ॥ మితికిమీరినచను వొసంగితిని దొలుత
నదియె శ్రుతిమిరిచి రాగంబునందుఁబడియె
నెత్తిపై నాలి నిడికొన్న నిందితునకుఁ
గలుగు పాట్లెల్ల నాకును గలిగెనమ్మ॥

ప్రమ—ఇది కోపాతిశయమున మీరన్నమాటయేగాని వదినగారికీపాటి చనవొసంగుట యపరాధమెట్టులగును?

జయ—అపరాధముకాదా? కోటలోని రాజ్యాంగ విషయములను గూర్చి యాడుదానితోఁ బ్రసంగించుట యపరాధము కాదా ప్రమదా!

ప్రమ—అట్టులైన రాజ్యాంగవిషయములను గూర్చి ప్రసంగించు యోగ్యత స్త్రీలకు లేనేలేదా? పోనిండు. వదినగారితో మీరు ప్రసంగించిన యా రాజకీయ రహస్యమేదియో నేను వినవచ్చునా?

జయ—(నవ్వుచు) వెఱ్ఱిదానా! వినవచ్చునాయని యడుగుచున్నావా! ఆడుదానితోఁ జెప్పిన సంగతికి రహస్యముగూడ నున్నదాయేమి? (ఇటునటుఁ జూచి) చెప్పెదనుగాని కోటలోనుండి బండివచ్చినంతనే నాకెఱింగింపవలసినదని మన ద్వారపాలునకుఁ గబురంపి రమ్ము.

(ప్రమద నిష్క్రమించును.)

జయ—(తనలో) ఇదియుమంచిదే! ఈప్రమద నాధారముగాఁ జేసికొని నర్మదను గొంతవరకు మార్గములోనికిఁ దెచ్చుటకుఁ బ్రయత్నించెదను.

గీ॥ కాంత లతిమూర్ఖచిత్తలుగాన వారి
చిత్తమూర్ఖత్వమును మూర్ఖచిత్తులైన
మగువలేగాని మగవారు మార్పఁజాల
రినుముసాధింప సాధన మినుము కాదె॥



ప్రమద—(ప్రవేశించి) అన్నయ్యా! కబురంపితిని. బండి యింకను రాలేదు. ఇంక నేనడిగినది సెలవిచ్చెదరా?

జయ—ప్రమదా! నర్మదకుఁ జెప్పినందువలన నింతయైనది. ఇంక నీకుఁగూడ నెఱిగింపుమనుచున్నావా?

ప్రమ—మీకాసంశయ మక్కరలేదు. మన మన్నదమ్ముల బిడ్డలమైనను రణరంగమున మాతండ్రి గతించిననాటనుండియు నన్ను మీసొంత చెల్లెలుకంటె నెక్కుడుగఁ జూచుకొనుచున్నారుగదా మీయెడ ద్రోహబుద్ధి వహింతునా? మీ సెలవైనయెడల వదినగారి చిత్తవృత్తి మీకనుకూలముగ మార్పఁ బ్రయత్నించెదను.

జయ—అట్టులైన విను. (కొంచెమాలోచించి) చిత్తూరివారికున్నంత సన్నిహితబాంధవ్యము నాకు లేకపోయినను బాల్యమునుండియు నాకడనే యుండుటంజేసి మన లతాంగిని నేనెంతగారాబముతోఁ బెంచుచుంటినో నీవెఱుఁగుదువుకదా!

ప్రమ—ఎఱుఁగకేమి? నేనేగాదు. లోకమంతయు నెఱుఁగును.

జయ—నాసంరక్షణముచేతనో యామె యదృష్టముచేతనో లతాంగి గుణశీలములయందు మహారాణుల కుండఁదగిన లక్షణములు నాకుఁ గానవచ్చుచుండుటచేత నేనామెను అక్బరుచక్రవర్తికి సమర్పింపవలెనని నిశ్చయించుకొంటిని.

ప్రమ—(సంతోషముతో రెండుచేతులును జఱచి) ఆహా! ఏమియదృష్టము! ఏమియదృష్టము! అన్నయ్యా! లతాంగికట్టి మహాభాగ్యమెంతలో రానున్నది?

జయ—ఏమో తెలియదు. ఆమె యదృష్టప్రవాహమునకు నర్మద యానకట్టయి యున్నది.

ప్రమద—(ఆతురతతో) అయ్యయ్యో! వదినగారి కీసంబంధ మిష్టము లేదా యేమి?

జయ—ఔను. ఇష్టములేదు. నేను దేశద్రోహినట. అది దేశభక్తు రాలట. స్వదేశసేవయుట. జాత్యభిమానమట. హిందువులట. తురక లట. ఒకటిగాదు. రెండుగాదు. నే నీసంగతి చెప్పినంతనే నోటికి వచ్చినవెల్ల గూసినది.

ప్రమ—(నోరుమూసికొని) ఎంతదారుణము. ఎంతదారుణము. ఇట్టి మాటలు మీయెదుట నాడఁదగినవా? వదినిగారి సౌమ్యభావ మంతయు నేమైపోయినది! మీసంకల్పమును అందుకు వదినగారి వికల్పమును నెఱింగినయెడలఁ బాపము లతాంగి యెంత క్షోభ పడునో!

జయ—అట్లయిన సంతోషమే కాని తురకలనియు హిందువుల నియు నాయెదుటనే యుపన్యాసము లారంభించిన నర్మద, లతాంగిని నామాట వినని చ్చునా? ఇంతకు నొక్క నర్మదయననేల? మహ మ్మదీయ నిరసనంబను నీయంటురోగము దేశమునందంతటను బ్రాకి నది. ఆనిరసనభావ మంతరించినఁగాని హైందవకుటుంబములకు సంపూర్ణ క్షేమము గలుగదు.

గీ॥ తురకలని హేయముగఁ జూచు కఱకుబుద్ధి
యడఁగి యేనాడు హిందూమహమ్మదీయ
సంఘసమ్మేళనంబది జరుగఁగలదో
భరతభూమికి నది శుభప్రదదినంబు॥

ప్రమ—అట్టిసమ్మేళన ప్రయత్నములు జరుగుచున్నట్లులేకదా? చక్ర వర్తి హిందూరాజపుత్రకన్యలను వివాహమాడుచుండలేదా? మున్నసే కదా మానసింగు తనచెల్లెలను—

జయ—ఔను. తనచెల్లెలను చక్రవర్తి కొసంగుటచేతనే మానసింగు కిప్పు డేడువేలమన్సబున కమీర్లైనవాడు గావలసినవాఁడు.

ప్రమ—అన్నయ్యా! అది యంతపెద్దయుద్యోగమా?



జయ—కాదామఱి-చక్రవర్తి కుటుంబస్థులకుఁ దప్ప నిదివరకు హిం దువుల కెవ్వరికి నింతటి గొప్పయుద్యోగము లొసంగఁబడలేదు. ప్రస్తుతము నాకుఁ గల మైదువేల మన్సబు మాత్రమే హిందు వుల యున్నతోద్యోగముగాఁ బరిగణింపబడుచున్నది.

ప్రమ—ఇవి యన్నియు సమన్వయించి చూడ లతాంగిని జక్రవర్తి కొసంగినయెడల మానసింగువలె మీరుఁగూడ—

జయ—ఇప్పుడా నీకు స్ఫురించినది వెఱ్ఱిదానా! నేను ముఖ్యముగా విచారించుచున్న దిందుకొఱకే. నాకును లతాంగికినిగూడ రానున్న మహాభాగ్యమునకు దుర్మదయగు నర్మద యెంత భంగకారిణి యగుచున్నదో చూడు.

ప్రమ—నిజముగా నిది రాజకీయవిషయము. వదినగారిందులో సం బంధము గలిగించుకొనుట మిక్కిలి పొరపాటే.

జయ—తప్పక పొరపాటే.

గీ. దేశభక్తుల మనుచు, స్వదేశసేవ
యనుచు రాజకీయాంశంబులందు నల్ప
బద్ధులెల్లఁ బ్రవేశించి బుధులొనర్చు
నుద్యమంబులు చెఱచుచునుందు రబల॥

సేవకుఁడు ప్రవేశించును.

సేవ—గాడీ తయార్ హై మహారాజ్.

జయ—(తటాలున లేచి యుత్తరీయము సవరించుకొనుచున్నాఁడు)

ప్రమ—అన్నయ్యా కోటలోని కేగుటకు నేడింత తొందరపడు చున్నారేమి!

జయ—ఔను. కొంత తొందరపనియున్నది. చక్రవర్తి సమక్షము నందుఁ జిత్తూరువారిం గూర్చి ప్రసంగము జరుగఁగలదు. ఇందు

కొఱ కితరరాజ్యములనుండికూడఁ బ్రతినిధులు వచ్చియున్నారు. నే నెట్టులైనఁ జిత్తూరుకోటచక్రవర్తికి స్వాధీనము చేసినయెడల—

ప్రమ—ఔను. మీకు మంచి సన్మానము జరుగఁగలదు. మొదట నుండియు మీ రీవిషయములో మిక్కిలి పట్టుదలతో నున్నారు కదా?

(ఇరువురు నిష్క్రమింతురు)

---

## — ద్వితీయరంగము —

[అక్బరు సభాభవనము-ప్రవేశము-అక్బరు-మానసింగు జయచంద్రుఁడు—విక్రమసింగు—మఱికొందఱు రాజపుత్రులు.]

అక్బ—అమాత్యమణులారా! ఎందఱెన్నివిధముల వాదించుచుండినను సారాంశ మీగడియవరకుఁ దేలలేదు. చిత్తూరురాజపుత్రులు పవిత్రచరిత్రులు. శ్లాఘాపాత్రులు. అందుచే సామాన్యదుర్గములపై విజృంభించినట్టు చిత్తూరుదుర్గముపై విజృంభింపరాదు. మరల సావకాశముగ నాలోచింపుడు. (సభ్యులందఱు నాలోచన మభినయింతురు)

జయ—దేవా! రాజనీతికి భంగము రానీక పెక్కుభంగుల విమర్శించి సారాంశమునే విన్నవించుకొనుచున్నాను. చిత్తూరువారు ధర్మమూర్తులనియు శాంతచిత్తులనియు ననేకుల యభిప్రాయము. నాకట్టితలంపు లేదుగాని యట్టియభిప్రాయములో నేకీభవించినంత మాత్రమున నావాదమునకు బలము చెడదు.

అక్బ—ఎందుచేత?

జయ—నేరస్థులు దేవరయెదుటకుం గొనిరాఁబడినప్పుడు, వారి నేరములను విచారించి, యుక్తమగు దండన విధించుటయేగాని, వారి



యందలి తక్కినసుగుణములం బరిశీలించి విడిచిపెట్టుచుండిన యెడల నింక లోకములో దండ్యు లెవ్వరు? ధర్మజ్ఞత్వము శాంతమూర్తిత్వము మొదలగు నెన్నిసద్గుణములు గలవారైనను దేవరకుఁ గప్పము చెల్లింపక తక్కిన రాజపుత్రులతోఁబాటుగ దేవర సార్వభౌమత్వము నంగీకరింపక యవిధేయు లగుటచే నవిధేయతాపరాధముక్రింద నాచిత్తూరువా రవశ్యముగ దండనార్హులని నా నిశ్చితాభిప్రాయము.

అక్బ—ఇప్పుడు నీవు చెప్పిన దండనీతి ననుసరించినయెడల గుణావగుణవిచారమునకును యుక్తాయుక్తవిచక్షణమునకును జోటుండదు. ఆరెండును బరిత్యజించినవానిని రాజనుటకంటె ననౌచిత్యమేమున్నది?

విక్ర—(లేచి) మేలు! మేలు! అక్బరుచక్రవర్తీ!—

మాన—(ముక్కుపైఁ వ్రేలిడుకొని మాటాడవలదనియుఁ గూర్చుండుమనియు విక్రమసింగునకు సూచించును)

అక్బ—(అదికనిపెట్టి వానిని మాటాడ నిమ్మని మానసింహునకు సూచించును)

విక్ర—మీసుగుణసంపద యిదివఱకు విన్నదానికి నేఁడుగన్నదానికి సరిపోయినది.

చ॥ పలుకులలో మృదుత్వమును భావమునం గృపరాజ్యకార్యముల్
సలుపునెడన్ వివేకము, స్వశత్రులమేలిగుణంబు లేనియున్,
దలపునమెచ్చికొంట, నిజధర్మమునం దనురక్తి యిన్నియున్
వెలసెడుసార్వభౌముఁడు లభించుటదుర్ఘటమెట్టివారికిన్॥

మాన—మహారాజా! ఏయపరాధుల దండించునప్పుడైన న్యాయశాస్త్రము ననుసరింపవచ్చును గాని రాజకీయాపరాధులవట్ల మాత్ర మట్లుకూడదు. పూజ్యులైన చిత్తూరు రాజపుత్రులవంటి ప్రసిద్ధపురు

షులను మన మనాళ్లోచితముగ దండించునెడలఁ బ్రజల చిత్తములె
ప్పటికెట్లు మారునో చెప్పఁజాలము. ప్రభువులయెడఁ బ్రజలకు
వ్యతిరేకభావము జనింపకయే యుండవలయునుగాని జనించిన పిమ్మట
దానిం దొలంగించుటకుఁ గొన్ని శతాబ్దములైనను బట్టును. ఇంతియే
గాక చిత్తూరు రాజ్ఞీమణియైన మీరాబాయిని రాజస్థానమునఁగల
మా రాజపుత్రకుటుంబము లన్నియు గులదేవతగాఁ బూజించు
చున్నవి. ఆమె జగదంబావతారమనియే యనేకుల దృఢవిశ్వాసము.
తత్కుమారుండైన ప్రతాపసింహుఁడును వీరారాతికుల భయంకరుఁ
డు. అపరకుమారస్వామి.

విక్ర—(తనలో) శబాస్! మానసింహా! పూజ్యురాలైన మాతల్లిగారి
నిట్లు స్మరించుటచే ధన్యుఁడవు. మత్ప్రతాపాతిశయమును గుర్తించిన
వాఁడవగుటచే నదృష్టవంతుఁడవు.

అక్బ—మానసింగ్! మీ వితర్కమింతతోఁ జాలింపుఁడు. ఈ రాజపుత్ర
ప్రతినిధులలో నెవ్వరైననీయంశముం గూర్చి ప్రసంగింతురుగాక!

మాన—చిత్తము-(అని యందర మొగములఁ గలయఁజూచును)

విక్ర—(లేచి) జయతు జయతు సార్వభౌమ!

(అందఱు వాని నాశ్చర్యముతోఁ జూతురు)

అక్బ—నీయభిప్రాయము మాకు విన్నవించుటకుఁ బూర్వము నీవెవ్వరో
మాకుఁ దెలియవలసియున్నది.

విక్ర—దేవా! నేను జిత్తూరు మండలాంతర్గతంబైన యొకానొక జాగీరున
కధికారిని. చిత్తూరు మండల ప్రజాప్రతినిధిని. నన్ను విక్రమసింహుఁ
డందురు.

అక్బ—నీవు చిత్తూరు ప్రజలకా ప్రభువునకా ప్రతినిధివి?

విక్ర—ఎట్లైననొకటియే కదా! ప్రజల హృదయములన్నియు నేకీభవించి
వాల్లినమూర్తియే రాజు. దీనికి భిన్నమైనపుడా రాజు రాజుగాఁడు.



తత్ప్రజలు ప్రజలుగారు. దైవానుగ్రహమున నట్టిభిన్నభావమీక్షణము
వరకు మామండలమున లేకుండుటచేఁ బ్రజాప్రతినిధినైన నన్ను
రాజప్రతినిధిగా సైతము పరిగ్రహింపవచ్చును.

(అందఱు నొకరినొకరు చూచి మొగము లెగరవేయుచున్నారు)

అక్బ—(శిరముపంకించి) బాగున్నది. విక్రమసింగ్! ఇప్పుడీ దర్బారు
లోఁ జిత్తూరు ప్రతినిధిగాఁ బ్రసంగింప సమర్థుఁడ వైతివి. ఇఁక
నీ చెప్పఁదలంచిన దేదియో చెప్పవచ్చును.

విక్ర—దేవా! అత్యంత తేజోవంతులైన చిత్తూరు రాజపుత్రులు మి
మ్మభ్యుదయ పరంపరాభివృద్ధిగా నాశీర్వదించుచున్నారు.

అక్బ—మహాత్ముల యాశీర్వాద మమోఘముగదా?

విక్ర—అత్యధిక శౌర్యసంపన్నుఁడగు బేబరుచక్రవర్తియు దయా
ధైర్యౌదార్య విద్యావ్యసనాథుఁడగు హుమయూను చక్రవర్తియొక్క
యుఁ బరిపాలనా లీలల వింతకథలుగాఁ జెప్పుకొనుచు నమ్మహా
మహులకుఁ బౌత్రులును బుత్రులునగు తమ యుత్తమజన్మం
బెంతయు ధన్యతమంబని మీ ప్రసంగము వచ్చినప్పుడెల్ల మా రాజ
పుత్రులు మిమ్మెంతయు శ్లాఘింపుచుందురు.

అక్బ—మా మొగల్ రాజకుటుంబమునం దింతటి గౌరవాదరణములు
గల మీ రాజపుత్రులు మా సమ్మానమును బడసెదరుగాక!

విక్ర—(సంతోషముతో) సార్వభౌమా! నిరంతరము మా చిత్తూరు
రాజ్యలక్ష్మి మీ యొద్దనుండి యభిలషించుచుండు మహోవర మీ
సమ్మానమే. ఈ సమ్మానమే మా స్వాతంత్ర్యము. మమ్ము సమ్మా
నించుటయన్న మా స్వాతంత్ర్యమును మాకొసంగుటయే. ముల్లో
కము లొక్కపెట్టున నెత్తివచ్చి పైఁబడినను జిత్తూరు మండల
మా బాలగోపాలమును గాపాడుకొనఁ జూచుచుండున దీస్వాతంత్ర్య
మునే. సతతంబును నీస్వాతంత్ర్యమే మాకు ధనప్రాణాధికంబగు

నమూల్య పదార్థరంబు. ఇట్లు నిరంతర స్వాతంత్ర్య సంభ[illegible] చేతనే చిత్తూరు రాజ్యము రాజపుత్ర రాజ్యంబులకెల్లఁ [illegible] బగుచున్నది. ధరామండలంబునం గల సకలరాజ మండలములకును మా మండలంబు మండనాయమానంబై ఖ్యాతమ్మును విఖ్యాతమ్మునగుట కీస్వాతంత్ర్యమే ముఖ్యకారణము. అహింసాపరత్వమును-అజాత శత్రుత్వమ్మును గలిగి, పరరాజ్యాక్రమణాసక్తియుఁ బరధనాసక్తియు లేక, స్వప్నమందైన యుద్ధరంగములన్న సేవగించు మా రాజపుత్రుఁడు-ఒకప్పుడు ఖడ్గహస్తుండగు నెడఁ దత్ఖడ్గధారణంబునకు స్వాతంత్ర్య సంరక్షణముకంటె మించిన కారణంబు గలుగనేరదు. మీ రాజ్యంబునఁ బ్రజాపోషణము-మా రాజ్యంబున స్వాతంత్ర్యపోషణము. మీ ఖడ్గంబులు శిష్టరక్షణముకొఱకు-మా ఖడ్గంబులు స్వాతంత్ర్య రక్షణముకొఱకు. మీ సేనలు స్వపరిపాలనా స్థాపనము కొఱకు-మా సేనలు స్వాతంత్ర్య స్థాపనముకొఱకు. సార్వభౌమా! పలుపలుకులేల? మా చిత్తూరుమండలంబున వీచు వాయువునందుఁ దోచు నిస్వనమ్ము స్వాతంత్ర్యంబనియే వినవచ్చుచుండును. పురాతనమందిరంబులందలి చెదపుర్వులల్లిన చెదలయందును స్వాతంత్ర్యమ్మను నక్షరమ్ముల పోలికలే తోచుచుండును. కీటకచ్ఛిద్రితంబులై గాలికెగురు నెండుటాకులలోని రంధ్రమ్ములును స్వాతంత్ర్య సమవర్ణముల కరణినే కానవచ్చుచుండును. అక్షరాభ్యాసానంతరము విద్యారంభులగు డింభకులకు మా యయ్యవారలు సెప్పు తొలిపాఠమ్ము స్వాతంత్ర్యమును గూర్చియే. ఇట్లు సకలవిధంబుల స్వాతంత్ర్యైక లోలురమగు మాకు నుచిత సమ్మానమ్మును సంఘటించిన మిమ్ము సర్వేశ్వరుండు చిరాయురున్నతులసమ్మా నిరచుఁగాక!

(అందఱు నిశ్చేష్టితులగుచున్నారు.)



అక్బ—(శిరము పంకించుచు) విక్రమసింగ్! నీ వాక్యములు గంభీరార్థకములు. నీయర్థంబెల్ల మాకుఁ దెల్లంబయినది. చిత్తూరు వారింగూర్చి నీవు చెప్పఁదలంచిన యంశమ్ము నీమాటలచాటుననే వ్యక్తమైనది. అది యట్లుండనిమ్ము. నీవు వలసినంత లోకానుభవమ్ము లేని లేఁబ్రాయమువాఁడవు. విశేషించి మా దర్బారునకుఁ గ్రొత్తవాఁడవు. చిరపరిచితులైన మహారాజులకు సైతము మాట తడబాటు గలిగించు మా సాన్నిధ్యమున జంకుఁగొంకు లేని నీ పుష్కల వాక్చతురత్వము మాత్రము మా కాశ్చర్యము గొలుపుచున్నది.

విక్ర—(నవ్వుచు) సత్యస్వరూపులును ధర్మమూర్తులునగు దేవరయెదుట నిష్కళంకచిత్తముతో మాటాడువానికిఁ దడబాటేల? దేవా! మనసునఁ గళంకములేకయే మాటలయందుఁ దొట్రుపాటుండదు. అసత్యోక్తులకును బాపపుఁ దలఁపులకే గాని సత్యమునకును ధర్మమునకును జంకును గొంకును గలుగనేరవు.

అక్బ—బాగున్నది. నయవినయాది గుణగణాలంకారుండవగు నీయుత్తమశీలము మా మెప్పువడయుచున్నది. నీవింకను గొన్ని దినంబులిందుండ వలసియుండునేమో! కొలదిదినంబులలోనే మా పట్టణమున నౌరోజా మహోత్సవము జరుగఁగలదు. అయ్యుత్సవమ్ము ముగియువరకు నీవు మాకతిథివై యుండగలవు. జయచంద్రుఁడు మీ చిత్తూరు రాణాకు బంధువుండగుటచేతఁ దద్గృహావాసము నీకుఁ బరమసమ్మతంబని తలంచెదము. జయచంద్రా! దర్బారునకు వచ్చిన రాజపుత్ర ప్రతినిధులెల్లరు నుత్సవానంతరమువరకు నిందుండ వలయునని మా యాజ్ఞ నెఱింగించి వారికెల్లరకుఁ దగిన వసతులేర్పఱుపుము.

అక్బ—మానసింగ్! ఉత్సవప్రయత్నములు రేపటినుండియే ప్రారంభింపఁబడవలయును. మాండలాధిపుల కెల్లరకు నాహ్వానములు పంపి యియ్యుత్సవోదంతమును బ్రకటింపుము.

మాన—చిత్తము.

## ద్వితీయాంకము.

### —ప్రథమరంగము.—

[జయచంద్రునిమందిరము-ప్రవేశము-సుఖాసీనుఁడై యాలోచన మభినయించుచు జయచంద్రుఁడు.]

జయ—(స్వగతము) బాగున్నది. ఈవిక్రమసింగువ్యవహారము నాటకములోని యంతర్నాటకమువలె నున్నది. ఇది తలపనితలంపు. పాదుషా కిట్టిసంకల్పము వొడమునని కాని, నాకిట్టి నూతనకార్యభారము తలపైఁబడునని కాని నేనెన్నఁడు ననుకొనలేదు. ఒకవిధముగా నాలోచించినయెడ నిదియు మంచికే వచ్చినదేమో? చతుర్విధోపాయములఁ బ్రయత్నించి బోధించి, సాధించి, విక్రమసింగును పాదుషా కొలువున కంగీకరింపఁజేసితినా యిది మంచికి వచ్చినట్టులే? చేయలేనియెడ?-నాకేమైన నపాయముండునా?-తప్పక యుండును. జయచంద్రా? నీవీవిషయములో శ్రద్ధగాఁ బనిచేయవలయును జుమా! యని చక్రవర్తి పలికినప్పుడు వాని కీవిక్రమసింగు కొలువునం దెక్కుడు ప్రీతియున్నట్టు లేకదా? ప్రీతియే గాదు-పట్టుదలయు నున్నట్లు తోఁచుచున్నది. అందుచే నాకీకార్యభారము సామాన్యముగాఁ దలంపరానిది. అవశ్యముగా సాధింపవలసినది. ఇంక నాలోచింపవలసినవిషయము కార్యసాధనావిధానము. ఏయుపాయంబున వీనిని జక్రవర్తి కొలువున కంగీకరింపఁజేయఁగలను? నయముచేతనా? భయముచేతనా? మొన్నటినుండియుఁ గూడ వానితోఁ దరుచుగాఁ బ్రసంగము గల్పించుకొనుచు-చక్రవర్తి-వానియౌదార్యము-వితర

ణము-ఆతనికొలువు-అందలిసౌఖ్యము-ఇచ్చటియుద్యోగులకు జరుగు సన్మానములు-అనుగ్రహపాత్రులయున్న తపదవులు- మొదలగువంశముల ముచ్చటించిచూచితిని. కాని యివేవియు వాని మనసున కెక్కినట్లు నాకుఁదోచలేదు. పాదుషామోలసంత నిర్లక్ష్యభావముతో-అంతటిధైర్యసాహసములతో మాటాడినవానిని భయపెట్టి సాధించుటగూడ కేవల మసంభవమే. అందుచే నయభయంబులు రెండును వీనియెడ నిష్ప్రయోజనములు. ఈ రెండస్త్రములును వీనిని సాధింపఁజాలవు. ఇంతకంటె మహాస్త్రములుండవలయు. అయ్యవి యమోఘంబులు గావలయు. అమోఘంబులే కాక, సమ్మోహనాస్త్రమువలెఁ గరచరణంబులాడకుండఁ జేయవలయు. (స్మృతినభినయించి) ఆఁ-సమ్మోహనాస్త్రము! నాయొద్ద రెండు సమ్మోహనాస్త్రములున్నవికదా? అందొకటి చక్రవర్తికై వినియోగింపవలెనని నిశ్చయించితినిగదా? రెండవదాని నీవిక్రమసింగుపై నేల ప్రయోగింపరాదు?-(సంతోషముతో) శబాస్! ప్రమదా! చిన్నప్పటినుండియు నిన్నుఁబెంచి పెద్దచేసినందుకు-ఇన్నాళ్ళకు నీవలని ప్రయోజనము కలిగినది.......ప్రమదను విక్రమసింగున కంటఁగట్టుటలో నాకధిక ప్రయాస మక్కరలేదు. అదినేనెట్లు చెప్పిన నట్లు నడచుకొనఁగలదు. కాని కొంచెము గంభీరహృదయ- మనసులోని యుద్దేశములను వెలుపలికిఁ దోపనీయదు. తలంచినపని యొనరించుటయేగాని యొకరితో నాలోచింపదు, లతాంగివంటి లోకైకసుందరి కాకపోయినను విక్రమసింగును గీలుబొమ్మవలె నాడింపఁగల రూపురేఖలుగలది కాకపోలేదు. ఇంతవరకు స్త్రీలు చపలచిత్తులనియు పట్టి యప్రయోజకురాండ్రనియు నాతలంపు. రాజ్యాంగ విషయములలో వారినుపయోగించినయెడల నెంతటి కష్టకార్యమైనను సాధింపవచ్చును. అందుచే నాయభిప్రాయము మార్చు



కొనవలయును. మార్చుకొని నర్మదతో సమాధానపడవలెను... ఏమీ?...ఆమూర్ఖురాలితో నాకేమియవసరమున్నది?

[ప్రవేశము—ప్రమద-]

ప్రమ—అన్నయ్యా! ఆహ్వానపత్రిక.

జయ— ఎక్కడనుండి వచ్చినదమ్మా?

ప్రమ—కోటలో నుండి

జయ—ఎవరికి?

ప్రమ—వదినగారికి-మహారాణి యొద్దనుండి-ఉత్సవమునాఁడు దర్శనమునకు రమ్మని-

జయ—ఆలాగునా? ఏదీ? (పుచ్చుకొని చూచి) ఉద్యోగస్థుల భార్యలకీయాహ్వానపత్రికలు నిన్నటి నుండియు పంపఁబడుచున్నట్లు నిన్న నేవిన్నాను. మీ వదిన చూచినదా?

ప్రమ—చూచినారు. మీరు చూడవలెనని పంపించినారు.

జయ—(అది వినిపించుకొనక యాలోచించుచు) నాప్రయత్నములలో లేశమును నాకనుకూలపడకపోవుటయే గాక, ప్రతికూలముగ నడచుచుండిన నర్మదనుండి సైతము నాకొక చిన్న ప్రయోజనము స్ఫురించుచున్నది. చిన్న ప్రయోజనమే గాదు. నర్మద బుద్ధికుదిరి పనిచేసినయెడలఁ బెద్ద ప్రయోజనమే. తన పుట్టిన దినము నాడొక మారును-విజయదశమి నాడింకొక మారును-మహారాణి యుద్యోగస్థుల భార్యలందరిలో నర్మదయెడమంచి యాదరణ చూపించినదట. నయవినయములతో నర్మద గట్టిగాఁ జెప్పినయెడల మహారాణి చక్రవర్తిని హెచ్చరించి, నాకును సప్తహజారీ మన్సఫ్దార్ పదవి నిప్పింపఁగలదు-కానసాగినయెడల రాజనీతికింత కంటె నభేద్యమైన మంత్రముండునుగదా?......రెండువిషయములు మాత్రము కొంచెము కించగాఁ దోచుచున్నవి. నర్మదతో మాటాడనని

పంతము కట్టితిని. ఇప్పుడు మాటాడుటయే కాక దానికి దాసాను దాసుఁడను గావలసియున్నది. రెండవది విక్రమసింగు నాకుఁ బ్రతికూలుఁడు. చిత్తూరు పక్షమువాఁడు. అట్టివాని నింట నుంచుకొని పూజింపవలసివచ్చినది........కానిమ్ము! చేతకాని వానికిఁ గాని యిట్టి పౌరుషము కార్యవేది కుండరాదు కదా? పౌరుషములు- పంతములు-పట్టుదలలు- మానాభిమానములు నున్నత్రో ద్యోగమునకుఁ బోవువాని కపశకునములు!

ప్రమ—అన్నయ్యా! ఆహ్వానపత్రిక మీ యొద్దనే యుంచెదరా? వదినగారి కిచ్చివేసెదరా?

జయ—(ఇచ్చివేసి) అమ్మాయీ! నీవింకను నిచ్చటనే యున్నావా?

ప్రమ—మీ రేదో దీర్ఘాలోచనమున నుండుటచే మాటాడింపలేదు.

జయ—పోనిమ్ము! కూర్చుండలేకపోయితివా తల్లీ! పాపము నీపాదములు పొక్కు-లెక్క-లేదు కదా?

ప్రమ—(నవ్వుచు) ఇంతమాత్రమునకేనా? నాయందలి యభిమానాతిశయమున మీరిట్లనుచున్నారు.

జయ—అది కాదమ్మా! నీవు కడు సుకుమారివి. నమ్మెదవో లేదో గాని తల్లిదండ్రులులేని నీకు నాసంరక్షణమునం దేమి లోపము వచ్చునో యని నిన్నుఁ జూచినప్పుడెల్ల నాకడుపు చెరువై పోవుచుండును. నాకుఁ జెల్లెలవైనను నీవే! కూతురువైనను నీవే! నీవివాహమును గూర్చి ప్రయత్నింపవలెనని నేను నాలుగైదు మాఱు లనుకొంటిని. కాని, యయ్యో! నాముద్దుల ప్రమదనా బంగారుకొండ - వివాహితయై యత్తవారింటి కేగినయెడల నామెను బాసి నే నుండఁగలనా యని నాలో నేనేయనుకొనుచు శ్రద్ధవహింపలేదు. ఏదెటులైనను నిన్ను విడిచిపెట్టి యుండలేనమ్మా!



అందుచే నాయింట నిల్లరిక ముండుట కంగీకరించువరుని నీకుఁ గూర్పవలెనని నిశ్చయించితి. నీకిష్టమే గదా?

ప్రమ—(లజ్జ నభినయించుచు శిరము వంచుకొనును)

జయ—అమ్మాయీ! మాటాడవేమి? దేనిఁగూర్చి నీసంశయము? సరి. సరి. నీవు చెప్పనక్కరలేదు. నీసంశయము నాకుఁ దెలిసినది. (నవ్వుచు) అయిదువేలసైన్యమునకు నాయకుఁడనై రాజ్యతంత్రమునం దప్రతిమప్రతిభావంతుఁడ నగునేను నీవంటి యాఁడుదాని హృదయమును గనిపెట్టలేనటే వెఱ్ఱిదానా!

ప్రమ—(తనలో) ఓయి వెఱ్ఱివాఁడా! ఇంటియాఁడుదానిని వశము చేసికొనలేనివాఁడు-ఏబదివేలసైన్యమునకు నాయకుఁడైనమాత్ర మేమి ప్రయోజకుఁడు?

జయ—చెప్పెదను చూడు. మండలాధిపతియైనవాఁ డెవ్వఁడు నిల్లరిక ముండుట కంగీకరింపఁడు. ఎట్టివైభవమును లేని సామాన్యరాజపుత్రుఁడుమాత్ర మంగీకరించును. అట్టివానికా నిన్నిచ్చి పెండ్లి చేసెదరని నీవు సంశయించుచున్నావు. ఇందుకే నీ వమాయుకురాలివని నే ననుచుందును. నీవివాహము నంతసామాన్యముగాఁ జేసెద ననుకొంటివా? నీలగ్నమునాఁడు మింట దేవదుందుభులు మ్రోయవలదా? రాజస్థానమునందలి రాజపుత్రు లెల్లరు ఢిల్లీనగరమ్ము నలంకరింపవలదా? మాయలు మర్మములు నెఱుంగనిదానవగుటచే స్పష్టముగఁ జెప్పినఁగాని యెదుటివారి హృదయమును గనిపెట్టలేవు. విను-నీకు వరుఁడుకాఁదగినవాఁడు త్రిలోకాధిపత్యమునకుం దగినవాఁడు-నవయౌవనసంపన్నుఁడు-మండలాధిపతి-[illegible]న్యరూపలావణ్యవైభవమ్ముల రతిరాజుఁ బరిహసించువాఁడు-ఏమి? ఇట్టివాఁడు నీ కిష్టమేనా?

ప్రమ—(నవ్వుచుఁ దనలో) పుట్టనిబిడ్డలకుఁ బేరువెట్టుటయన్న నిట్టిదే. ఊరును బేరును దెలియని యీవర్ణన లెందుకు?

జయ—అదుగో! నీ మొగము నవ్వుచున్నది. నీ కిష్టమే. ఇంక నీ యెడల దాపనేల? వాఁడు చక్రవర్తిమనసున కెక్కినవాఁడు—

ప్రమ—(ఆశ్చర్యముతో వినును)

జయ—కొలఁది దినములలోనే యిచ్చట నత్యున్నతోద్యోగమును బడయనున్నవాఁడు—

ప్రమ—(వింతగా) ఆఁ—ఆఁ—

జయ—ప్రస్తుతము మనయింటనే యున్నవాఁడు.

ప్రమ—(తనలో) అయ్యయ్యో! విక్రమసింగా! విక్రమసింగా!

జయ—విక్రమసింహుఁడను నన్వర్థాభిధానము గలవాఁడు. ఇప్పుడు తెలిసినదా! ఇంక నాలోచించుకొనుము.

ప్రమ—(తనలో విచారముతో) హరహరా! లతాంగీమనోహరుండగు విక్రమసేనునా నేనువరింపవలయు!

జయ—ప్రమదా! బాగుగా నాలోచింపుము. నీభాగధేయమును నీవు నిశ్చయించుకొనుము.

ప్రమ—అన్నయ్యా! యిదివరకే నిశ్చయించుకొంటిని—

జయ—(సంతోషముతో) ఆహా! ఏమినాభాగ్యము! నాతల్లీ! నా బంగారుకొండా! నాముద్దులమూటా! నేనెంత యదృష్టవంతుఁడ నమ్మా! తల్లీ! సర్వేశ్వరుని యవ్యాజానురాగంబన్న నిట్టిదియే సుమ్మీ! చూడు—కృష్ణసింగన్న కష్టము దేవకీవసుదేవులకు—వాని ముద్దుముచ్చటలయనుభవము నందయశోదలకు—అట్టులే నీతల్లి దండ్రులునిన్నుఁగాంచి నాకప్పగించిరి. నీముద్దుముచ్చటలు నేననుభవించుచున్నాను. నీవివాహమునుగూర్చి నేను గంపెడంత బెంగ



పడుచుంటిని. ఇప్పుడు నాకాభారము తగ్గినది. నిన్ను దూరముగా విడిచిపెట్టి యుండవలెనను విచారము నాకింకనుండదు.

ప్రమ—ఔను. నేను ఢిల్లీనగరమునందే యున్నప్పుడు మీకావిచార మెందుకు?

జయ—ఔనుతల్లీ! ఆవిక్రమసింగు కొలఁదిదినములలోనే యత్యున్నత పదవిబడయనున్నవాఁడు. నాకంటెను, మానసింహాదులకంటెను నత్యధికుఁడయి క్రమక్రమముగాఁ జక్రవర్తియంతవాఁడు కాఁగలఁడు.

ప్రమ—చక్రవర్తియంత వానిని బెండ్లాడవలయుననియె నాసంకల్పము.

జయ—ఔనమ్మా? అట్లేయగును.

ప్రమ—అట్లే యగును గాక!

జయ—ఇంతకంటె ముఖ్యమైన మఱియొకసంగతి విను. ఆలతాంగి మాత్రము విక్రమసింగు కంటఁబడఁగూడదు. కంటఁబడినదా? యాతఁడునీకుఁ దక్కఁడు. ఆజగన్మోహనునిఁ జూచినయెడల లతాంగి నీకంటెగడుసుదగుటచే నీకంటెముందుగా నీకుఁ దక్కకుండ వానిని దనవలలో వేసికొనగలదు, వాఁడు లతాంగి కంటఁ బడకుండవలయు ననియే మన యావాసమందిరమున వానికి, కోటికొక దూరముగ నున్న మనయుద్యానవన మధ్యస్థమగు సౌధమునందు బస యేర్పరచితిని. ఆతఁడందున్నంత కాలము వనవిహారార్థము తత్ప్రాంతమునకుఁ బోరాదని నర్మదకును ముఖ్యముగా లతాంగికిని నాయాజ్ఞ యెఱిఁగింపుము.

ప్రమ—(నవ్వుచు తనలో) ఓయీ! వెఱ్ఱివాఁడా! ఉద్యానవనములో లతాంగీ విక్రమసింగుల యన్యోన్యాలింగనములు సైతము నేను జూచితినయ్యా! ఎందుకు నీకీ పిచ్చితలంపు?

జయ.—నీవుమాత్రము-అప్పుడప్పుడు-బంగారుబొమ్మవలె- అలంకరించుకొని—ఏకాంతముగ-వానికంటఁబడుచు- మేఘములోని మెఱుపువలె తటాలున మాయమగుచుండుము!

(తెరలో) ప్రమదా! ప్రమదా! ప్రొద్దున నుండియుఁ గంటఁబడక యెక్కడమాయమైతివే?

ప్రమ—వదినగారు పిల్చుచున్నారు. సెలవా!

జయ—వెళ్ళువెళ్ళు! నీప్రయత్నములో నుండుము!

ప్రమ—నేనాప్రయత్నమునందే యుండెదను.

(ఇరువురు నిష్క్రమింతురు)

---

## —॰ ద్వితీయరంగము ॰—

[ఉద్యానవన ప్రాంతమందిరభాగము—ప్రవేశము నర్మద—లతాంగి]

లతా—వదినా? మీతమ్ముఁడింత తొందరగాఁ గబురంపుటకుఁ గారణమేమో?

నర్మ—నాకునుస్ఫురింపకున్నది. తొందరయెందుకు? ప్రమద వెళ్ళినది కదా! వానినిప్పుడే తోడ్కొని రాఁగలదు.

[ప్రవేశము—విక్రమసింగు- ప్రమద.]

విక్ర—దైవఘటన మెప్పటికెట్లో తెలియనగదా అక్కా!

లతా—(నిలువఁబడును)

నర్మ—అబ్బాయీ! రమ్ము కూర్చుండుము. ఏ మట్టు లనుచున్నావు? ప్రమదా! నీవుచావడిగదిలో నుండవలదా?

ప్రమ—అయ్యో! ఉండవలదటమ్మా! అన్నయ్యగారేక్షణమున వచ్చెదరో! (అనినిష్క్రమించును.)



విక్ర—(కూర్చుండి) అక్కా! నేనిలువెడలిన ముహూర్తము శుభప్రదమైనదమ్మా!

నర్మ—అట్టులైన సంతోషమే! సాహసించి నీవిచ్చటఁ బ్రవేశించితివి. జ్ఞానమువచ్చిన తరువాత నెప్పుడును గోటవిడిచి యెఱుఁగనివాఁడవు. నిన్నిచ్చటకుఁ బంపుటకు మాపిన్నిగారెట్లంగీకరించిరో యని నా చిత్తము మిక్కిలితొట్రుపడుచునే యున్నది. వచ్చినకార్యము సవ్యముగా జరిగినఁ జిక్కులేదుగాని,నీవేసందర్భమున నైన నించుకబయలుపడితివా కార్యము చెడుటయేగాదు. అంతకంటె నెక్కుడు సంతాపమే పొందవలసి వచ్చును.

లతా—వదినా! దైవమనుకూలముగా నున్నప్పుడశుభమును స్మరింపనేల? అదేదియో చెప్పనిండు.

నర్మ—ఔను. శుభవార్త వినియానందింతము ప్రతాపా!

విక్ర—అక్కా! అనుదినమును నుత్సవ సందర్శనార్థము ఢిల్లీనగరము నలంకరించుచుండిన యసంఖ్యాకులగు రాజపుత్రులఁ జూచుచుండుకొలది నాశరీరము పులకరించుచుండ, ఆహా! తేజోవంతులైన యిందఱు రాజకుమారులు దాసానుదాసులై చక్రవర్తి కనుసన్నల మెలంగుచుండిరికదాయని తలంచుకొనుచు,-ఏయుపాయమున్నన వీరి నందఱను సందర్శించి-ప్రసంగించి-స్నేహమ్మునించి నాచతురవచనరచనావిశేషమున వారిచిత్తములు బాధించి చిత్తూరుపక్షమున నాకర్షింపఁ గలనోయని నాలుగైదు దినములనుండి దీర్ఘముగ నాలోచించుచుండ, నేటియుదయమునసే బావగారు నాకడకువచ్చి—

నర్మ—(ఆతురతతో) వచ్చి!

విక్ర—నాకడకువచ్చి-విక్రమసింహా! ఏకారణముచేతనో వచ్చిన రాజపుత్రులెల్లరు నాచేయుచుండిన గౌరవాదరణములలో సంతుష్టులుగాక యసంతృప్తు లగుచున్నారు. నేను బహువ్యాపకుఁడనై

యుండుటచే నింతకంటె నెక్కుడు శ్రద్ధవహించుట కవకాశము గలుగకున్నది. ఈరాజపుత్ర సత్కారములో నీవు నాకుఁ గొంచెము తోడుపడవలయును జుమాయని బ్రతిమాలుకొనిరి.

నర్మ—(ఆశ్చర్యముతో) బ్రతిమాలుకొనుటయే?

విక్ర—ఆహా! తప్పక తోడుపడెదనని మాటయిచ్చువరకు నన్ను విడువ లేదు.

నర్మ—శబాస్! ప్రతాపా! నీకంటె సంకల్పసిద్ధుఁడిం కెవ్వఁడున్నాఁడు?

లతా—వదినా? ఇంతమాత్రమున సంకల్పసిద్ధి యనలేము. అందఱు రాజపుత్రులకంటఁ బడినప్పుడు-వారిలో నెఱిఁగిన వారొకరైన నుండకపోరు. అట్టియెడ నిజవృత్తాంతము బైలుపడక తప్పదు. అప్పట్టునఁ జేయఁదగిన దేమున్నదో యూహించుకొనుఁడు!

నర్మ—ప్రతాపా! లతాంగి పలికినది యుక్తముగా లేదా?

విక్ర—లోకములో మనుష్యునిఁ బోలు మనుష్యులెందఱుండరు? అంతవరకెన్నఁడును రాదు. ఏకారణముననో వచ్చిన రాజపుత్రులెల్లరుఁ జక్రవర్తి యాదసూయతో నున్నారట! బావగారిమాటల ధోరణిలో నాకీసంగతి తెలిసినది.

లతా—ప్రతిభావంతులెట్టి యిక్కట్టులైనఁ దప్పించుకొనఁగలరు. కాని వదినా! ఈఢిల్లీనగరములోఁ జక్రవర్తికి విరోధముగాఁ జిత్తూరుపక్షమున రాజపుత్రుల కుపన్యాసము లొసంగుచుండ నది చక్రవర్తికిఁ దెలియకుండునా? రాజద్రోహము క్రిందఁ బరిగణింపఁ బడకుండునా? అందుచే-ఒకరి యభిప్రాయములు-ఇంకొకరు హృదయములో బహిరంగముగాఁ బ్రవేశపెట్టుటకు-ఏకారణముచేనైన వీలులేనప్పుడు భాగవతములో గోపికల భ్రమరగీతములవలె నన్యాపదేశముగా మాటాడుట మంచియుపాయము కాదా?



నర్మ—(సంతోషముతో) బాగున్నదే! బాగున్నదే!

విక్ర—శబాస్! లతాంగీ! సాంద్రతరంబగు నంధతమఃపటలంబును నమృతకరునికిరణమ్ములువోలెఁ గప్పురంపుఁబలుకులుంబోలు కమ్మని నీ ముద్దుపలుకులు నాహృదయవ్యాకులత నెల్లఁ దొలంగించినవి.

ఉ. సంగరమందు మా జనని చందము నన్నిశితాసి బూని వీ
రాంగనవౌచుఁ బోరఁగలవా యను సందియము న్తెగాని, రా
జ్యాంగ విచారవేళలను సత్తకుమామకుఁ గూడ వేనవేల్
భంగుల మేలు గూర్చు ప్రతిభామతి నీవు సరోజలోచనా!

లతా—

ఉ. సంగరమందు మీ జనని చందము నన్నిశితాసిఁబూని వీ
రాంగననౌచుఁ బోరఁగలనా యను సందియమెల్ల మీకుఁ దీ
ర్పంగల భాగ్యమెప్పటికిఁ బ్రాప్తమొ యంచుఁ దలంతుఁగాని మె
బ్బంగిని వేరుచింత గనుపట్టదు నాకు నృపావతంసమా!

విక్ర—కాంతా! లోకైక మాతయగు మామాతాజీవారికిఁ గోడల వగుటకు నీవిప్పుడు తగినదానవైతివి.

నర్మ—ప్రతాపా! రాజపుత్ర సందర్శనము నీ వెప్పుడు గావింతువు?

విక్ర—రేపు దశమీ జయవారము గదా! కార్యక్రమమును రేపటి నుండియే ప్రారంభించెదను.

నర్మ—బాగున్నది. ప్రారంభింపుము. కాని కార్యము ప్రమాదకరమైనది సుమా! నీవెంత జాగరూకతతో సంచరింతువో?

లతా—కార్యము కొనసాగువరకు మన కీభయము తొలంగదు.

విక్ర—సర్వేశ్వరుఁ డనుకూలుఁడై యుండ భయంబేల? (నవ్వుచు) లతాంగీ! ఇంతమాత్రముననే భయపడుదానవు రణభూముల యందు మాతల్లిగారివలె నెట్లు సంచరింపఁగలవు?

శా. తేజోమూర్తుల రాజపుత్రికుల నుద్దేశించి, యేదేనియున్
వ్యాజంబూని యుపన్యసించెదను నేనన్యాపదేశంబుగా,
రాజస్థానమదెల్లఁ జిత్తురు మహారాజ్యంబు పక్షంబు నా
కాశింప దోడ్పడఁ జేసికొందు నుడు రాజాస్యా! యవశ్యంబుగాన్.

నర్మ—ప్రతాపా! నీయుపదేశముల వలన నెవరెవరి హృదయములకే యే మార్పులు కలుగుచుండునో సూక్ష్మదృష్టితోఁ గనిపెట్టుచుండవలయును జుమా!

లతా—కనిపెట్టవచ్చును. హృదయపరిశీలనమునకు ముఖము విషయసూచిక గదా? మఱియుఁ గనిపెట్టుటమాత్రమే గాక రాజపుత్రిల మనంబులు మన ప్రయత్నమునం దేకీభవించినట్లు స్థిరపడినయెడల నన్యాపదేశములు విడిచి ప్రత్యక్షోపదేశములే కావింపవచ్చును.

నర్మ—ప్రతాపా!

లతా—వదినా! పాదములచప్పుడు వినఁబడుచున్నది. ప్రమద వచ్చుచున్నదేమో? మీ రాపేరుతో నింకఁ బిలువకుఁడు!

విక్ర—(లేచి) అక్కా! ఎందుకైననుమంచిది. నేనింక బనకేగెదను.

నర్మ—మాటలనందడిని మఱచితిమి. సూర్యాస్తమయమై చాల సేపైనది.

లతా—ఔనమ్మా!

మ. తమిమ్మైవెన్నెల వ్యాజమూని శుకసంతానోక్తులన్యాపదే
శముగాఁబల్కు నిజోపదేశములుగాఁ జంద్రుండు దుర్వర్తన
మ్మునులంగించుచు నల్లదే కువలయంబుందాఁ బ్రబోధించెడిన్
ఁమకార్యంబుల నప్రమత్తులుగదా ధాత్రీబుధోత్తంసముల్.

నర్మ—వింటివా ప్రీతా—

లతా—(చప్పున నర్మదనోరుమూయును)



నర్మ—విక్రమా! నీకార్యమునందు నీవప్రమత్తుఁడవై యుండవలయునని లతాంగి నీకన్యాపదేశముగా బోధించుచున్నదిసుమా!

[ప్రమద-పరుగెత్తుచుఁ బ్రవేశము.]

ప్రమ—వదినా! అన్నయ్యగారు వచ్చుచున్నారు.

విక్ర—(తటాలున నిష్క్రమించును)

నర్మ—
లతా— } [నవ్వుకొనుచు మఱియొకదెస నిష్క్రమింతురు]

———

## —• తృతీయరంగము •—

[జయచంద్రుని మందిరము-ప్రవేశము. నర్మద-జయచంద్రుఁడు.]

జయ—నర్మదా! రమ్ము కూర్చుండుము. నీకొక్క సంతోషవార్త చెప్పవలయునని కబురంపితిని.

నర్మ—కూర్చుండుటకేమి? ఇంతవరకును గూర్చుండియే వచ్చితిని. ఆసంతోషవార్త యెట్టిది?

జయ—సంతోషవార్త యెట్టిది? సంతోషమును బుట్టించునట్టిది. కూర్చుండి సావకాశముగా విను. చెప్పెదను.

నర్మ—ఆసంతోష మెవరికి? మీకా? నాకా?

జయ—నాసంతోషము నీదికాదా? నీసంతోషము నాదికాదా? వెఱ్ఱిదానా?

నర్మ—ఎన్నటికిని గాదు. ఎవరి సంతోషము వారిదే. ఎవరి యిష్టము వారిదే.

జయ—నర్మదా! ఎందుకీ వక్రోక్తులు. మర్మములు విడిచి మాటాడుము. ఇన్నాళ్ళనుండియు నీతో మా[illegible]లేని నీకుఁ గోపము!

అంతేనా? నాకర్మముగాని యామాత్రమైనను గ్రహించు నాలోచనము లేనివాఁడ ననుకొంటివా?

నర్మ—మీకాలోచనములు లేవని యెవరనఁగలరు? మీయాలోచనములు భూమ్యాకాశములు ముడిపెట్టుచుండును. మాటాడనని పంతముపట్టి ప్రత్యేకముగా నన్నిప్పుడు పిలిచి పలుకరించుటలోఁ గూడ నేదో పెద్దయాలోచన ముండవలయును.

జయ—అహ్హాహ్హా! నర్మదా! ఎంత గడుసుదానివే! నీకింత దీర్ఘకోపమున్న నేనెట్లు భరింపఁగలను? నాకు-ఏబదియేండ్లు పైబడుటచేఁ బ్రాయమ్ము మరలినట్టులే కదా? ఇది నాకు వార్ధకదశ. ముసలికోపమ్మున మాటాడుట మానివేసినానని నీవుఁగూడ నింత పంతము వహింతువా? (లేచి)

ఉ. ఏవిధి నోర్చుకొంటి నోకియింత తలంపుము మాటి మాటికిన్
యౌవనమందు నీదు పొలయల్కల! నాదగువంతుదీరె; నీ
భావములోన నాముసలిప్రాయపుఁ గోపము నీవుఁగూడ నే
డావిధి నోర్చుకొంటదగదా? యిది నీదగువంతు నర్మదా!

(అని వీపుపైఁ దట్టుచుఁ దనతోఁ బ్రక్కఁగూర్చుండఁజేసి) సుందరీ! ఇప్పుడైనను సంతోషవార్త చెప్పనిచ్చెదవా?

నర్మ—ఇంతవరకు నాయభ్యంతరముచేత నేనా చెప్పలేదు?

జయ—కాదా మఱి? నీవు ప్రసన్నురాలవు కాకుండ నెట్లు చెప్పఁగలను? ఇదిగో! (జేబులోనుండి తీసి) ఈరత్నహారమును బరిశీలింపుము. (అని యిచ్చును.)

నర్మ—(అందుకొని పరిశీలించుచు సంతోషాశ్చర్యములతో) ఓహో! ఇందలి శిల్పచాతుర్యమెంత ప్రశంసనీయము? ఆశావకాశంబుల దేదీప్యమానంబగు నీప్రకాశమును; కన్నులు మిఱుమిట్లు గొలుపుచు ననివార్యంబులైన యీధగద్ధగలును గన నియ్యది నిలుకడగన్న



విద్యుల్లతయో యన నాకద్భుతము గొలుపుచున్నది (మరలఁ బరిశీలించి) ఆహాహా! అగణితంబైన యిమ్మణిగణప్రభావితానములకాలసాంధ్యరాగము నెట్లు కల్పించుచున్నవో? ఇన్నీలాలకాంతులును నిబిడంబులై కటికచీకటులఁ బ్రకటించుచుండ - వానిలో మొత్తమ్ములగు నిమ్మంచి ముత్తియమ్ములు తారకలవలెఁ దళతళలాడుచున్నవి. నడుమ నడుమఁ గడుసొగసుగ సమర్పంబడిన యివ్వజ్రంపురవల తళత్తళలును వేళకాని వెన్నెల సొంపు సంపాదించుచున్నవి. ప్రాణేశ్వరా! ఈరత్నహారంబునకు మూల్యం బెవరు నిర్ణయింపఁగలరు? నేడు నేను లేచిన వేళావిశేషముననో మీయనుగ్రహవిశేషముననో సృష్టిలో నేడెంత వింతవస్తువును జూడఁ గల్గితిని? (అని మఱల హారమును బరీక్షించుచుండును.)

జయ—(శిరమెగరవేయుచు-నవ్వుచు-తనలో) బలే! అప్రయత్నముగ నర్మద నాకిప్పుడు దాసానుదాసురాలైనట్టులే కదా?

గీ. భార్యలొల్లని నిర్భాగ్య భర్తలార!
నన్ను మార్గదర్శకునిగా నెన్నుకొనుఁడు!
నగలు చీరెలు వెలగల నాణెములును
దలఁప స్త్రీవశీకరణమంత్రములు మీకు.

(ప్రకా) నర్మదా! ఏమనుచున్నావు?

నర్మ—ఈరత్నహారము మానవసృష్టియా? దేవతాసృష్టియా? మానవసృష్టియందింతటి కళానైపుణ్యముండునా? ఈదివ్యాభరణము మీకెట్లు లభించినది?

జయ—(గర్వముతో) ఇయ్యది నేడు కొలువులో రాజాధిరాజులెల్లరుఁ జూచుచుండఁ జక్రవర్తిచే నాకు బహుమానముగా నొసంగఁబడినది.

సీ. దురభిమానైక చిత్తుఁడు మానసింహుండు
లేశమేని సహింప లేక పోయె
ఆస్థానవిద్వాంసుఁడగు నజుల్ ఫజ లెంత
ఘోరమంచును గుండెకొట్టుకొనియె
శ్రీవారి కడమాట చెల్లుతోడరుమల్లు
కొలువులోఁ గన్నులు కుట్టుకొనియె
పంజాబు సుబెదారు భగవానుదాసుండు
మచ్చరమ్మున లోననొచ్చుకొనియె.
భళిర! జయచంద్రయంచును బాదుషాహి
హస్తకంకణ నిక్వణమతిశయింప
నవ్యదీప్తులు గ్రాలరత్నాలమాల
స్వయముగా నాకొసంగిన సమయమందు.

నర్మ—ప్రాణేశ్వరా! చక్రవర్తి మీకీ బహుమాన మొసంగుటకుఁ గారణమేమి?

జయ—కారణమా! విక్రమసింగును దనకొలువునకంగీకరింపఁజేయు భారము చక్రవర్తి నాయందుంచుట నీవెఱుఁగుదువు గదా?

నర్మ—ఎఱుఁగుదును. ప్రమద చెప్పినది.

జయ—ఉత్సవమునకు వచ్చిన రాజపుత్రులను సత్కరించుటలో నాకు వలసినంత యవకాశము చాలక, తత్కార్యమునందు నాకుఁ గొంచెము తోడుపడ నేను విక్రమసింగు నేర్పరచుటయు నీవు వినియుందువు.

నర్మ—ఇదికూడఁ బ్రమదయే చెప్పినది.

జయ—నేటి యుదయమ్మున నేను మామూలుకంటెను గొంచె మాలస్యముగఁ గోటకేగుట తటస్థించుటచేత, నాకంటె ముందుగ వచ్చినమానసింహాదులు నేను బోవుసరికిఁ జక్రవర్తితో నేమేమో



ప్రసంగించుచు నన్నుఁ జూచినంతనే తమ ప్రసంగము నాపి వెలవెలఁబోయిరి.

నర్మ—ఆవెలవెలఁబాటువలనవారు కావించు ప్రసంగము మీకు విరోధమైనదని మీకనుమానము కలుగలేదా?

జయ—వెంటనే కలిగినది. కాని యిది నాకంత వింతగాదు.

గీ. సమయమును గాంచి, లోని మచ్చరము పెంచి,
లేనిపోని దుర్వార్తలెన్నేనిఁ బన్ని,
ప్రభువు చెంగటఁ గొండెముల్ పలుకుచుంట
కుత్సితోద్యోగులకు నైజగుణములబల!

నర్మ—ఔను. తరువాత నేమైనది?

జయ—చక్రవర్తి నన్నుఁ జూచి,కూర్చుండుటకు సెలవీక మొగము చిట్లించుకొని, ‘జయచంద్రా! విక్రమసింగును గూర్చి నీవు శ్రద్ధ వహించినట్లు మాకుఁ దోచదు నీవా ప్రయత్నముననున్నట్లు కూడఁ గానరాదు. మాయాజ్ఞపై నీకింత నిర్లక్ష్యభావముండునని మేమెన్నఁడు ననుకొనలేదు’ అని యింకనేమేమియో పలుకుచుండ—

నర్మ—అబ్బా! ఎన్ని నిష్ఠురము లాడెను?

జయ—నిష్ఠురమే! నిజముగా నాయందు లోపమేయున్న యెడల నీ నిష్ఠురోక్తులు నన్నెంతయైన బాధించియుండును. కాని యట్టి లోపమ్ము లేనవాఁడనగుట లేశమును జలింపక, చేతులు మోడ్చి ‘దేవా! అకారణముగ నిట్టి సిష్ఠురము లాడుట ధర్మముగాదు. విక్రమసింగు కొలువునఁ బ్రవేశించి యెన్నాళ్ళయినదని యడిగి సేవకుని ధన్యుంజేయుఁడు’—అని—

నర్మ—బాగున్నది. చక్రవర్తి మున్కోపమునకును మీమాట నేర్పునకును సరిపోయినది.

జయ—ఈమాటతో చక్రవర్తి చీకాకు మొగము పున్నమచంద్రుని వలెఁ బ్రసన్నత నొంద, మానసింహాదుల మొగములు మబ్బులోఁ బొద్దువలె వెలవెలఁబోయినవి. చక్రవర్తి వెంటనే నాకుఁ గూర్చుండ సెలవొసంగి, జయచంద్రా! విక్రమసింగును మాకొలువులోఁ బ్రవేశపెట్టితివా? ఎప్పుడెప్పు డనియత్యాతురతతో నడుగ, "దేవా! ప్రస్తుతము విక్రమసింగు — ఉత్సవాగతరాజపుత్రసత్కారకార్యదర్శియై పనిచేయున్నాడు. కొలది దినములలోనే యేలినవారి వేతనోద్యోగి కాఁగలడని చెప్పితిని.

నర్మ—అప్పుడే మీకీ రత్నహారమును—

జయ—ఔను. నాకడపటిపలుకులు నోటనుండఁగనేయీరత్నహారము నాకంఠము నలంకరించినది. నేనును మందమంద మృదూక్తులతో, దేవా! ఈవృద్ధకంఠమునకు-ఈయాభరణశోభ లేలయని నవ్వుకొంటిని.

నర్మ—(నవ్వుచు), మీ ముసలిమాటలకుఁ జక్రవర్తియు నవ్వుకొనెను గాఁబోలు.

జయ—నవ్వుకొనుటయేగాదు. నవ్వి చమత్కారమైన ప్రత్యుత్తరము నొసంగెను. అది నాకనేకమైన యర్థములను స్ఫురింపఁజేయుచున్నది.

నర్మ—(ఆతురతతో) ఏదీ! నాకే యర్థము స్ఫురించునో చూతము.

జయ—జయచంద్రా! నీవు వృద్ధుండవైనయెడల నేకంఠము దీనిచే నలంకరింపఁబడఁదగినదో యాకంఠమునే యలంకరింపుము-అని

నర్మ—భావముగంభీరముగా నున్నది. ఉత్తమకావ్యమువలె వ్యంగ్యప్రధానమైన యీవాక్యము మీకే యర్థములు తోపించినది.

జయ—నీవు వృద్ధుండవైనయెడల నీభార్య ధరింపవచ్చుననియో—లేక—



నర్మ—ఊఁ—లేక?

జయ—లతాంగి—

నర్మ—(చప్పునలేచి) ఇదియే యిందలి ధ్వన్యర్థము. ఈహారము లతాంగి ధరింపవలెననియే చక్రవర్తి యుద్దేశము.

జయ—మనయింట లతాంగి యను కన్యక యున్నట్లు చక్రవర్తియెట్లెఱుగును?

నర్మ—మన యింటనేగాదు. ఈఢిల్లీనగరముననేకాదు. రాజస్థానమున గల రాజపుత్రకుటుంబములలో నెక్కడనెక్కడ నెందరెందరు కన్యలున్నారో కూడఁ జక్రవర్తి యెఱుంగును. ఏదెట్లైనను గపటోద్దేశ్యంబగు నీహారము మానవతులైన కులకాంత లంటఁదగినది కాదు. మీహారమును మీరే పరిగ్రహింపుఁడు (అని మీఁదఁబడ వేయును)

జయ—(తీసి) ఆఁ-అఁ-నర్మదా! నీ వెంత ముక్కోపివే! ఇప్పు డను కొన్నవన్నియు ఊహలు గానినిజములు గావుగదా? ఇంతకు నింత విలువగల్ల హారము లతాంగి కొసంగెదమా! నీవే ధరింపుము!

నర్మ—(అసూయతో) నాకవసరములేదు. లతాంగి కంతకంటె నవసరములేదు.

జయ—మీ యిరువురకు నవసరము లేనియెడల నా ముసలివేసమునకా దీని యవసరము?

నర్మ—మీకును నవసరములేనిచోఁ బ్రమదకిచ్చివేయుఁడు! (అని నిష్క్రమింపబోవ)

జయ—నిలునిలు. వెళ్ళవచ్చును. దిక్కులేక ముద్దకులేక మనయింటఁ జేరిన ప్రమద యెక్కడ? వేలకొలది విలువగల యీరత్నమాల యెక్కడ?

నర్మ—ఏమో నాకుఁ దెలియదు. అబ్బా! (తల పట్టుకొని) ప్రమదా! ప్రమదా! నాకు తల నొచ్చుచున్నదే! కొంచెము మంచిగంధము తీయుము. (నిష్క్రమించును.)

జయ—నేనధిక ప్రసంగము గావించితిని. దాని ప్రతిఫలమిది. ఈరత్న హారముచే నర్మదను మెప్పించి, నా సప్తహజారీ మన్సబ్దార్పదవిని గూర్చి మహారాణితోఁ బ్రసంగింపుమని బోధింపనెంచితిని గాని పాకము చెడిపోయినది.

ప్రవేశము—ప్రమద—

ప్రమ—వదినా! వదినా! అన్నయ్యా! వదినగారెక్కడ? (హారమును జూచి) ఆహా! ఎంత చక్కని హారము? ఎంత చక్కని హారము? నన్నొకసారి చూడనీయరా

జయ—నీ కొఱకే తెచ్చితినమ్మా! నాతల్లీ! నీకంటె నాకెవ్వరున్నారు? (అని యిచ్చును)

ప్రమ—(పుచ్చుకొని) ఆహా! ఎంత బాగున్నది! ఎంత బాగున్నది! అన్నయ్యా! ఇది నాకొఱకేనా? నిజముగా నాకొఱకే తెచ్చితిరా?

జయ—అయ్యో! వెఱ్ఱితల్లీ! నీకొఱకే తెచ్చితినమ్మా!

ప్రమ—నిజముగా? నామీఁద నొట్టేనా?

జయ—ఒట్టేనమ్మా! అబద్ధమాడిన-మాలవాఁడు-చండాలుఁడు—

ప్రమ—అట్లైన సరియే! నేడు నేను మంచి యదృష్టవంతురాలను. వదినగారేరీ ఆమె చూచినారా?

జయ—మీ వదిన నాపై నలిగి యిప్పుడే వెడలిపోయినది.

ప్రమ—ఎందుచేత?

జయ—నీకొఱకుఁ దెచ్చిన హారము తన కిచ్చివేయవలయునట! ఇదెక్కడి న్యాయము? నీవీ హారముతో మాత్రము-నర్మదాలతాంగుల కడకేగకుము. నీ వమాయకురాలవు. వారికున్న గడుసుఁదనము



నీకు లేదు. నిన్ను వారు వెక్కిరించినఁ జేతకానిదానివలె నేడ్చుచుఁ గూర్చుండెదవు. ఇదిగో! ఈహారమును ధరించి-అప్పుడప్పుడొక్కొకమారు-విక్రమసింగు—

ప్రమ—ఆ సంగతి మరల మీరు చెప్పుచున్నందుకు విచారించుచున్నాను.

జయ—అట్లైన సంతోషమే!

(ఇరువురు నిష్క్రమింతురు)

# నౌరోజా

## —•తృతీయాంకము•—

### —•ప్రథమరంగము•—

[కోటలోని యంతఃపుర ప్రాంతప్రదేశము—ప్రవేశము—

ప్రమద—లతాంగి—]

ప్రమ—వదినగారు వచ్చువరకు మన మిచ్చట నుండవలసినదేనా లతాంగీ!

లతా—ఆహా—ఆహ్వానపత్రికలులేనివారు—ఈచోటుదాటి లోనికిఁ బోవుటకు వీలులేదు.

ప్రమ—ఆలాగునా? ఎందుచేత? ఈమీద నేమున్నది?

లతా—మహారాణి యంతఃపురము. ఇదిగో! ఈఘారాచూచితివా? ఇక్కడ నుండి గల మందిరములు సౌధములును శుద్ధాంత జనము సంచరించునవియే.

ప్రమ—ఏమి కన్నుల వైభవము! ఇందుకే మహారాజులు విష్ణ్వంశ సంభూతులని యందురు. ఆకాశమునంటుచు వలయాకారముగ నున్న యీరంగు రంగుల మేడ లన్నియు నీప్రాంతమున కెంత శోభ గల్గించుచున్నవి?

లతా—దానికేమి! ఈఘారాలన్నియు స్త్రీ సమ్మర్దముతో నెంత కిటకిటలాడుచున్నవో చూడు.

ప్రమ—(చూచి) ఓహో! ఏమి స్త్రీ జనము? వీరందరు నాహ్వానింపబడినవారేనా?

లతా—కొందర రాహ్వానింపఁబడిన వారు. కొందరు మనవలెనే వేడుక చూడ వచ్చినవారు.



ప్రమ—అదుగో! అదుగో! ఆప్రక్కనుండిఘారాలుదాటుచు నేల యీనినట్లింకను వచ్చుచున్నారు. ఇంత సమ్మర్దములో మనము తిరిగి యెట్లు పోఁగలమో కదా!

లతా—(నిదానించి చూచి యాతురతతో) అయ్యయ్యో! చచ్చె చచ్చె!

ప్రమ—ఎవరే? ఎవరే?

లతా—అదుగో పాపమొక యవ్వ ఘారాతలుపులకు నొక్కివేయఁబడుచున్నది. (నిదానించి) ఆఁ-భయములేదు. తప్పించుకొన్నదిలే.

ప్రమ—అబ్బబ్బా! ఏమి కుమ్ములాడుకొనుచున్నారే? (గుండెబాదుకొనుచు) ఓహోహో! ఏమి సమ్మర్దము! ఏమిసమ్మర్దము!

లతా—అదుగో! మహాసముద్రమువలె నా స్త్రీ సమ్మర్ద మీయంతఃపుర ద్వారమువైపే వచ్చుచున్నది, మన మిప్పుడే కొంచెము దూరముగాఁ దొలంగుట మంచిది.

ప్రమ—ఔ నౌను. మన మీఘహారా దగ్గర నుండరాదు. నలిగి పోయెదము. నీ యాభరణములు జాగ్రత్త సుమా! నాప్రాణములు నారత్నహారముమీదనే యున్నవి. (ఇరువురును దూరముగాఁ దొలంగుచున్నారు.)

లతా—ప్రమదా! చూచుచున్నావా? ఆహ్వానపత్రికలు లేని వారిని దాసీలు ద్వారము కడనే యడ్డగించుచున్నారు!

ప్రమ—చూచితిని గాని—ఆరంగుల మేడలలో—ఈజేగురు మేడ దిగి—ఎవ్వరో యిద్దరు స్త్రీలు వచ్చుచున్నారు. వారెవ్వరో—ఆమేడ యెవరిదై యుండునో.

లతా—(చూచి) ఆమేడ యెవరిదో నాకుఁ దెలియదు గాని—ఆస్త్రీలు—మహారాణి దర్శనమునకై వచ్చుచుండిన చక్రవర్తి యితర భార్యలై యుందురు. (నిదానించి) ఆఁ—కాదు—కాదు

ముందున్నది రాణి కావచ్చును గాని, వెనుక నున్నది మాత్ర మట్లు కనబడదు.

ప్రమ—ఔను. నాకును నట్లే తోచినది. ఆరాణి యెవ్వరో గాని—యోహో! ఎన్ని యాభరణములు ధరించిన దమ్మా? ఆమె ధరించిన గులాబి రంగు చీరె చీనాపట్టు కాంబోలు! అందుకే యింత తళ తళ! ఆనల్లముఖములు రవిక పైని—ఆమె కంఠహారము లెంత కలకలలాడు చున్నవి!

లతా—(విసుగుతో) నీకెప్పుడు నగలు, చీరెలు, నను ఘోషయే గాని మరియొక దృష్టి లేదే! ఆమె యెవ్వరో గాని నాకు వింతగాఁ గనబడుచున్నది.

ప్రమ—ఎందుచేత?

లతా—చూడు. చూడు. వెనుక నున్న దానితో నేమో గుసగుసలాడుచు, మన సమీపమున నున్న యీఫారా వైపునకే వచ్చుచున్నది. ఎందుచేతనో గాని యామె యవయవములకు స్త్రీ జనసామాన్యమగు కోమలత్వము గానరాదు. మొగమెంత మోటగా నున్నదో చూడు! నడక సైతమును దెచ్చి పెట్టుకొన్నట్టులే యున్నది గాని స్వభావ సిద్ధమైన స్త్రీ గమనమువలెఁ గానరాదు. మొత్తముపై నీవ్యక్తి రంగస్థలముపై పురుషుం డభినయించు స్త్రీ పాత్రివలెనేయున్నది గాని సహజ స్త్రీ స్వరూపము వలె నాకుఁ దోచదు.

ప్రమ—ఉన్నట్టులే యుండి యెన్ని సంగతులు కనిపెట్టితి వమ్మా! అట్టులైన నామె రాణియై యుండదనియా స్త్రీయే కాదనియా నీ యుద్దేశము!

లతా—రాణియును గాదు—స్త్రీయును గాదు.

ప్రమ—కాక పురుషుఁడా!



లతా—(పరధ్యానముతో) పురుషుఁడును గాదు—

ప్రమ—అట్టులైన పేడియైయుండునా?

లతా—పేడియును గాదు—

ప్రమ—బాగున్నదే నీపెడవాదము—ఎవ్వరును గానిచో నడవి మృగమా?

లతా—అంతఃపుర సంచారిణియగు పేడియైనచో నిన్ని నగలెట్లు వచ్చును?

ప్రమ—ఆమాట నిజము. చెవులకుఁ గల రవల కమ్మలే పదివేలగును. అంత దూరమునుండి కూడఁ దళతళ లాడుచుండిన ముక్కుపుడక మూఁడువేలకుఁ దక్కువ కాదు. గజ్జెల యొడ్డాణము లక్షలలో మాట గాని వేల సంఖ్యచే లభింపదు. ఇంకఁ గంఠహారముల నిచ్చి యొక రాజ్యము గొనవచ్చును.

లతా—ప్రమదా! నీ యాభరణ ధ్యానమును జాలించి యిటు చూడవమ్మా! ఆవింతకాంత—వచ్చిన స్త్రీల నందరిని—(నిదానించి) అందరిని గాదు. అవివాహితలైన కన్యలను సమీపించుచు—ముచ్చటించుచు—స్పృశించుచు—వారి నగలనెట్లు సవరించుచున్నదో?

ప్రమ—ఔ నౌను. అదిగో! ఎవరినో కౌఁగిలించుకొనుచున్నది. (నిదానించి) ఆమెకాదమ్మా! ఆమెనుబోలినమఱియొకతె కాఁబోలు! సరేకాని నీ వామెనింత నిదానించుటకుఁ గారణమేమి? ఇందరిలో నామె యొకతె. ఆమె యెవ్వరైన మనకేమి! ఎట్టిదైన మనకేమి? అదుగో! వదినగారు వచ్చుచున్నారు. నీ యప్రస్తుతాలోచనములు కట్టిపెట్టి యింక నింటికిఁ బోవు సాధనము చూడుము. సమ్మర్దమంతకంత కధికమగుచున్నది. సింహద్వారము కడనున్న మన గుఱ్ఱపుబండిని జేరుకొనువరకు—

నర్మద—(ప్రవేశించి) ఎట్లు పోఁగలమో తెలియకున్నది. ప్రమదా! లతాంగీ! మీరిద్దరు భద్రముగనున్నారు గదా?

లతా—ఇంతవరకు—

ప్రమ—ప్రాణములు పిడికిటిలోఁ బెట్టుకొని—

నర్మ—ఇప్పుడు విచారించుచున్నాను. మిమ్ముఁ దీసికొనివచ్చుట పొరపాటే! ఈ సముద్రతరంగముల మీరెట్లు లీదఁగలరో తోచకున్నది. ఈ సమ్మర్దములో మనవెంటవచ్చిన దాసీలేమైరో తెలియదు.

ప్రమ—అట్లైనఁ గొంచెము సేపాఁగుదమా?

నర్మ—ఆగినకొలది సమ్మర్దమధికమగును. ఇంకఁ జీకటిపడిన యెడల మనపాట్లడుగ నక్కఱలేదు. అందుచేఁ ద్వరపడవలెను. పైటకొంగులతో నడుములు బిగించుకొందము. తప్పిపోకుండ నొకరిచేతులొకరు పట్టుకొందము. (మువ్వురు నడుములు బిగించి యొండొరులచేతులు పట్టుకొనుచున్నారు.)

ప్రమ—వదినా! మీయాభరణములు జాగ్రత్త. నారత్నహారము భద్రముగనేయున్నది.

నర్మ—ఆభరణములుగాదు. ప్రాణములు జాగ్రత్తయగుము. రా! రా!

(మువ్వురు-నిష్క్రమింతురు-తోడనే స్త్రీవేషముతో-అక్బరు-జహనారా ప్రవేశించుచున్నారు)

అక్బ—ప్యారీ! జహనారా! అన్యోన్యస్నేహాలాలసస్వాంతంబైన యీ హిందూమహమ్మదీయకాంతా సంతానము చూచుటకెంత సంతోషదాయకముగా నున్నది! చూడు! ఒండొరులు—పలుకరించుకొనుచు—ముచ్చటించుచు—భాషించుచు—కౌఁగిలించుకొనుచు జాత్యైకమత్యము నెట్లు ప్రకటించుచున్నారో! ధన్యుఁడను! ధన్యుఁడను! ఇంకఁ జేయవలసినదేమున్నది?

జహ—ఇంకేమున్నది? వేలకొలందిగల యిచ్చటిలతాంగులలో—



అక్బ—ఆఁ—ప్రియా! లతాంగులన్న జ్ఞప్తికి వచ్చుచున్నది. చిత్తూరువారి బంధుగురాలట! లతాంగియను నొకకన్య జయచంద్రుని యింటనున్నట్లు నీవేనా నాతోఁజెప్పితివి?

జహ—ఏమో ఎప్పుడు చెప్పితినో జ్ఞాపకములేదు. లతాంగికూడ నీయుత్సవమునకు వచ్చియే యుండునుగాని మనము పోల్చుకొనలేము.

(తెరలో) లతాంగీ! లతాంగీ!

అక్బ—(సంతోషముతో) అదుగో! ఇప్పుడు స్పష్టమయినది.

జహ—స్పష్టమైనది. ఆకంఠస్వరము జయచంద్రుని భార్యదే. ఆమెను నే నెఱుఁగుదును.

(తెరలో) అయ్యో! లతాంగి తప్పిపోయినదే! తప్పిపోయినదే! చూడే! చూడే! లతాంగీ! లతాంగీ!

అక్బ—(విని) జహనారా! ఇంతకంటెఁ దరుణముండునా?

జయ—ఉండదుగాని యెట్లు గుర్తింపఁగలము?

అక్బ—చూడు. చూడు. మూకలోనుండి తప్పిపోయిన లతాంగియో లతాంగిని వెదకుచుండిన మఱియొక లతాంగియోగాని—సమ్మర్దమునుండి తొలంగి కళవళపాటుతో నిటువచ్చుచున్నది.

జహ—(చూచి) ఔను. ఈవైపునకే వచ్చుచున్నది. లతాంగియే కాఁబోలు.

అక్బ—లతాంగియే కాఁబోలు! (నిదానించి) (సంతోషముతో) లతాంగియే! లతాంగియే!

జహ—మీరెట్లు పోల్చుకొనిరి?

అక్బ—మెడలోనున్న రత్నహారమునుబట్టి—ఆహారము—(ఆతురతతో) వచ్చె! వచ్చె! ఎదుర్కొని పలుకరింపుము.

ప్రవేశము—ప్రమద

జహా—(ఎదురొచ్చి) అమ్మాయీ! లతాంగీ! రమ్ము! నిన్ను గూర్చియే మేము ప్రసగించుకొనుచున్నాము.

ప్రమ—(త్రుళ్ళిపడి వెనుకకువచ్చి) మీరెవ్వరు? అంతఃపురస్త్రీలు కారా?

అక్బ—ఔను. నీవు లతాంగివని యెఱింగి నీస్నేహము నభిలషించుచున్నాము.

ప్రమ—చక్రవర్తి యంతవానికిఁ బ్రియకాంతలైన మీరు—సామాన్యకన్యయగు లతాంగిస్నేహమును గోరనేల? మీయాభరణములు. మీచీరెలు-మీవైభవములు నెక్కడ? ఏవైభవములేని మావంటి పేదరాచకన్నె లెక్కడ?

అక్బ—(నవ్వుచు) సుందరీ! మాకెన్ని వైభవములున్నను నీ సౌందర్యవైభవమునకు సాటిరావుగదా? ఇంతకు సహజసౌందర్యములేనివారికెన్ని యాభరణములున్న నేమిప్రయోజనము? చూడు-ఒక్క రత్నహారము ధరించి నంతమాత్రముననే మహారాణులమైన మాకు నీవే మహారాణివలెఁ దోచుచున్నావు. నీసౌందర్యమే మమ్మాకర్షించి నీమైత్రి నభిలషింపఁజేయుచున్నది.

జహా—ఔనమ్మా! మాకే నీవంటి చక్కఁదనమున్న యెడలఁ జక్రవర్తిని గీలుబొమ్మవలె నాడింపకుందుమా!

ప్రమ—నేనింత చక్కనిదానవని యిన్నాళ్ళకుఁ దెలిసికొనఁగలిగితిని. మీమాటలచే నాకు నవ్వువచ్చుచున్నది.

అక్బ—నిజముగాఁ జక్కని వారెప్పుడు నిట్టులేయనుకొనుచుందురు. పోనిమ్ము! సౌందర్యము మాటకేమి? నీయందు మాకుఁ బ్రేమ కలిగినది. నీస్నేహమును గోరవచ్చునా?

ప్రమ—స్నేహముగాదు. సేవయనుట యుక్తము.



జహా—సరే! సంబంధము స్థిరపడినచో నొకరిసేవ యొకరికిఁ దప్పదు కదా!

ప్రమ—స్థిరపడుటకే మున్నది? అంతిపురిరాణులైన మీరు నాసఖ్యమునుగోరి నన్ను మీయంతవారినిగాఁ జేయుచుండఁగాదందునా?

జహా—నిన్ను మాయంతవారినిగాఁ జేయవలయుననియే మాయూహ.

అక్బ—నాయుద్దేశమునదియే!

ప్రమ—నాకోరికయు నదియే!

అక్బ—సరిపోయినది! చెలీ! ఇంక నీస్నేహానందమును నాలింగనరూపంబున ననుభవింపనిమ్ము. (కౌఁగిలింపఁబోవును)

ప్రమ—(తప్పించుకొని) అమూల్యంబులును దేదీప్యమానంబులునగు నిట్టివస్త్రాభరణంబులతో—అనలంకృతనగు నన్ను మీరంటవచ్చునా?

అక్బ—ఔను. ఒకవిధముగా నాలోచించినయెడ నిన్నుఁ గౌఁగిలించుకొనుటకీ చీరెలు నీనగలు నెందుకు? మఱియు నీవన్నట్లు నీవనలంకృతవు. నిన్నలంకృతంజేసి కౌఁగలించుకొనుట నాకు మఱియు నిష్టము. (అని తనయాభరణముల నొక్కొక్కటి తీసి ప్రమద నలంకరించుచుండును.)

జహా—(తనలో) చిరకాలమునుండి చిత్తూరుకన్య నెవ్వతెనైనఁ జేపట్ట నభిలషించుచుండిన యీచక్రవర్తి మనోభీష్టము నేఁడు నెరవేరునట్లే తోఁచుచున్నది.

అక్బ—(అలంకరణము పూర్తిచేసి) లతాంగీ! ఆలింగనమున కిప్పుడైన నర్హతకల్గినదా?

ప్రమ—(ఆభరణములు చూచుకొనుచు) నేను లతాంగి నేనా? ఇప్పుడెచ్చట నున్నాను? ఈ యాభరణము లన్నియు నేను నిజముగా

ధరించితినా? ధరించినట్లు కలఁ గాంచుచుంటినా? ఆహా! ఏమి నాభాగ్యము! (అని మరల నాభరణములు చూచుకొనును.)

అక్బ—సుందరీ! మాటిమాటికి నలంకారవిమర్శన మేలఁ గావించెదవు? అర్హాంబులని నీకుఁ దోఁచినయెడల- ఈయాభరణంబులు- ఈయుత్సవ సందర్భమున- మేము నీకుఁ గావించిన బహుమానముగాఁ బరిగ్రహింపుము.

ప్రేమ—(ఆనందపారవశ్యముతో) ఆఁ—ఆఁ—నాకే!—నాకే!— నిజముగా నాకే!—ఈ-యా-భ-ర-ణ(అని మూర్ఛిల్లుచుండ)

అక్బ—(ఆతురతతోఁ చేతులడ్డముగాఁ జాపును)

ప్రమ—(వానిచేతులలో వెల్లకిలఁ బడును.)

అక్బ—అయ్యయ్యో! ఈమె మూర్ఛిల్లినదేమి?

జహ—మూర్ఛగాదు. ఇది యానందాతిశయమునఁ గలిగిన పారవశ్యము.

అక్బ—ఆనందపారవశ్యమా! అట్టులైన ధన్యుఁడనే! (ప్రమద చెక్కిలి ముద్దుగొని) సుందరీ! నిన్నలంకరించిన హస్తము-ఢిల్లీశ్వరుండగు చక్రవర్తి హస్తంబని యెఱింగిన నింకను నెంతసంతసింతువో? ఈ స్వల్ప బహుమానముచేతనే నీవింత మైమరచుట వింతగానున్నదే!

ప్రమ—(లేచి—కన్నులు తుడుచుకొనుచుండును)

(తెరలో) వింతగా నున్నదే! ఎక్కడ కేగినదమ్మా! ఏదీ! ఏదీ! ఏమై పోయినదో కదా! ఏమి సాధనమే!

జహ—(తొందరతో) మహారాజా! ఈమెకొఱకు నర్మద వచ్చుచున్నది. మనము చప్పునఁ దొలంగిపోవలెను.

(ఇరువురు నిష్క్రమింతురు)

—



—•ద్వితీయరంగము•—

[యమునానదిప్రాంతము-ప్రవేశము-విక్రమసింగు.]

విక్ర—ఓహోహో! ఏమి హృదయశాంతి! ఏమి స్వేచ్ఛావిహారము! ఎంత నిర్లక్ష్యభావము! ఈరాజపుత్రులు- ఈయమునాతటినీతటసైకతతలంబున వాహ్యాళి వెడలుచున్నారా? ఏమి యోగ్యత? ప్రస్తుతావస్థ సాయంసమయశీతలానిలవిహారంబునకుఁ దగియున్నదిగా! (కొంచెము ముందు కేగి) భోగపరాయణులైన యో రాజపుత్రులారా! భారతవర్షంబున కెన్నఁడులేని మహావిపద్దశ సంఘటించి యుండ—ప్రళయకాలసంజాతంబగు ఝంఝామారుతో పేత మహాంబుధారాపాతంబువోలె సర్వోపద్రవశప్రాణోపద్రవకరంబైమహా సంక్షోభంబును బుట్టించుచుండ—చీమచిటుక్కుమన్నటు లేని లేక మీరందరు నీమీ విడిదెలనుండివచ్చి యీ యమునాతీరంబున వాహ్యాళి తిరుగుచున్నారా?

సీ. దుర్వారమగు మ్లేచ్ఛ దుష్పరిపాలనా,
భూరిసాగరము దేపొంగిపోయె।
చాలకాలమునాటిస్వాతంత్ర్యమనియెడు,
బిగువైన తెరచాప ఎగిరిపోయె।
నత్యంత గాఢమా నైకమత్యంబన్న
నురమైన చుక్కాణి విరిగిపోయె।
కఠినశాసనతరంగములలోన స్వరాజ్య
మనియెడు మనయోడమునిపోయె।

భరతమాతకు నూపిరి తిరుగదాయె।
నిలుచునో లేదో ప్రాణంబు తెలియదాయె।

నొక్కఁడేనియుఁ జే సాయమొనఁగఁడాయె।
పుత్రులా మీరిసీ! రాజపుత్రులార!

శబాస! నావాక్యంబులు వారి చెవులకెక్కినవి. వారి దృష్టులీ వంకకు మరలినవి. నన్నింకను శ్రద్ధగా వినుటకు నిశ్శబ్దముగా సమీపించుచున్నారు. (అని కొంచెము ముందుకేగి) అదుగో! సూర్యభగవానుండు పశ్చిమాచలశిఖరం బలంకరించె. (చేతులు మోడ్చి) ఓతండ్రీ! కర్మసాక్షీ! త్రిమూర్త్యాత్మకా! లోకబాంధవా!

శా. దేశద్రోహులమేము, మా బ్రతుకునిస్తేజంబు, మా సేనలున్
మాశస్త్రాస్త్రములున్ నిరర్థకములో మార్తాండ! నీవైన మా
దేశక్షేమముఁగోరి దాస్యము విముక్తింజేసి, హిందూ ధరా
ధీశుల్ తత్ప్రజలున్ సుఖించునటులో దేవా! కటాక్షింపవే.

శా. కానఁ కలిచ్చి మ్రొక్కి తురకల్ ప్రభువంచును గొల్చుచుంట, మా
మానవనాథుఁడెవ్వఁ డవమానముగాఁ [illegible] య
జ్ఞానతమంబు నీకిరణజాలమునం దొలఁగంగఁ జేసి, స
న్మానము భిక్షమీ భరతమాతకుఁ బెట్టుము లోకబాంధవా.

శా. స్వాతంత్ర్యమ్మును గోలుపోయి యకటా! సామంతులైనారవ
ఖ్యాతుల్ హైందవచక్రవర్తులు తురుష్కస్వామికిన్; దుర్దశా
జాతంబౌ పరతంత్రవృత్తి నెటులో సైరించుచున్నాము; మా
స్వాతంత్ర్యంబెప్పుడైన మాకుఁ గలదే ఛాయామనోవల్లభా.

స్వామీ! దివాకరా! నీవు పరాఙ్ముఖుండవయి వెడలిపోవుట భారతీయుల దురవస్థ చూడలేకయా? ఆపశ్చిమప్రాంతంబున నీకెవరున్నారు? భారతీయప్రతినిధివై మా మొఱలు నీవెవ్వరి కెఱింగించెదవు? అందు మాకుఁ దోడ్పడఁగలవారు కలరా? నిన్ను స్థావకాశముగ మాటాడ నిచ్చెదరా? అదుగో! అద్దుగో! దురాచారులగు [illegible]మందేహులను రక్కసులు నిన్నప్పుడే యడ్డగించుచున్నారే! నీదాడలు నొక్కివేయుచున్నారే!



తండ్రీ! ఆదుష్టవిధి నిన్నెదిరించునట్లు వారికి వరంబొసంగె. ఆవరప్రసాదముచేతనే నీచులైన మందేహులు దేశబంధువుఁడును లోకమాన్యుఁడవును మహాత్ముఁడవునునైన నిన్నెదిరించుచున్నారు. అనుదినము త్రిసంధ్యలయందును భారతీయులు గాయత్రిచేనభిమంత్రించిన యస్త్రముల నర్ఘ్యరూపమున విడిచి యారక్కసుల నుక్కడంచు చున్నారుగాని యేమి ప్రయోజనము? విరించి వరము వారలఁ బునర్జీవితులఁ గావించుచున్నది. విధివిరోధియగుటచేతనే మాజపంబులును తపంబులును మాహోమంబులు నీమంబులును నేఁడు నిష్ప్రయోజనములగుచున్నవి. గాండీవాద్యమోఘాస్త్రంబులును పాశుపతాది దివ్యాస్త్రంబులునుం బోలె తపఃక్రియాజనితంబైన భారతీయులమనశ్శక్తి జగత్ప్రతిహతముగదా?

సీ. ఒక మహాత్ముఁడు మంత్రయుక్తమౌ కుశచేత,
పరరాజుసేనలఁ బారఁదోలె।
ఒకమహాత్ముండు దండకపురమ్మవలీల,
ఘనతరారణ్యమ్ముగా నొనర్చె।
ఒకమహాత్ముండు సమంత్రోదకంబులఁజల్లి,
కడువింతయైన స్వర్గము సృజించె।
ఒకమహాత్ముఁడు సముద్రోదకంబంతయు,
నక్కజంబుగ నోటఁబుక్కిలించె।
సత్తపోజనిత మౌమనశ్శక్తిచేత
దేవతలకేనిగాని సాధింపరాని,
యెంత యెంతలు మహిమలార్జించినారు
భరతమాత కుమారులో యరుణకిరణ.

అయ్యయ్యో! అట్టిశక్తి సంపన్నుఁ డొక్కఁడేని నేటిభారతీయులలో [illegible] జూపట్టఁడుగదా? (చెవులు మూసికొని) అబ్బబ్బా! ఓకోకిలమా!

అంటుమామిడికొమ్మపైఁ గూర్చుండి మాతో సమానముగ నీవును నేల గోలపెట్టుచున్నావు? ఆర్యావర్తమింతకంటెను బరాక్రాంతంబైనను, ఆర్యావర్తవాసులింతకంటెను దాసానుదాసులై - యింతకంటెను నన్నోదకహీనులై కృశించి నశించినను నీకు విచారముండదుగదా? నీ లేమావిచిగురుబోనమ్మునకు లోపము గలుగదుకదా? పరభృతియే పరమసమ్మతంబుగ—పరాన్నంబే పరమాన్నంబుగఁ బెరుగు నీకీవిఱ్ఱవీగుట యేల? నీవాశ్రయించిన యంటుమామిడి కృత్రిమసృష్టి: అయ్యదియొక శాఖపై నీకగ్రస్థాన మొసంగినంత మాత్రమునఁ ద్రుళ్ళిపడుటకంటె, నీనీచ జీవితమును స్మరించుకొని యాచెట్టు కొనకొమ్మ కురివోసికొనుటమేలు?

+ + + ఓమయూరమా! అమ్మసీదు మంటపంబుపై వికాసభాసుర పింఛంబుపై యానందించుచున్నావు? అప్పుడు మేఘమా! వర్షమా! ఓహో! తెలిసినది. ఉత్సవసందర్భమునఁ గోటలో మ్రోగెడు ఫిరంగులనుండి వెడలు క్రొంబొగలుఁగాంచి మేఘంబని భ్రమపడుచుంటివా! పాపము! నీనాట్యకళాప్రదర్శనమింక జాలింపుము. అయ్యది శతఘ్నికా నిర్గళద్ధూపజాలముగాని మేఘజాలముగాదు. పౌరుషజ్ఞానవంతులమనుకొనుచున్న మేమే మోసపోవుచుండఁ దిర్యక్కువగు నీవీమ్లేచ్ఛపరిపాలనముచే మోసపోవుటయొక వింతగాదు కదా? కృత్రిమంబగునిట్టి తాత్కాలికానందమునుగల్గించి ప్రజల భ్రమపెట్టుచు—హైందవసామ్రాజ్యవైభవంబంతయుఁ దామనుభవించుచుండుటయే యీమ్లేచ్ఛరాజుల రాజ్యతంత్రము! ఈరహస్యమును గ్రహింపనేరక పాదుషా యొనరించుచున్న వచేమిన్నుమన్నుం గానక—మాయంతటి ప్రయోజకులు లేరని విఱ్ఱవీగుచున్న యీనిర్భాగ్యరాజపుత్రులంజూడుము!



(ప్రవేశము—మువ్వురు రాజపుత్రులు)

1 వ—ఓయీ! విక్రమసింగ్! నీయుపన్యాసములు పెక్కుదినములనుండి వినుచున్నాము. ఇంక వాని వలనఁ బ్రయోజనములేదు. నిన్నటి వివాదావశేషమును బ్రారంభించి యుక్తాయుక్తముల మరలఁ జర్చింతమురమ్ము.

2 వ—అనవసరమైన యీకంఠశోషకంటె మీరిట్లు చేయరాదా?

3 వ—నిష్కారణమిట్టి నిష్ఠురోక్తులచే రాజపుత్రుల మనసులు నొప్పించిన మీకేమి ప్రయోజనమున్నది?

విక్ర—(చేతులు మోడ్చి) మహాత్ములారా! మీయందరియాజ్ఞలకు నేను బద్ధుఁడను. ఈరాజపుత్రులకెల్ల మేము ప్రతినిధులమని మీ మువ్వురును రెండుదినములనుండి నాతో వాదించుచున్నారు! నేను మిమ్ము విశ్వసింపవచ్చునా?

2 వ—మీకట్టి సందేహమేల కలుగవలయును?

3 వ—మీరాజపుత్రులయందే మీకింతయవిశ్వాసమా!

విక్ర—(1 వ వానితో) మహాత్మా! వయోవృద్ధులును లోకమెఱింగినవారునగు తమరు సెలవీయవలయును.

1 వ—కుమారా! నీయుపన్యాసములు విని విని, యీరాజపుత్రులెల్లరుఁ దమలోఁ బలువిధములఁ దర్కించి తర్కించి, కడకు మామువ్వురను, దమకు మార్గదర్శకులగు నాయకులుగా నేర్పరుచుకొని పంపిరి. మనము నలువురము నొకటియై యేర్పరచినమార్గము ననుసరించెదమని ప్రమాణముగ వచించిరి. ఇంకనీవు సంశయింపఁబనిలేదు.

విక్ర—(సంతోషముతో) చాలు! మహాత్మా! చాలు! ఓతల్లీ! ఆర్యావర్తమా! నీవెంత ధన్యురాలవమ్మా!

సీ. భరతఖండానమున్నట్టి ద్రోణభీష్ముల
శౌర్యప్రతాపముల్ చావలేదు।
ఆచార్యపుత్ర కృపాచార్య శౌర్యము
హౌదార్యధైర్యంబు లడఁగలేదు।
భీమార్జునుల మహోభీలప్రతాపాన
లజ్వాలలింకఁ జల్లారలేదు।
రహి నభిమన్యు పరవ్యూహభేదనా
కౌశలమును నేలఁ గలయలేదు।
సకలరాజపుత్ర చక్రపౌరుషవిక్ర
మక్రమమ్ము రూపు మాయలేదు।
వగవనేటికమ్మ? వలదమ్మ! వలదమ్మ!
యూరడిల్లుమమ్మ! వీరమాత.!

1 వ—విక్రమసింగ్! మరల నీయుపన్యాసము లేల? కర్తవ్యమ్మునకుం గడంగుదుము. ఒకప్పుడీ మొగలాయిప్రభుత్వమును మనము తొలంగింపఁగల మనుకొందము. తొలగించినపిమ్మట నీహైందవ సామ్రాజ్యమునకు నాథుఁ డెవఁడో యూహింపవలదా?

విక్ర—ఊహించుట కేమున్నది? ప్రజలే తమనాథుని నెన్నుకొందురు.

2 వ—ఈప్రభుత్వమును దొలగింపవలయుననియే మీ పట్టుదలయా! లేక-వీలైనయెడల సంస్కరించుటకుఁగూడ నుద్దేశమున్నదా?

విక్ర—దాస్యవిముక్తికి స్వాతంత్ర్యప్రాప్తికి నేది మూలమో యదియే కావింపవలెనని నాపట్టుదల.

3 వ—అట్టులైన లోకంబంతయు నేకగ్రీవముగ వాకొనుచుండిన హిందూమహమ్మదీయ సమ్మేళన సమస్యను మీరుపరిత్యజించినట్లేనా?

విక్ర—అది ముమ్మాటికిని గల్ల-నాకందు విశ్వాసములేదు.

1 వ—లేకపోవచ్చును గాని రాజపుత్రులెల్లరు మమ్ము నాయకులుగా నిర్ణయించుకొనిన సందర్భమున నీహిందూమహమ్మదీయ సమ్మేళనమును గూర్చియే ముఖ్యముగాఁ జర్చించి కర్తవ్యమును స్థిరపరుపవలెనని కోరిరి. అంనుచే—

విక్ర—ఆలాగునా? మహాత్మా! ఈరాజకుమారులకెల్ల భారతీయమహమ్మదీయ సఖ్యమునందంత పరమసమ్మతమా? అవశ్యముగ మనమిదియే ప్రధాన వివాదాంశముగాఁ గైకొందము.

3 వ—మీకిందు విశ్వాసము లేకపోవుటకుఁ గారణమేమి?

విక్ర—మనవిచేసికొనుచున్నాను. రాజపుత్రస్థానమంతయుఁ దనకు నిరంకుశముగ వశపడినయెడల-భారతవర్షంబంతయుఁ దనకుఁ గరతలామలకంబగునని చక్రవర్తియెంచి మనరాజపుత్రుల లోఁబరుచుకొనుటకై రాజపుత్ర మహమ్మదీయ సమ్మేళనమనుటకు మారుగా లౌక్యుఁడగుటచే హిందూమహమ్మదీయ సమ్మేళనమను నొక నూతనమతమును బ్రకటించుచున్నాఁడు. ఈసమ్మేళనమే దీనెఇలాహీ' మతార్థమని చెప్పుచున్నాఁడు.

1 వ—అగుఁగాక! అట్టులైన మాత్రమేమి? ఈనూతనమతమును వినర్జించుటకుఁ దగినంతకారణమేదియు నీవు చెప్పలేదే?

2 వ—దీనివలన మనకేమియనర్థము లున్నవి?

విక్ర—కావలసినన్ని యనర్థములున్నవి. స్వాతంత్ర్యభంగము మొకటి యనర్థము- దాస్యవృత్తి రెండవయనర్థము. ఈరెండింటికంటె మహానర్థము రాజపుత్ర స్త్రీలమానభంగము.

1 వ—ఇష్టమున్నవారు తమకన్యల నిచ్చెదరు. లేనివారు మానివేసెదరు. ఇందుమానభంగ మేమున్నది?

విక్ర—ఏమున్నదో యింతకంటె స్పష్టముగాఁ జెప్పుట నాకుఁ గష్టముగానున్నది. (విసుగుతో) పోనిండు దానికేమి? మీముప్పూరను- మనవివాదము లాలకించుచుండిన యీసకలరాజ పుత్రులను గూడ

నేనొక్కవరము ప్రార్థించెద. నన్నుఁ గృతార్థుం జేయుఁడు! (ప్రేక్షకు దిరికి) ఓమానధనులారా!

ఉ. మాటికిమాటి కాతురకమానిసి లేని పదమ్ము లిమ్ముగా
గాటపుబత్తి నొత్తుఁబడి కాదనఁగాని; యొకప్పుడైన మీ
పాటలగంధులన్ జిలుతిప్రాయపుఁ గన్నెలనుత్సవంబులన్
గోటకునీపయిం బనుపఁ గూడదటంచును మిమ్ము వేఁడెదన్

1 వ. 2 వ. ౩ వ—(వెలవెలపాటుతో నొకరినొకరు చూచుకొందురు)

(తెరలో)—స్పష్టముగా వివరింపుఁడు? స్పష్టముగా వివరింపుఁడు!

1 వ—(ఉత్క్షిప్తకర సంజ్ఞలతోఁ గలకలమును వారించి) విక్రమసింగ్ నీమాటలు మమ్ము వ్యాకులపెట్టుచున్నవి. ఉత్సవసందర్శనార్థము కోటలోని కేగిన మనరాజపుత్రస్త్రీలలో నెవ్వతెకైన మానభంగము జరిగెనా యేమి? చెప్పుచెప్పు!

విక్రి—(అపహాసముతో) అట్లుగాదు. ఉత్సవములో మానభంగము జరుగకుండ నెవ్వతెయైన మిగిలినదా యని యడుగుఁడు.

౩ వ—(ఆశ్చర్యముతో) ఆఁ—ఆఁ—అంత ఘోరమా!

౩ వ—మీ మాటలు విశ్వాసమునకు మేర మీరుచున్నవే!

విక్ర—ఔను. హిందూమహమ్మదీయసమ్మేళనమునందు సంపూర్ణతన్మయత్వము చెందిన మీకు నామాటలు విశ్వాసార్హము లెట్లగును?

1 వ—(విసుగుతో) అబ్బబ్బా! యథార్థంబెఱింగింపక యీ దెప్పుడు మాటలిప్పుడేటికయ్యా!

విక్ర—మహాత్మా! క్షమింపుఁడు! (రోషముతో) సంపదున్మత్తుండును దురాచారుండును దురహంకారచేతస్కుండును నగు తురకరేడు, ప్రత్యేకము స్త్రీలకొఱకేర్పడిన నిన్నటి యుత్సవములో ననన్యలక్షితంబైన స్త్రీవేషంబునుదాల్చి తన యుంపుడుకత్తెయగు జహానారాను వెంటఁగొని, కాంతానివహంబుసొచ్చి తత్కపట



వేషముతోఁ దనకుఁ గానవచ్చిన కన్యకనెల్ల—ఇసీ! ఇంక నవాచ్యము లుచ్చరింపఁజాలను!

1 వ—(గుండెబాదుకొనుచు) ఎంత మోసము! ఎంత మోసము

2 వ—ఎంతసాహసము! ఎంతసాహసము!

౩ వ—కానవచ్చిన కన్యకనెల్ల? ఏమి చేసెను?

విక్ర—అయ్యా! క్షమించి నన్నింక నేమియు నడుగకుఁడు.

గీ. మీయనుంగుఁ జెల్లెండ్రును మీకుమారి
కామణులుఁ దాముగోపికాకాంతలైరి
సంతసంబున నిన్న యుత్సవములోన
ఫాదుషావారు వేణుగోపాలులైరి.

ముప్పురు—[చెవులు మూసికొని] హర! హర! హర! ఎంత యమానుషచర్య?

విక్ర—అమానుషచర్యగాదు. ఇది లీలామానుషచర్య! వివాహితలైన కాంతలను స్పృశింపక యవివాహితలైన కన్యలతోడనే క్రీడించుటచే, మాయాదనకృష్ణునికంటె మీ మొగలాయి కృష్ణుఁడే గొప్ప రసికుఁడు!

౩ వ—అయ్యా! ఈవృత్తాంతంబంతయు మీకెట్లు తెలియవచ్చినది?

విక్ర—జయచంద్రునియింట నాతని స్త్రీలు చెప్పుకొనుచుండఁగా నేను వింటిని. పాపము వారిలో నొక కన్యకను నాభరణాది బహుమానములచే సంతోషపరచి యామె తన్నంగీకరించునను నమ్మకముచేఁ [illegible]నుజక్రవర్తినని చెప్పివేసెనట! అయ్యలారా! శునకోచ్ఛిష్టదధిభాండంబులంబోలెఁ బరపురుష స్పర్శచే నపవిత్రలైన మీ రాజపుత్రికలనెల్ల నింకఁ జక్రవర్తికే యర్పించెదరో యీయమునానదికే యర్పించెదరో నిశ్చయించుకొనుఁడు? ఇంతవరకు మన భరతవంశపు రాజులెవ్వరు నిట్టి యమానుషకృత్యమును సహించి యూర

కుండలేదు. భరతవంశచరిత్రంబైన మహాభారత కథావిధానమును
జ్ఞప్తికిఁ దెచ్చుకొనుఁడు!

మ. ఒకదుష్టుండొక సాధ్విని౦ జెరుప నుద్యోగించి నాడన్న వా
ర్తకు, నత్యుగ్రతరాగ్రహంబుగొని యార్యావర్తభూపాలక
ప్రకరంబుల్ ప్రధనంబునన్ రుధిరధారాపూరముల్ వారఁ శ
త్రుకులంబుం బలముం జయమ్ము మెయినిర్మూలించు టాలింపరే

ఆ. వె. భరతభూమికి యపఖ్యాతి మీనాడె
వచ్చెననుచుఁ గవులు వ్రాయకుండ
లెండు! ఖడ్గధరులుగండు! నాతో రండు!
విజయలక్ష్మిఁ గొండు! వెడలిపొండు!.

ముగ్గురు—(తటాలున ఖడ్గములు బెరుకుచున్నారు)

తెరలో—మహాత్మా! విక్రమసింగ్! ఇదే ఖడ్గధరుల మగుచున్నాము! మీవాదంబు లింకఁ జాలింపుఁడు! రండు! రండు!

విక్ర—(సంతోషముతో) ఆహాహా! తేజోవంతులారా! మీరెల్లరుఁ గూడ నొక్కమారుగ మీమీ కరవాలమ్ములూడ బెరుకుచున్నారా? మీ నిశాతఖడ్గంబుల తళతళలియ్యమునా రంగత్తరంగములయం దెట్లు ప్రతిఫలించుచున్నవో చూడుఁడు! భగవతియైన కాళింది కంకణప్రభాభాసమానంబులగు నిజోత్తుంగ తరంగహస్తంబు లెత్తి మిమ్మాశీర్వదించుచున్నది!

1 వ—విక్రమా! నిర్వక్ర విక్రమోన్నతుండవగు నీచెలిమి కలిమి నీ రాజలోకంబెల్ల ధన్యంబైనది. నీవు దేశోద్ధారణార్థం బవతరించిన మహాత్ముండవు. భగవతియైన యక్కళిందకన్య సాక్షిగా నింక సకల రాజపుత్రచక్రంబునకును నీవే నాయకుండవని యీయముల్ల సత్కల్లోల శీతలశీకర పరంపరలతో నిన్నభిషిక్తుం జేయుచున్నాము.
(అని వానిశిరముపై చేయిచాపును)



1 వ-2 వ—(వానిపాదములకు నమస్కరింతురు.)

తెరలో—(కరతాళధ్వనులు మ్రోగును)

విక్ర—(చేతులుజోడించి కొంతవరకు నిమీలితనేత్రుఁడై) వీరాగ్రగణ్యు లంగన్న జనయిత్రీ! ఓభరతధాత్రీ! నీకింక నేమికావలెనమ్మా!

1 వ—(నవ్వుచు) విక్రమా! అప్పుడే భరతవాక్యమా? కథ యింత వరకువచ్చినది. ఇదియింకను ద్వితీయాంకము.

విక్ర—ఔనుమహాత్మా! చతుర్థాంకంబునఁ జక్రవర్తియొడమన యవక్ర పరాక్రమ ప్రతిభానంబు లెల్ల వెల్లడించి, పంచమాంకంబున విజయలక్ష్మీసమేతులమై యప్పుడు భరతవాక్యము నుడువుదము.

(అందఱు నిష్క్రమింతురు)

## —తృ తీ య రం గ ము.—

[జయచంద్రుని మందిరము—ప్రవేశము. క్రోధాతిశయమున నెడమచేత
నర్మదకొప్పుపట్టుకొని—కుడిచేతఁ గత్తితో జయచంద్రుఁడు—
చేతులుమోడ్చి మరణసన్నద్ధయై ధైర్యముతో నర్మద.]

జయ—(పండ్లు పటపటఁ గొఱుకుచు) ఛీ! మదోన్మత్తా! ద్రోహచిత్తా! నిన్నిప్పుడే నాకరవాలమునకు బలివేసి పరమపాపాత్మురాలివగు నిన్నుఁ బెండ్లాడిన పాపము తొలంగించుకొనెదను.

నర్మ—నాకంతటిభాగ్యమున్నదా? మంగళసూత్రధారణమునాఁడు— ఏహస్తములకు నాకంఠము నొసఁగితినో యాహస్తములకే నాకంఠము నర్పించుట నాకుఁ బరమసమ్మతము! సంశయించెద రేమి!

జయ—(త్రుళ్ళిపడునట్లు లామెను దూరముగాఁ ద్రోసి) ఓసీ! వదరుబోతా! మదరమాటలాడక చేసినదితప్పని యిప్పుడైన నొప్పుకొనుము. క్షమించెదను.

నర్మ—నన్ను మీరు క్షమింపనక్కరలేదు. తప్పుచేసియుండినయెడ నొప్పుకొనియేయుండును.

జయ—తప్పుచేయలేదా! ఓసి మూర్ఖచిత్తా! నా సెలవు లేకుండ లతాంగిని జిత్తూరు పంపివేయుట తప్పుగాదే!

నర్మ—ఉత్సవములో జరిగిన మహోపద్రవమునకు జడిసి ఆమెకేమి యపాయము వచ్చునోయని పంపివేసితిని. ఇందు మీ సెలవెందుకు. ఆమె తరుచుగా నా సంరక్షణమునందే యుండుటచే నామెపై నాకున్న యధికారము మీకు లేదు.

జయ—ఇన్ని న్యాయము లెఱుఁగినదానవు ప్రమదనేల పంపితివి? ఆమెపైఁగూడ నీయధికారమేనా? ఏనాటికైన నా లతాంగిని జక్రవర్తి కర్పింపఁగలుగుదునేమోయని విశ్వప్రయత్నము చేసిచేసి, గడకు బ్రహ్మరాతకు సివగు నీపోరు భరింపలేక యాయాశ మానుకొంటిని. పోనిమ్ము. అప్రయత్నముగఁ జక్రవర్తి ప్రమదాలోలుండయ్యెఁగదా! ఆమె నతిసూక్ష్మముగా వానిఁ గొనగూర్పఁగలుగుదునే! అందువలన నాకుఁ గలుగఁబోవు నున్నతి సహింపలేకయా దానినిగూడఁ బంపివేసితివి? ఛీ! భర్తృహంత్రీ! కుతంత్రచిత్తా!

నర్మ—మఱియొకయాఁడుదానితోడు లేకుండ నొక్క లతాంగిని బంపలేక ప్రమదనుగూడఁ బ్రయాణము చేసితినిగాని దీనికిన్ని యర్థములు మీరు కెలికెదరని నేననుకొనలేదు. ఇంతకు నిప్పుడు మించిపోయినదేమి? అతిస్వల్పకాలములోఁ బ్రమదను రప్పించి మీ కప్పగించెదను. మీరు చక్రవర్తికి సమర్పించుకొనుఁడు! అతఁడు మిమ్మె రాజ్యమునకుఁ బట్టముగట్టునో చూతము.

జయ—ఈ కాలుకూతలే మానుమని నీకు బోధించుచున్నాను. మా[illegible]వ్యములు మా వ్యవహారములు నీవు ప్రసంగింపనేల? చాటుచాటున లతాంగిని బంపివేసినంతమాత్రమున మహాప్రయోజకురాలినని గర్వించుచుంటివి కాఁబోలు! నీకును నీవలెనే విజ్ఞుఁడగు నీపినతల్లి వీరాబాయికినిగూడ గర్వభంగము కాఁగలదు: తొందరపడకు.



నీచములైన మీ స్త్రీబుద్ధులు మహాప్రళయకారణములని కొలదికాలములోనే ఋజువుపడఁగలదు.

నర్మ—మీరు ఋజువుపరుపలేరు.

జయ—పశువా! నిన్ననే యాయేర్పాటంతయు జరిగినదే!

నర్మ—ఏమియేర్పాటు చేసిరో నాకుఁ దెలియదుగాని యాయేర్పాటుమాత్రము మీహానికీ కారణము కాఁగలదని చెప్పఁగలను.

జయ—ఎట్లు చెప్పఁగలవు? నీతెలివితేటలకుఁ దోడు నీకు దివ్యదృష్టి గూడనున్నదా యేమి?

నర్మ—ఈమాత్రమునకు దివ్యదృష్టియవసరము లేదు. స్వలాభమాసింపకయే మీరెట్టి కార్యమును జేయరు. అట్టి స్వార్థపరత్వముతోఁ గూడిన ప్రతిప్రయత్నమును వ్యర్థము కాక తప్పదు. ఒక ప్రయోజనము నాసించి మొదటఁ బ్రమదను విక్రమసింగుపైఁ బురికొల్పిరి. మఱియొక ప్రయోజనమును దలంచి యామెనే యిప్పుడు చక్రవర్తి కొఱకు మీఁదుగట్టనెంచుచున్నారు. స్వార్థపరుల కార్యాలోచనమిట్లే యుండును. అవి యెట్లు సాగును?

జయ—రాజ్యాంగవిషయములను గూర్చి మేమొనర్చు తంత్రములలో నివి పరమాణువులు. నీబుద్ధియుఁ బరమాణువేయగుటచేత నిట్టి స్వల్ప విషయములను గైకొని విమర్శించుచున్నావు. సరే! అట్లైనఁ జెప్పెదను విను. ప్రమదాలతాంగులను నీవు పంపివేయుట నెపము చేసికొని నిన్నటిదినమునఁ జక్రవర్తితో దేవా! యీయుత్సవ సందర్భమున మీరేమో లతాంగిని జేపట్టఁ బ్రయత్నించినట్లు విని చిత్తూరు వారా కన్యకను దోడ్కొనిపోయిరని చెప్పివేసితిని (ప్రయోజకత్వము నభినయించును.)

నర్మ—(నవ్వుచు) మొన్ననే కదా యిది జరిగినది. నిన్న నేటిలో నీసంగతి వారికిఁ దెలియుట యెప్పుడు! వారువచ్చి తోడుకొనిపోవుట

యెప్పుడు? చెప్పుటకు మీకు సంశయము లేక పోయినను విశ్వసించుటకు- జక్రవర్తికైన వివేకముండవలదా?

జయ—కొసవరకువిని విమర్శింపవలెనను వివేకము నీకుండవలదా! ఉత్సవవిశేషములును- అంతకంటె ముఖ్యముగ యుద్ధప్రయత్నములును గనుఁగొనుటకుఁ జిత్తూర్తువారి గూఢచారులువచ్చి పెక్కువేషములతో మనపట్టణమునఁ బెక్కుదినములనుండి సంచరించుచున్నారనియు వారేలతాంగినిగొనిపోయిరనియుఁ జెప్పెను. నీపాటి యుక్తాయుక్త విచక్షణ జ్ఞానము నాకుఁగాని చక్రవర్తికిఁ గాని లేకపోలేదు. నోటికివచ్చినట్లు ప్రేలకు.

నర్మ—ఇది బొత్తిగానమ్మఁదగినది కాదు. నిజముగా మీరట్లేచెప్పియుండిన యెడలఁ జక్రవర్తి చిత్తూరువాఁడైన విక్రమసింగు ననుమానింపకుండునా? ఈసరికే వానినిగారాగారబద్ధునిఁ జేయకుండునా?

జయ—కారాగారబద్ధునే కాదు. శిరచ్ఛేదమే గావించి యుండును. కాని వాని ప్రాణములు నేనే రక్షించితిని. నేనీ సంగతి చెప్పినంతనే చక్రవర్తి విక్రమసింగుననుమానింపకపోలేదు. కాని యతఁడు ఋజుమార్గచరుండనియు- ఈకుట్రలో లేశమును సంబంధము లేనివాఁడనియు-నిరంతరము మాయింటనే యుండువాఁడగుటచే వాని యుత్తమపవర్తనము చక్కఁగా గుర్తించితిననియు-ఈకుతంత్రమునకు ముఖ్యకారకులు చిత్తూరు రాణీయును రాణాయే యనియు-చెప్పి-నమ్మించి విక్రమసింగును బ్రతికించితిని.

నర్మ—గొప్పకార్యమును జేసినారు. పోనిండు. మీరింతకష్టపడి పన్నిన పన్నుగడకుఁ బర్యవసానమేమి? చక్రవర్తి యేమిచేయగలఁడు?

జయ—అది పట్టిమాట. ఆరహస్యమునీకుఁ జెప్పఁదగినదికాదు. చెప్పి యిదివర కనుభవించితిని.

నర్మ—అదికాదు. చక్రవర్తి చిత్తూరుపై దండెత్తుటకే నిశ్చయించెనా? లేక—



జయ—(శిరమూపుచు) లాభములేదు. నీవు ప్రయాసపడకు. ఇప్పుడు నీకుఁ జెప్పినయెడల రేపుదయమునకే యది చిత్తూరుకోటలో నందరి నోళ్ళయందు నుండును. నీ యందంత గొప్పశక్తియున్నది.

నర్మ—మీ పాదములతోడు! నే నెవ్వరికిని జెప్పను.

జయ—(కోపముతో) చెప్పను! చెప్పను! చెప్పను!

తెరలో—(డప్పు మోగుచు) సెప్తున్నాక్ యిన్కోండి! యిన్కోండి! పాదుషావార్-సిత్తూరు గడ్డోటి-లడాయికెల్లాన్కి-తయ్యార్ వున్నార్ ఘన్క-వుతువంసూడ్డాన్కి వొచ్చిన-రాజుల్ వందరు-అల్లా అల్ల దేషం యెల్లి-జల్దీ జల్దీ ఆల్లఫంజ్ ఖూఫ్ తయార్ సేసి-ఫాదుషాగారి యెంట సిత్తూర యెల్లాల. యిక్డావున్న ఔరత్-మరత్-బాల్-బచ్చే-సబ్ ఫాదుషా మారాజ్కి గెల్వాలా సెప్పి-ఏక్దమ్ దేముడికి నమాజ్-సెయ్యాలా-హుకుం- హో.

జయ—(వెలవెలబోయి నొచ్చుకొనును)

నర్మ—(నవ్వుచు) పాపము మీరెంతో భద్రముగా నుంచుకొనిన రహస్యము ఇప్పు డూరూర-వాడవాడలఁ జాటఁబడుచున్నది. నేను జెప్పలేదా స్వార్థపరుల కార్యాలోచన—

జయ—(పండ్లు కొరుకుచు) దుష్టా! భ్రష్టా! నీప్రలాపములకు మేర లేదా? ఆడుదానవగుట క్షమించితినిగాని నిన్నిదివరకే ముక్కముక్కలుగా గోసియుందును.

నర్మ—ఆడుదానిని మీరు క్షమింప నక్కరలేదు. చిత్తూరుపై దండెత్తుచున్నారు గదా? అక్కడ నాథువారిని జయించి వచ్చినను జాలును.

జయ—(వ్యధికరణముతో భయమభినయించుచు) అయ్యయ్యో? ఏమి సాధనము! ఏమిదారి! నీవు వచ్చి మాప్రాణములు రక్షింపఁగూడదా? నర్మదా! (తీవ్రముగా) పదరుబోతా! పరమ మూర్ఖ

రాలివగు నీవు నా ప్రయోజకత్వ మేమెఱుంగుదువే? ఆఱునెలలక్రిందటఁ జచ్చినట్లు లోకమూల బడియుండక-దాస్యవృత్తికైనఁ బనికి రాని యీముదానికిఁ గార్యాలోచనమా!

వర్మ—(నవ్వుచు) ఆఱునెలలక్రిందటనే గాదు. ఆఱువందల సంవత్సరములక్రిందటనే చచ్చినట్లు పడియున్నాము. నేనేగాదు. భారతవర్షస్త్రీలందఱుఁ గూడ నట్లే. మాకెట్టి స్వాతంత్ర్యమును లేక మమ్మిట్లు దాస్యవృత్తిలో నణఁగద్రొక్కుచుండుటచేతనే, మీపురుషులుఁ గూడ స్వాతంత్ర్యము చెడి దాస్యవృత్తి నిట్లనుభవించుచున్నారు. ఇది యెప్పుడు తొలంగునో అదియు నప్పుడే తొలంగును. (అని రివ్వున నిష్క్రమించును.)

# నౌరోజా

## చతుర్థాంకము

### ప్రథమరంగము

[చిత్తూరు రాజమందిరము-ప్రవేశము ఉదయసింగు వీరాబాయి-ఉగ్రసేనుఁడు-ప్రతాపసింహుఁడు-ఉగ్రసేనుఁడుదయసింగును జేయిపట్టుకొని లాగుచుండును. ప్రతాపసింహుఁ డుదయసింగు నడ్డగించును]

ఉద—(ఉగ్రసేనుని విడిపించుకొని) ఉగ్రసేనా! నన్ను విడువుము! ప్రతాపా! నన్నడ్డగింపకుము!

ఉగ్ర—మహారాజా! తమకింత పట్టుదల యుచితముగాదు. మీవలన దేవి వీరాబాయి కకారణమనఃక్లేశము వాటిల్లినది. బాలుఁడైనయియ్యువరాజకుమారుఁ డెంతయు నొచ్చుకొనుచున్నాడు. ఇంకఁ దక్కిన మీపరివారజనులెల్లరు నీక్షణమున మీ రెట్టి సాహసము వహింతురోయని భయపడుచున్నారు. మమ్ము క్షమింపుఁడు. మరల యోజింపుఁడు. ఇంచుక శాంతింపుఁడు.

ఉద—ఉగ్రసేనా! మిమ్ము క్షమించుటకింక నాకధికారము లేదు. ఇంతకంటె యోచింపవలసిన దేదియుఁ గానరాదు. శాంతింపుమనెదవా? శాంతికొఱకే కదా యీ రాజ్యాధికారమును బరిత్యజించుచున్నాను. దేశమున శాంతిస్థాపనముకంటె నాకీ రాజ్యవైభవ మెక్కుడు కానేరదు. నాభార్య క్లేశపడుఁగాక! నాకుమారుండు నొచ్చుకొనుఁగాక! నేనేమిచేయగలను? క్రౌర్యము—రక్తపాతము—ననునవి సంపూర్ణముగఁ దొలంగించుటయే నాముఖ్యవ్రతము. దీనికొడంబడనినాడు—ఈయుదయసింహుఁడు మీ రాజుకాడు. ఒడంబడితిరా ఇంతవరకు గొంతువరకు గొంతుబ్రద్దలగునట్లు మీకుబోధించి

వెడలిన మానసింహుని హితోపదేశము ననుసరింపుఁడు. కోట ముట్టడించియున్న చక్రవర్తితోఁ జెలిమిచేసికొనుఁడు!

వీరా—ప్రాణేశ్వరా! ఈవ్రతఁ బెన్నడైన గొనసాగునదియా? మీవంటి రాజపుత్రవీరులు వహింపవలసినదియా? ఏదేశమునైన నిట్టి పిచ్చినియమములు వహించిన రాజులు గలరా? రక్తపుఁగూడు గుడువనొల్లనియజాతశత్రునకైనఁ గడకుఁ గ్రౌర్యము రక్తపాతమును దప్పలేదుకదా? శత్రుమారణంబును—భూభారనివారణంబును భూరమణులకుఁ గర్తవ్యములని బోధించి—రమారమణుండు ధనంజయుని రణోన్ముఖునిఁ గావింపలేదా? అట్టిమహాత్ములకంటెను మనము ధర్మవేత్తలమా? రాజస్థానమునందుఁ దనకుఁ బ్రక్కలోని బల్లెమగు చిత్తూరుకోట నేనాటికైన సాధించుతలంపున దీర్ఘశత్రుత్వముగొన్న చక్రవర్తితో—కపటవేషంబునఁ బట్టపగ లనేకరాజపుత్రికల నపవిత్రలఁ గావించిన ధూర్తవర్తనునితోఁ జెలిమిసేయుఁడనుటకు మీనోరెట్లాడెను? వీరక్షత్రియునోట నేనాటనైన నిట్టిమాటలు వెడలెనా? క్రౌర్యమా! రక్తపాతమా!

ప్రతా—తండ్రీ! శత్రుక్షయము గావింపకయే శాంతిస్థాపన మెట్లు జరుగును? హైందవ చక్రవర్తులగు నశోకాదులు దేశసంక్షోభకారకులైన విపక్షుల శిక్షించుపట్టునఁ గ్రౌర్యము రక్తపాతమునని తలంచిరా? శత్రుక్షయము గావింపకయే ధర్మసంస్థాపన మొనర్పగలిగిరా? మొన్నటియుత్సవమ్మునఁ జక్రవర్తిగావించిన మానవతీమానాపహరణము మన రాజస్థానమునందంతట నొకనూతనచైతన్యమును బుట్టించినది. ప్రభుభక్తియే పరమార్థముగ నెంచుచుండిన ప్రజలెల్లరుఁ బ్రభువుపై విరక్తివహించిరి. తద్దుష్టపరిపాలనంబు కష్టభూయిష్టంబని గ్రహించిరి. తొలంగిన స్వాతంత్ర్యమ్మునకెంతయుఁ గలంగిరి. తమవర్తమాన దాస్యవృత్తి



గుర్తెరింగిరి. ఆర్యావర్తమునందలి నదీనదంబులును సర్వపర్వతగహ్వరంబులును విహ్వలంబులై ఘోషించునట్లు తమతమ నిర్వక్రపరాక్రమక్రమంబులు చక్రవర్తికడం బ్రకటింప సంకల్పించుకొనిరి. ఆబాలగోపాలమూ భూపాలకులెల్ల రేపోమాపో మనకుఁ దోడుగా రాఁగలరు. జనకా! మీపాదంబులఁ బట్టుకొనెద. ఇప్పట్టున మీ లోకవిపరీతమతముం బరిత్యజింపుఁడు. అప్రయత్నముగవచ్చు విజయలక్ష్మిం గాలఁ దన్నకుఁడు.

ఉద—ప్రతాపా! ప్రయత్నప్రాప్తంబైనను అప్రయత్న లభ్యంబైనను లక్ష్మి చంచలమైనదికదా? నేడువచ్చిన రేపే తొలంగును. నేఁడొకవేళ జక్రవర్తిని జయింత మనుకొందము. మహాబలప్రాభవసంపన్నుఁడగు నాతనిచే రేపు నిర్జింపఁబడక తప్పదుకదా? ఇట్టి విజయంబున శాశ్వతానంద మేమున్నది? బలవంతులగు వారిని బాహుయుద్ధముచేఁగాక ధర్మయుద్ధముచేతనే జయింపవలయు. ప్రాక్పశ్చిమ సానుమంతసమాక్రాంతంబగు సమస్తమహీమండలమునకు—ఇప్పుడక్బరు రారాజైయున్నవాఁడు. హైందవమహారాజులెల్లరు సామంతరాజులై వాని సార్వభౌమత్వ మంగీకరించినారు. వాని పరిపాలన పంజరంబున భారతవర్షంబు రామచిలుకవలె నున్నది. త్రింశత్కోటి భారతీయ వేదండతండంబెల్ల వాని నిశాతశాసనాంకుశమ్ములకుం జిక్కినది. నీవొక్కరుండ వేమి చేయగలవు? బహిరంగముగ రణరంగమునఁ జక్రవర్తి నెదిర్చి యోర్చుటకు మన సేనలు చాలవు. ఘూర్జర మహారాష్ట్ర బంగాళ నేపాళాది సమస్త జాతీయ వీరభటపటలజటిలంబైన మహాసైన్యం బేర్పడవలయు. కాని జన్యంబునందు హైందవరాజన్యుల కట్టి యైకమత్య సంఘటనంబు దుర్ఘటంబని నాతలంపు. మొన్నఁ జక్రవర్తిగావించిన యకార్యమునం జేసికదా

రాజపుత్రు లెల్లరు రోసమున నీకడ మీసములు దువ్విరి! ఈచి
త్తూరుదండయాత్రనుగూర్చి చక్రవర్తి యోచించుచుండిన యింత
కాలమునుండియు వారి కామీసమ్ము లేమైనవి? ప్రతాపా! త్రవ్వి
నకొలది రాజకీయమర్మము లనేకము లుండును. ఇన్నియు విమ
ర్శింపక పౌరుషప్రదర్శనమ్మునకుం గడంగితిమా చక్రవర్తి
క్రొత్తగఁ దెప్పించిన ఫిరంగులను విచిత్ర యంత్రంబులనుండి వెడలు
భీకరానలకీలికామాలికలయందు క్షణమాత్రమున భస్మీభూత
గాత్రుల మయ్యెదము. ఎదిరిం దన్ను నెఱుంగక-దేశకాలపాత్రం
బులు పాటింపక-శౌర్యప్రధానుల మని శాత్రవానలంబున మిడు
తల వడువునఁ దుప్పతుప్పున నెగిరిపడి, చప్పుచప్పున మడయుట
కంటె- కరవాలములు దించి-క్రౌర్యమ్ము నడంచి-కర్తవ్యమ్ము నెంచి-
సామదానాద్యుపాయమ్ముల నవధ్యులైన విపక్షుల మన పక్షమున
కాకర్షించి, నిజరాజ్యంబునకే గాక సమస్తభారత సామ్రాజ్యమ్ము
నకుంగూడ శాంతిసౌఖ్యంబులఁ బ్రసాదింపఁ బ్రయత్నించుట
మహాపురుషలక్షణము గాదా? ఉగ్రసేనా! నీవు బుద్ధమంతుఁడవు
గదా? ఇంచుక యూహింపరాదా?

ఉగ్ర—దేవా! ఇదివరకే యూహించితిని.

ఉద—ఏమియూహించితివి?

ఉగ్ర—చక్రవర్తిబలంబులు స్వల్పసంఖ్యాకములు. మనకుఁ దోడురా
నున్న రాజపుత్రబలంబు లపరిమితసంఖ్యాకములు. కోటనుండి మన
బలంబులు—బైటనుండి రాజపుత్రబలంబులు-నడుమం గల మొగ
లాయి బలంబులఁ జలంబునం డాసి, చిందరవందరచేసి కాందిశీకము
లుగావింపఁగలవు—

వీరా—ప్రాణేశ్వరా! మరొక్కటి యూహింపుఁడు! లతాంగిం దనకొ
సంగవలెనట. అందుతోఁ గప్పంబును జెల్లింపవలెనట. ఇదియే



కదా మానసింహుని ముఖంబునఁ జక్రవర్తియంపిన రాయబారము!
మన్ననగన్న రాచకన్నె యెన్నడేనట్టివాని వరించునా! కాంతా
కనకంబులకొఱకుఁ జిత్తూరుకోట ముష్కరతురుష్కులచే ముట్ట
డింపఁబడుట యిది రెండవసారి. పద్మినీకాంతకొఱ కలాయు
దీనుఁదండెత్తివచ్చి నప్పుడిందలి వీరక్షత్రియకుమారు లెల్లరు స్వరాజ్య
స్వగౌరవ స్వాతంత్ర్యసంరక్షణార్థము తమతమ శిరఃకమలములతో
రణదేవత నారాధించుటచే నీచిత్తూరుకోట కాశీరామేశ్వరాది
పుణ్యక్షేత్రములకంటెను బవిత్రక్షేత్రంబయినది. శ్రీ యజ్ఞమును
నాత్మయజ్ఞమును గావింపఁబడిన యాపుణ్యదినము శివరాత్రి
మహోదయాది పుణ్యదినములకంటెఁ బుణ్యదినంబైనది. ఇంక
నిప్పుడన్నో—

ఉద—అట్టి దుస్సాహసంబున కవసరంబు గానరాదు. ఆచక్రవర్తి వేరు.
ఆదినంబులు వేరు. ఆదినంబులు హిందూమహమ్మదీయులకు దుర్ది
నంబులు. ఇవి పుణ్యదినంబులు— పరస్పర జాతీయవైరానలంబున
కాదినంబు లింధనంబులు. సమస్తజాతీయైకమత్య సౌధంబున కీదినం
బులు సోపానంబులు— మహోదగ్ర భీభత్సరస సముగ్రంబులగు
క్రౌర్య దేవతానాటకంబుల కాదినంబులు రంగస్థలంబులు. నిశ్చల
నిర్వికారశాంతి దేవతారాధనమ్మున కీదినంబులు దివ్యమంటపం
బులు. అవి బాహుయుద్ధంబులు. ఇవి ధర్మయుద్ధములు. అవిరక్త
ప్రవాహములు. ఇవి శాంతి ప్రవాహములు. ఆతఁ డల్లాయుదీను
చక్రవర్తి. ఈతఁ డక్బరు చక్రవర్తి!

ప్రతా—(నిరసనముతో నవ్వుచు) ఏచక్రవర్తియైన నేమి? లంకం బుట్టిన
వారెల్లరు రాక్షసులే కదా?

ఉద—అదియే పొరపాటుమాట. లంకం బుట్టిన విభీషణుండు సకల
లోకపూజ్యుండు కాలేదా? ఏజాతియందైనను దేశోద్ధారణార్థంబు

మహాత్ముం డొక్కఁ డొక్కఁడె యవతరించుచుండు. అతి బాల్యంబుననే పట్టభద్రుండై యప్రతిమప్రతిభావంతుఁ డగు చక్రవర్తి హిందువుల నిరంతరాయముగఁ బీడించు జిజియాపన్ను తొలంగింపలేదా? సహగమనంబను దురాచారము నడంపలేదా? త్రిసంధ్యలయందును సూర్యోపాసనం బెన్నఁడు మానక—ప్రతిపూట నూతనాగ్నిని వేల్చుచు—గోవధయు గోమాంసభక్షణమును సంపూర్ణముగ విడనాడి, గడ్డము దాల్పక పరమ భాగవతోత్తమునివలెఁ దిలకము ధరించుచు హిందూమహమ్మదీయోద్ధరణార్థము నిరంతరము పాటుపడుచున్న యమ్మహోదారచిత్తునితో శత్రుత్వమ్ముఁ గోరు మీరెల్లరుఁ బశుప్రాయులు. గర్వాంధులు. దేశద్రోహులు. ఓ దేవీ! యువరాజా! ఉగ్రసేనా? సత్వరం బెఱింగింపుఁడు! నా ప్రభుత్వమును విడిచెదరా? మీమీ ఖడ్గములు విడిచెదరా?

అందఱు—(వినయముతో) విడువఁజాలము. ఖడ్గముల విడువఁజాలము.

ప్రతా—(దీనముగా) తండ్రీ! ప్రాణమైనను విడిచెదను. ఖడ్గమును విడువఁజాలను.

ఉద—కుమారా! ప్రాణముమాత్ర మేల విడువవలయు? చిరంజీవివై వర్ధిల్లుము. ఇదిగో! స్వకుల క్రమాగత సకలరాజన్య చూడామణీ శిరోదంచితంబైన కాంచనకిరీటంబు. ఇదిగో రాజముద్రిక. పరిగ్రహింపుము. (అని యిచ్చివేయుచున్నాడు)

ప్రతా—తండ్రీ! క్షమింపుఁడు. ఇవి నాకక్కఱలేదు.

ఉద—(కోపముతో) పశువా! దేశద్రోహమునకేకాక జనకాజ్ఞోల్లంఘన మహాపాతకమునకుఁగూడ సిద్ధపడుచున్నావా!

ప్రితా—(కన్నీరు దుడుచుకొనుచు వానిని గైకొనును.)

ఉద—(తీవ్రముగా నిష్క్రమించును)



పితా—(పెద్ద నిట్టూర్పు విడిచి) ప్రతాపా! ఆకిరీటాంగుళీయకముల నెందైన భద్రపఱుపుము. (క్రిందనున్న ఖడ్గము నందుకొని) ఇది మహారాజుగారి కృపాణము. దీనిని ధరించి స్వయముగా శత్రుసంహారము గావించెదను. సకలసైనికనికాయములకుఁగూడ యుద్ధారంభమునకు సెలవొసంగి రణపతాకం బెత్తింపుము. ముసలితనంపుఁ దలంపులచేతను మానసింహుడు బోధించిన చెడుతలంపులచేతను మహారాజుగారి బుద్ధి చెడిపోయినది. ఆయన ప్రవర్తనమును గనిపెట్టుచు దత్సంరక్షణమునందు నీవప్రమత్తుండవై యుండవలయు... ఉగ్రసేనా! శత్రుసేననుండి యాయుధమ్ములు వెడలినవిమ్మటనే మన యాయుధములు ప్రయోగింపఁబడవలయును జుమా!

ఉగ్ర—చిత్తము. అట్లే యేర్పాటుచేసెదను.

---

## —• ద్వితీయరంగము. •—

[యుద్ధరంగము-ప్రవేశము-ఖడ్గహస్తులై-
ప్రతాపసింహుడు-ఉగ్రసేనుఁడు.]

ప్రితా—ఉగ్రసేనా! మన మీదక్షిణద్వారము నేమరఁగూడదు. కోటగోడ లించుక బీటలువాఱుటచే నంతకంతకీప్రాంతమే శత్రుసమాక్రాంతం బగుచున్నది. అందుచేతనే వీరపురుషోచిత వేషధారిణులై దంభోళిప్రతిమానంబగు చంద్రహాసంబును దాల్చి తల్లిగారు సైతము నిందే విహరించుచున్నారు.

ఉగ్ర—ఔను. వీరమాతలైన దేవిగారి భయంకరాకృతి నవలోకింప, దానవగణప్రాణాపహారణ ప్రవీణలైననాటి యుమాసత్యభామల సంగ్రామకథావిధానములు జ్ఞప్తికివచ్చుచున్నవి.

ప్రతా—కాని యిందొకవిశేష మున్నది. మాతాజీవారికిఁ దోడు పడుచున్న సైన్యములుగూడ స్త్రీ సైన్యములే.

ఉగ్ర—కాదామరి? స్వరాజ్యసంరక్షణమున మన చిత్తూరు పురంధ్రీ మణులుఁగూడ బద్ధకంకణలై పోరాడుచున్నారు.

ప్రతా—(చూచి) ఓహోహో! భారతవర్షమా? సాటిదేశంబులలో నీవెంతటి కీర్తినీయవమ్మా?

శా॥ ధైర్యస్థైర్యములుల్లసిల్ల రిపుసంత్రాసంబు గావించుచో
శౌర్యాటోపముతోడ నిట్లితర దేశంబందు నెందేనియుఁ
భార్యల్ భర్తలతోడ సంగరకళా పాండిత్యముం జూపిరే?
యార్యావర్తమ! ధన్యురాలవుగదమ్మా! నీవు ముమ్మాటికిన్॥

ఉగ్ర—(క్రిందకుఁ జూచి) కుమారభట్టూ! కుమారభట్టూ! ఇక్కడ! ఇక్కడ. ఈ బురుజుపై నున్నాము.

ప్రతా—(ఆతురతతో) కుమారభట్టా?

భట్టు-ప్రవేశించును.

ప్రతా—భట్టూ మహారాజుగారికిఁ గుశలమా! క్రొత్తయుపద్రవము లేమియు లేవుగదా?

భట్టు—ప్రతాపా! స్వయముగా నీవు నాకప్పగించినప్పుడు మహారాజుగారి కుశలమునకుఁ గొదువయుండునా?

ప్రతా—ఇప్పు డెచ్చటనున్నారు? ఏమిచేయుచున్నారు? నీకవితా చాతుర్యమున నాయనపిచ్చితలంపులేమైనఁ దొలఁగింపఁగలిగితివా?

భట్టు—పిచ్చితలంపులని చెప్పఁజాలము. మహారాజుగారి సూక్తి యుత్తమకావ్యమువలె వ్యంగ్యార్థస్ఫూర్తితో నున్నది. ఒకప్పుడిదంతయు ముసలితనంపు మతిభ్రాంతియనియే తోచుచుండు. ఒకప్పు డీమహనీయుండు దేవతాంశసంభవుండాయని స్ఫురించుచుండు.



ప్రతా—సరే! ఉగ్రసేనా! నీవేగి తక్కిన సేనానాయకులతో రణవ్యాపారమునందే యుండుము. నిన్నిప్పుడే నేను కలసికొనుచున్నాను.

ఉగ్ర—(నిష్క్రమించును).

ప్రతా—కవిశేఖరా! చెప్పుచెప్పు! తండ్రిగారి వర్తనమంత వింతగా నున్నదా?

భట్టు—మిక్కిలి వింతగానున్నది. ఆయనజాడలఁ గనిపెట్టుటకు నీవు నన్ను నియోగించినప్పటినుండియు వెనువెంటనే తిరుగుచున్నాను. మొన్నటిదినంబెల్ల నాయన మాటిమాటికి-అక్రౌర్యము-మనస్థైర్యము-ధర్మయుద్ధము-శాంతిస్థాపనము-అనుమాటలే తమలోఁదాము గొణుగుకొనుచు-వెంటనున్న నన్నుఁ జూచియుఁ బలుకరింపక పట్టణంబంతయుఁ దిరిగితిరిగి కడకు మన కారాగృహంబునఁ బ్రవేశించి తలుపులు మూసికొనిరి.

ప్రతా—(నోరుమూసికొని) అయ్యయ్యో! భట్టూ! ఇదివార్ధకదశామతి భ్రాంతి గాక వేరేమున్నదోయి!?

భట్టు—నేను నట్లులే భ్రాంతిపడి 'మహారాజా! ఈనీచప్రదేశము మీవంటి వారుండఁదగినదికాదు. అంతఃపురమునకు విచ్చేయు'డన నాయన వ్యధికరణపూర్వకముగా మందహాసమొనర్చుచు-'ఇది నీచప్రదేశమా! నీవు కవీశ్వరుడవుగదా! లెస్సగా యోజింపుము. నిశ్చలతపశ్చరణమున కింతకంటెఁ బవిత్రస్థలమొందు లేదు.' అని యోగాభ్యాసమును ప్రారంభించెను. ఆయన మాటలలోనేదో గంభీరార్థముండవలయును. ఇవి యంతయు మతిభ్రాంతియని మనము తప్పుతలంచుచుంటిమేమో?

ప్రతా—తప్పుతలంచుటలేదు. వెఱ్ఱికి వేయువిధములు. అందులోనిది యొకటి.

భట్టు—యోగాభ్యాసమునఁ గూర్చుండుటకు ముందుగా నుత్తరీయమును జించి కౌపీనముగా ధరించి తక్కిన దుస్తులు తీసి పారవేయుటచే నిదియొక విధమైన వెఱ్ఱియని నేనును భావించితిని-కాని—

ప్రతా—కాని—? ఇంకేమిసంశయము? నీవు మరలఁ బోయి చూచుసరికి-ఆకౌపీనము గూడఁ బారవేసి దిగంబరులై యుందురేమో?

భట్టు—అటుగాదు-ఏవిషయమునుగూర్చి ప్రసంగించినను బ్రత్యుత్తరంబీయని మహారాజుగారు భారతీయమహమ్మదీయసఖ్యమును దలపెట్టినప్పుడుమాత్రము-గంటలకొలది-సందర్భము చెడకుండ-యుక్తియుక్తముగా-గంభీరముగా నతిమనోజ్ఞముగా నుపన్యసించుట—

ప్రతా—నీకు వింత గానున్నదా? వెఱ్ఱికి-చెరుపు-మరుపు-గూడ నుండుచుండును. ఆ సంగతి నీ వెఱుఁగవేమో?

భట్టు—ఇన్నింటికేమిగాని ప్రతాపా! కావ్యరసార్ణవ మగ్నుఁడైన మహాకవివలె యోగాభ్యాసనిమగ్నులగు మహారాజుగారినిఁ జూచినప్పుడు మాత్రము-తద్గంభీరముఖమండలమునుండి యవ్యక్తమైన యొకవిధమగు దివ్యతేజము నాకు స్ఫురించుచుండును జుమా!

ప్రతా—(ఆశ్చర్యముతో) ఆఁ-ఆలాగునా!(యోచించి—తలపంకించి) -సరీ! భట్టూ! నే నింతకంటె నిందు మసలరాదు. మహారాజుగారి సంరక్షణము నందప్రమత్తుఁడవైయుండుము. పొమ్ము.

భట్టు—(నిష్క్రమించును)

ప్రతా—(కరవాలము సవరించుచుఁ దొందరగాఁ బోవుచుండ)

తెరలో—ఓవాహినీనాయకులారా!

శా. ప్రాకారంబు శతఘ్నికాహతులచే భగ్నంబుగా శాత్రవా
నీకంబుల్ చొరకుండ, మీరె తొలుతన్ మీమీచమూవీరులన్
దోకొంచుంజని ద్వారముం దెరచి శత్రువ్యూహముం జొచ్చి బా
హాకౌశల్యముతోడి మల్లరణవిద్యాప్రౌఢిఁ జూపిపుఁడీ!



ప్రతా—(విని) ఓహో! తల్లిగారు మల్లయుద్ధంబునకై సేనలకెల్ల సెలవొసంగుచున్నారు. అదుగో-మల్లరణవ్యాపారమున కనర్హులగుటచేఁ గాంతామణులు నగరిలోనికిఁ బంపివేయబడుచున్నారు. కోటగోడలు బీటలువారియుండుటయు- రాజపుత్రులకింకను ఫిరంగి యుద్ధంబులు స్వానుభవానువిద్ధంబులు గాకుండుటయుఁ దలంచి మల్లయుద్ధంబె కర్తవ్యమని లెస్సగా యోజించిరి. ఇంకఁ దడయనేల?

మ. బురుజుల్ డిగ్గి సమస్తసైన్య నివహంబుల్ వెంటనంటం, గడీ
దరవాజా తెరపించి మల్లరణ విద్యాఖేలనాలోకనా
తురతం బల్కెడు తల్లిగారి కొనగూర్తున్నిర్భరానందమున్
గరుణాదూర తురుష్కవారకదళీ కాంతారవిధ్వంసినై.

(పరువెత్తుచు నిష్క్రమించును)

—తృతీయరంగము—

కారాగృహము-ప్రవేశము—యోగనిమగ్నుఁడై యుదయసింగు-
ద్వారముకడ—కుమారభట్టు.

భట్టు—(చేతులుమోడ్చి) మహారాజా! నీవు శుకుండవో- సనకుండవో- ప్రహ్లాదుండవో! నెత్తురుకూడు కుడువనొల్లని తొల్లిటి యజాతశత్రుఁడవో! అహింసాపరత్త్వైక ప్రబుద్ధుండవగు బుద్ధుండవో! రాజ్యాంగవిషయ సంస్కరణరోచిష్ణుండవగు కృష్ణుండవో! కాక కేవల భారతీయ మహమ్మదీయ సమ్మేళన క్రియావతారుండ ... మరియే దివ్యపురుషుండవో? ఇందరుంగాక- అందరుం దలంచుచున్నట్లు వార్ధకదశావిఖ్యాత మతిభ్రాంతుండవేమో? తండ్రీ! నీవర్తనం బెట్లుగుర్తింపనగు?

శా. అక్రౌర్యంబున భేదవృత్తి మతజాత్యైక్యంబు మాకెల్ల ని
ర్వక్ర ప్రౌఢి నుపన్యసించి కలసర్వస్వంబు వర్జించి, కా
మక్రోధాదుల డించి యీ చెరయె సన్మాన్యంబటంచిందు వో
గ్రక్రాంతిన్ వెలుగొందు నీకిదె నమస్కారంబు రాజోత్తమా!.

నీవంటి మహానుభావుండే కోరికోరి కారాగారంబునఁ జేరిన యెడ నింక సామాన్యుల కిది యవమానం బెట్లగును? మరియు సన్మానంబే యగునేమో? నీమహానుభావంబు గ్రహింపనేరక నిన్ను ముసలితనంపుఁ బిచ్చి వానిగా నెంచిన కించిజ్ఞులము. మంద భాగ్యులము మమ్ముక్షమింపుము.

చ. స్వవిభవమున్ స్వకీయ ధనసంచయమున్ స్వశరీర సౌఖ్య మి
ట్లవిరళ రాజకీయ విజయాభిరతిన్ విడనాడి, కారలో
నిరువుర నొప్పు నిప్పుసరణిం గనుపట్టె; దగాధమా మహా
ర్ణవమటు నీమహత్త్వము తలంచకొలందినిలాతలాధిపా.

గీ. సందియము లేదు లేదింక ముందుముందు
నీవలోకమాన్యుండవై నివ్వటిలెదు
దేశబంధుండవై నీవ తేజరిలెదు
కడు మహాత్ముండవై నీవె ఘనతగనెదు.

(తెరలోఁ గలకలము) ఈయాకస్మిక మహాధ్వానం బెక్కడిది! (పరికించి) దక్షిణప్రాంత సమాగతంబుగాఁ దోచుచున్నది. (నిదానించి) కేకలు! పాదసంఘట్టనములు! పరుగులు! (భయాశ్చర్యములతో) తురకలు! తురకలు! మహోపద్రవము! మహోపద్రవము! అయ్యయ్యో! ఏమిగతి! మహారాజున కేమిగతి! ఈమహానీయుని కేమిగతి! అంగరక్షకు లెవ్వరును లేరే! ఈతురకలబారి నుండి వీని నెట్లు కాపాడఁగలను? ఇయ్యనుప తలుపులకుఁ దాళములు వైతునా? (తొట్రుపాటుతో వెదకి) ఎక్కడను గానరావు



అయ్యయ్యో! తరుణము మించిపోవునేమో! ఏమిదారి? ఒక్క కరవాలంబైన లేకపోయెనే! ఎవ్వరి నడిగెదను? (గట్టిగా) ఎవరక్కడ? కరవాలము! కరవాలము!

ఉద—(యోగమునుండి త్రుళ్ళిపడి) ఎవఁడా నిర్భాగ్యుడు! కరవాలమని కేకలిడుచున్నాడు.

భట్టు—(చేతులు మోడ్చి) మహాత్మా! తమ యోగదీక్షకు భంగము గలిగించిన నిర్భాగ్యుఁడను నేనే

ఉద—యోగదీక్షకే కాదు. నాధర్మదీక్షకుఁగూడ భంగము కలిగించుచున్నావు.

భట్టు—కరవాలమని యుగ్గడించియా?

ఉద—సందేహమేమి? ఆకఠోరశబ్దము నాచెవింబడుటనుభయముచేత నే యీమూలఁ జేరుకొంటిని. క్రౌర్యమునకు మూలము—దౌర్జన్యమునకాలవాలము—రాజన్యసౌజన్యాంబుదప్రకరమ్మునకు వాతూలము—శాంతిగృహమున కగ్నిజాలము—నగుకరవాలమును గన్నెత్తి చూడను. చెవియొగ్గివినను.

భట్టు—మహాత్మా! అపరాధము ఎట్టులో గోటలోఁ జొరబడిన శత్రులబారినుండి తమ్ము రక్షించుటకు—

ఉద—(నవ్వుచు) తొలుత నిన్ను నీవు రక్షించుకొనఁదలంచితివేని శీఘ్రముగ లోనఁబ్రవేశింపుము!

భట్టు—(ఊరకుండును)

ఉద—తలవంపుగాఁ దలంపకుము. ఇదిపవిత్రక్షేత్రము. సత్యము—శాంతము—ధర్మము—అనుమూఁడు మహాశక్తులిందుగలవు. ఎట్టి మహోపద్రవమునుండి యైననిన్నుఁ గాపాడఁగలవు.

భట్టు—మహోపద్రవము! నిజముగా మహోపద్రవము! అరుగో! అరుగో (అని లోనఁ జొచ్చి తలుపులు మూసివేయును.)

ప్రవేశము—జయచంద్రుడు మరి యిరువురు తురకీలు

జయ—ఇంకలతాంగి యాళవిడిచిపెట్టి పాదుషావారికి మరొకనజరానాసంపాదించవలెను.

1 వ—లతాంగేకాదు; యీప్రాంతంలో యెవరూకనపడరు.

జయ—ఇదంతయు జైలుఖానావలె సున్నదిచూడు!

2 వ—నిజం, నిజం జైలుఖానా. ఇక్కడగొప్పగొప్ప సైతానులు వుంటాయి. అందులో హిందూసైతాన్ పట్టుకుంటే మరివిడదు.

జయ—ఖైదీలుకాబోలు! అందులో నిద్దరు మనుష్యులు కనబడుచున్నారు. వారిని విడిచిపెట్టినయెడల సంతోషించి మనకుఁగొంతభోగట్టాచెప్పెదరేమో! అరే! తాళము విరుగగొట్టు!

(ముువ్వురుసమీపించెదరు.)

1వ—(కవాటము స్పృశించినంతనే యది ప్రక్కకుఁదొలంగును.)

1వ 2వ—అరే!అరే! (నవ్వుచుఁ జప్పట్లు చరచెదరు)

1వ—మస్నఫ్‌దార్జీ! వీరు పచ్చిదొంగలు

2వ—మనకు భయపడి ఖైదీల్లాగ దొంగవేషం యేస్తూన్నారు.

భట్టు—అయ్యా! మేము దొంగలముగాము. వీరు రాణావారు. నేను—

ఉద—ఔను. నేనుదయసింగును. ఈతఁడు మారాజాస్థానకవి.

1వ—ఎవడో పిచ్చోడు. ఉదయసింగునంటున్నాడు.

జయ—ఎవరైననేమి? పట్టుకొనుఁడు. పాదుషావారికి నజరాణదాఖలు చేయుదము.

భట్టు—(భయముతో) ఓరతురకభటులారా! ద్వారపాలులారా! మోసము మోసము! రండు రండు! కరవాలమందిండు!

జయ—అరే! ఆ ప్రేలుచున్న వానికి దాడలువాయఁగొట్టి యీయిద్దరిని వెలుపలికీడ్చుకొనిరండు!

1వ 2వ—(దురుసుగా లోనఁబ్రవేశించి-వెనుకకుఁ త్రుళ్లిపడి-మరలి)



1వ—అబ్బబ్బా! అగ్గిలోదూకినట్లు నావొళ్ళు భగ్గున మండిందిరా!

2వ—నా కూపిరే రాలేదురా!

జయ—ఓరి పిరికిపందలారా? పట్టపగలే యెక్కడిసైతాన్‌వచ్చినదిరా! (అని చొరఁబడి వెనుకకుఁ దిరుగఁబడి లేచి) అరే! సైతాన్! నిజము నిజము. కన్నులు కనఁబడలేదు. చెవులు రింగుమనుచున్నవి. ఏదో పెద్ద కనికట్టుండవలెను! (అని యొడలు దులుపుకొనును)

ప్రవేశము—రెండుచేతులఁ గత్తులతో—కుమారసింహుఁడు.

కుమా—ఆ కేక లీప్రాంతమునుండియే వినఁబడినట్లున్నవి. (పరికించి చూచి) ఎంతయుప్రదము! ఈదుష్టులబారినుండి యీపిచ్చిరాజును గాపాడకున్న నేమిదారి? (ముందుకు లంఘించి!)

గీ. వృద్ధుఁడై యోగియై యున్న విభునితో, న
వక్రదోర్విక్రమక్రమ వైభవముఁలఁ
బోరనెంచిన మునలుమాన్‌వీరులార!
రండు రండు కుమారసింహుండుగలఁడు.

(మువ్వురు నాశ్చర్యముతో నొండొరులఁ జూచుకొందురు)

కుమా—(ఎడమచేతికత్తి లోనికివిసరి) భట్టూ! ఇంకఁ గృపాణపాణివి గమ్ము. మహారాజును రక్షింతము.

భట్టు—(పరుగునఁ గరవాలమందు కొనుచుండ)

ఉద—కవిశేఖరా! వలదు వలదు. నన్ను దున్నింపుము.

భట్టు—(వినక-కరవాలమందుకొని వెలుపలికి లంఘించి) దురాత్ములారా! ఇంకేమిచేసెదరు? ఇమ్మహాయోగిని, పరమసాధుశీలుని కేవలరాజర్షిని-ఇయ్యతిచూడామణి నింకెల్లు భంగపరుపఁగలరు? (అని యుద్ధమునకు సిద్ధపడును-ఉభయపక్షములు యుద్ధసన్నద్ధములగుచుండ)

ఉగ—(పరుగున లేచివచ్చి వారిమధ్యఁ జొచ్చి చేతులెత్తి) తొందరపడకుఁడు! తొందరపడకుఁడు! రాజకుమారా! నీవెవ్వఁడవో మేమెఱుగము. నీకిచ్చట నెట్టి యధికారమును లేదు. కవిశేఖరా! నీవువా యాజ్ఞ తిరస్కరింపరాదు. జయచంద్రా! నేనింక మీయధీనుఁడను. నన్నుఁ గొనిపోయి చక్రవర్తికి ఖైదీగా సమర్పించుకొనుఁడు.

1 వ—అరె! అరె! ఎంతమంచి రాజురా!

2 వ—మంచియేమిటి? పిచ్చిరాజురా!

(ఉదయసింగుతో నిష్క్రమింతురు)

---

## —• చతుర్థరంగము. •—

యుద్ధరంగము—ప్రవేశము- కోపముతో వీరాబాయి— విచారముతో కుమారభట్టు—ఉండఁగా - ప్రతాపసింహుఁడు. ఉగ్రసేనుఁడు— భయముతోఁ జాటుచాటునఁ బ్రవేశింతురు.

వీరా—కవిశేఖరా! నీవు చెప్పవలసిన దింకేమైన నున్నదా?

భట్టు—ఇంకేమున్నది? ఆకుమారసింహుఁ డెంతయడిగినను నానెవ్వఁడో చెప్పలేదు. ఆతండెవ్వఁడైనను మహారాజుగారి కొఱకు శక్తివంచన లేకుండఁ బాటుపడుటచే మనకాప్తుఁడు. అందందుఁగల కొందఱు రాజపుత్రుల సమకూర్చుకొని పరుగునఁజని జయచంద్రు నడ్డగించి కొంతపోరాడెనుగాని పాపము వానికిఁ బ్రభువును విడిపించుట సాధ్యపడలేదు.

వీరా—చెప్పిన సంగతి మరలమరలఁ జెప్పనేల? కాలహరణమునకిది తరుణముగాదు. నీవింకఁబోయి శుద్ధాంత శిశు వృద్ధాది సంరక్షణము



నందప్రమత్తుఁడవైయుండుము. నాసెలవైనట్లుగ్రసేనునికడకెవరినైనఁ బంపుము.

ఉగ్ర—(చేతులు మోడ్చి ముందుకువచ్చి) దేవీ! ఉగ్రసేనుఁడిచ్చటనే యున్నాఁడు.

భట్టు—(నిష్క్రమించును.)

వీరా—ఉగ్రసేనా! శత్రుమండలమునఁ జిక్కిన తండ్రిగారిని విడిపించుటకై పాపము మనప్రతాపుండొంటరిగఁ బోరాడుచున్నాఁడు. నీవు సత్వరమాతనికిం దోడుగానేగుము.

ప్రతా—(వినయముతో సమీపించి) అమ్మా! మందభాగ్యుండగు ప్రతాపుఁడు గూడనిచ్చటనే యున్నాఁడు.

వీరా—(కోపముతో) ఆఁ—ఇచ్చటనే యున్నావా? ఎంతగొప్పకార్యము! నాకంటఁబడుటకు నీకుసిగ్గేలకలుగలేదు? మూర్ఖా! కడుభద్రముసుమీ యని ప్రత్యేకము చెప్పి యప్పగించిన ధరాతలనేతన రాతుల చేతులఁబడఁద్రోసి యిక్కడదాగుడుమూతలాడుకొనుచుంటివా? సంగ్రామరంగమునుండి తొలంగివచ్చుటకు నీకెవరాజ్ఞ యొసంగిరి?

...........లతాంగి జ్ఞప్తికివచ్చినదా?

ప్రతా—హరహరా! (చెవులుమూసికొని) అమ్మా!

వీరా—ఛీ! నిర్భాగ్యుఁడా! నోటనమ్మాయని నన్నుఁబిలుచుట కర్హుండవుగావు. నాటకరంగమున వీరపురుషవేషధారులగు పాత్రలకుంబోలె నపాత్రుండవగు నీకీశస్త్ర ధారణ మలంకారార్థమా! (తటాలున ఖడ్గములాగికొని ఇంకనాప్రోల నిలువక యావలికింబొమ్ము.

ప్రతా—తల్లీ! నిజముగా మహాపరాధము గావించితిని. క్షమింపుము. అభిమన్యువధనాఁడు సంశప్తకానీక మర్జునింబోలె నేను తురుష్కానీకము నన్నుఁజుట్టుముట్టుటచేత సమయమ్మునకు దండ్రిగారికి

దోడుపడవీలుపడలేదు. మనపాలిట జయచంద్రా ధముఁడు సైంధవునివలెఁ దాపరించినాడు. లేకున్నఁ గుమారసింహాదు లీ మహోపద్రవమును దప్పింపఁగలిగియే యుందురు. కర్తవ్యమును జింతింపక మించినదానికి నన్నింతనిందించిన నేమిప్రయోజనము? తల్లీ కరవాలమును గటాక్షింపుము. రణంబున కనుజ్ఞయొసంగుము.

ఉ॥ మాజనకుం దురుష్క-భట మధ్యమునుండి నృపాలపుత్రిక
న్రాజము లబ్బురంపడఁగ వాడనిపూవటు దేఁగలాడ, నేఁ
డా జయచంద్రుఁ గావవెలయన్ వలయుర్ గగనంబునుండి ఘో
రాజి మురారిచక్రమొ, పురారి త్రిశూలమొ, వజ్రివజ్రమో?॥

వీరా—ఔనౌను. నీ విపరీతవాగాడంబరము నేఁడు క్రొత్తగాదు. కరవాల మనుగ్రహింపవలయునా? ఈ మాటకు మోమోటము లేకపోయినదా? చేతఁ గరవాలమున్నప్పుడు నీవుచేసిన మహాకార్యమేమి? ఆతుచ్ఛ జయచంద్రునకు భయపడి నీవెందు దాగుంటివి? తండ్రికొఱకుఁ బోరాడి నీవు కడతేరియుండినను విచారింపకుందునే! బ్రతికి యేల నాకంటబడితివి? నీ నీచపుబ్రతుకెవరికొఱకు?—లతాంగికొఱకా?

ప్రతా—(పౌరుషముతో) ఉగ్రసేనా! వినుచుంటివా? తల్లీ! జరిగిన యపరాధం బెట్టులో జరిగినది. అందుకు నా శిరమ్ము దీయింతువుగాక! నన్నింత లింతలుగాఁ గోయింతువుగాక! మాటిమాటికి లతాంగిం బ్రసంగింపనేల? నాజీవితంబును నాప్రపంచంబును లతాంగియేయని భావించుచుండు కించిజ్ఞుండ ననుకొంటివా! ఆ లతాంగినే కాదు. ఇంక నాజీవితంబున మరి యేలతాంగినిం గూడఁ గన్నెత్తిచూడక, నాటి నుండి యాకీనినందనుని చందమున నాజన్మబ్రహ్మచారినై-మన ... యులువేల్పైన మహాదేవుండును-



వేలుపుటమ్మయైన భవానీదేవియు సాక్షులుగా-దివాకరనిశాకరులు ప్రేక్షకులుగా-నీచరణంబులు ప్రమాణంబులుగా—నేనింక.

ఉగ్ర—ఆ-ఆ—ప్రతాపా! (చప్పున నోరుమూసి) లేకలేక కలిగిన యొక్కఁడవు. కులము నిర్మూలముగావింతువా తండ్రీ!

ప్రతా—(కన్నీరు దడుచుకొనును.)

వీరా—(కన్నీరు దుడుచుకొని) ప్రతాపా! నీదుడుసుఁదనము నిన్ను విడిచినదికాదు. నిన్నెట్లు శిక్షింపవలయునో తెలియదు. లతాంగిం బరిత్యజించినంత మాత్రమున స్వార్థత్యాగివైన మహాయోగివని లోకము నిన్నుఁ గీర్తించుననుకొంటివా? అంతపౌరుషము గలవాఁడవు ఢిల్లీనగరమునందున్నాళ్లేల యుంటివో చెప్పు. లతాంగికొఱకుఁగాక.—అచ్చటికేగి నీవుచేసిన మహాకార్యమేమి? ఏదీ! నీవు చెప్పినట్టు లొక్క-రాజపుత్రుఁడైన మనకుఁ దోడువచ్చెనేమో చూపుము.

ప్రతా—అమ్మా! నే నేమిచేయఁగలను? పవిత్రనంతంబైన యమునా ప్రాంతంబున నిలిచి యారాజపుత్రులెల్లరు నేకగ్రీవముగఁ బ్రమాణము సేయ నేమో యనుకొంటిని.

శా॥ఆ జన్యుల కైకమత్యము స్వరాజ్యాకాంక్ష యన్యోన్య దు
ర్వైరాభావము సత్యనిష్ఠయును ధైర్యస్థైర్య, శౌర్యంబులున్
బ్రారంభంబున నుండియుండునెడ నార్యావర్తవాసాళికీ
దారిద్ర్యంబును దాస్యవృత్తియు మనస్తాపంబు నేకూరునే.

వీరా—ప్రతాపా! నీ యప్రయోజకత్వమును గప్పిపుచ్చుటకై చెప్పుచుండిన యీకొంటెసమాధానములను నేను వినను. తండ్రిని జెరపట్టిన జయచంద్రు నెదిరింపసాహసింపలేక, శత్రువులకుంజిక్కిన తండ్రిని విడిపించు శక్తిలేక-సన్యసించెదనని నీయసామర్థ్యమును నీవే వెల్లడించుకొనుచుండ నిన్ను నే నేల ప్రోత్సహింపవలయును?

(ప్రక్కకుఁదిరిగి) ఉగ్రసేనా! నే నిప్పుడ వెడలి సైనికనికాయంబులతోఁ జక్రవర్తి గుడారమును ముట్టడించి మహారాజుగారిని జెరవిడిపించి తెచ్చెదను. సాజాత్యంబును స్మరింపక-బాంధవ్యంబైనఁ బాటింపక మనకింత మహాపరాధమొనర్చిన యఖర్వగర్వధూర్వహుండగు జయచంద్రుని నేటి సూర్యాస్తమయ సమయమ్ములోపునఁ జెరపట్టికొనువచ్చువానికి లతాంగిని పారితోషికంబుగా నొసంగెదనని నాయాజ్ఞ మనచమూసమూహములందెల్లఁ జాటఁబంపుము.

ఉగ్ర—దేవీ! మీయాజ్ఞ తప్పక నిర్వహించెదను. ఏ వయసునందున్న తనయునిపైనైనను నల్లివహించు నాగ్రహం బనుగ్రహరూపము ననే వెడలుచుండు. లోకసామాన్యపాణిగ్రహణమున లతాంగిం జేపట్టక-మత్స్యయంత్రంబును దెగనేసి పాంచాలి నర్జునుండువోలె, మన ప్రతాపుఁ డాజయచంద్రుని సాధించి యక్కన్యాలాభమును బడయఁగలఁడు. ఇంకఁ గరవాల మనుగ్రహింపుఁడు.

వీరా—ఉగ్రసేనా! జయాపజయము లెట్లు నిర్ణయింపఁగలవు? ప్రతాపా! లోకభీకరంబైన యీకరవాలమున కపకీర్తి ఘటింపవుకదా!

ప్రతా—అమ్మా! పెక్కుమాటలేల?

గీ॥ కారలో నేను జయచంద్రఖలుని వమటో
యీప్రతాపుఁడు రణభూమి నీల్గి పడుటో
యపరవారాశిలోన సహస్రకరుఁడు
పడెడువేళకు మున్నె యేర్పడఁగవలయు.

వీరా—కుమారా! చిరంజీవిగమ్ము! యశోవంతుఁడవై రాజపుత్రకులము నుద్ధరింపుము! మన వేలుపుటమ్మయైన భవానీదేవిని స్మరించుకొనుము! నీ కరవాలము నింకఁ గైకొనుము! (ఇచ్చును)

ప్రతా—(అందుకొని తల్లికి నమస్కరించును.)

వీరా—(ఉగ్రసేనునితో నిష్క్రమించును)



ప్రతా—(ఖడ్గమును గన్నులకద్దుకొని)

గీ. కడకు నాచేతనె లతాంగి కంఠమందుఁ
బచ్చత్రాడు గట్టింతునో పరిణయమున
నాదు మెడకీవె యురిత్రాడు వౌదువేమొ!
చండికా! ఖడ్గమా! నీవె శరణమమ్మ!.

అయ్యో! శత్రుమండలమునఁ జిక్కిన తండ్రిగారికేమి కీడుమూడునో యని భయపడుదునా? శౌర్యాతిశయమున నొడలుమరచి యత్యంత సాహసంబునఁ జక్రవర్తిగుడారములు ముట్టడించుచోట నాతల్లికేమి యుపద్రవము జరుగునోయని చింతింతునా? లతాంగీపాణిగ్రహణ భాగ్యమునకై శంకింతునా? ఇన్నివిచారములలో శుష్కించుచున్న నా కాజయచంద్రునిఁ జెరపట్టుటయెట్లుసాధ్యపడు?

తెరలో—(డప్పు మ్రోగును)

ప్రతా—(విని) అదిగో! తల్లిగారియాజ్ఞ ఘోషకునిచే సేనావారమునఁ జాటఁబడుచున్నది. ఈచాటింపు నన్ను మరింతవికలచిత్తుంగావించుచున్నది. ఏమిసేయుదు? (యోజించుచుండును)

ప్రవేశము-ఖడ్గపాణియై కుమారసింహుఁడు

కుమా—ఓ రాజపుత్రులారా! దేవిగారికిఁ దోడుపడుటకు శంకించుచున్నారేమి?

మ. వికలుండయ్యెఁ బ్రతాపసింహుఁడటు తన్వీమోహమందంచు నూ
రక చింతింతురె? చక్రవర్తి శిబిరాక్రాంతిన్ విజృంభించు దే
వికిఁ జేదోడు కుమారసింహుఁడిదిగో విచ్చేయుచున్నాఁడు జం
కక జెండాలెగిరింపుఁ డెల్లరుఁ దురుష్కస్వామిడేరాలపై.

ప్రతా—(తిరిగిచూచి) ఎవఁడు? కుమారసింహుఁడా? (సమీపించి) ఓయీ! మహారాజుగారిని దప్పింపఁబ్రయత్నించిన కుమారసింహుఁడవు నీవేనా?

కుమా.—నేనేకాని దేవిగారికిఁ దోడుపడఁబోవుచుండిన నాసమరసంరంభము వారింపకుము.

ప్రతా.—భయములేదు. నీసహాయము మాతల్లిగారికంత యావశ్యకమైయుండదు. నేనును నీవలెనే యాజయచంద్రాధమునికై సమరసంరంభమునందేయున్నాను. మనము నడచుచునే ప్రసంగింపవచ్చును. (అని వానితోనడచుచు) ఓయీ! తన్వీమోహమునఁ బ్రతాపసింహుఁడు వికలుండయ్యెనని పలుకుచున్నావు. నన్నుఁగూర్చి లోకమిట్లే వాకొనుచున్నదా?

కుమా.—లోకమంతటిమాట చెప్పఁజాలనుగాని యీచిత్తూరులో మాత్రమాబాలగోపాల మిదియేవదంతి దేవిగారు చాటించినది వినలేదా?

ప్రతా.—ఎట్లు వినకుండఁగలను?

కుమా.—వినియే యీవదంతి కింతవింతపడుచున్నావేమి?

ప్రతా.—సాధువులయెడ సర్వేశ్వరుం డింతటి తటస్థుఁడా యని వింతపడుచున్నాను. ఆచాటింపే యీయపవాదమునకు దోహదమని యెరుగుదును.

కుమా.—పాపము! నీవంటివానికిట్టి యపకీర్తి రాఁదగినదికాదు.

ప్రతా.—కోరకయే సానుభూతి నెరింగించుచున్న నీకంటె నాకాప్తుఁడెవఁడు గలఁడు? రాజకుమారా! మాతండ్రిగారినట్లు తప్పింపఁ బ్రయత్నించుటయు - ఇప్పుడు మాతల్లిగారికిఁగూడఁ దోడుపడఁ జాలుపడుటయుఁ దలంచుకొన నేమియొసంగినీఋణము తీర్చుకొనగలనో తోపకున్నది.

కుమా.—సంకల్పమున్నప్పుడు సాధనము లేకపోదు. ఋణము తీర్చుకొనుట కేమియొసంగ సమర్థుఁడవుగావు? నీకట్టి తలంపుగలదేని నిన్నొక్కటి గోరుచున్నాను.



ప్రతా.—ఆహా! నాకంత భాగ్యమున్నదా? నీవాంఛితార్థం బెఱింగించి యీమూలముననైన నన్ను ధన్యుంజేయుము!

కుమా.—ఎరింగించెదనుగాని మాటయిచ్చినట్టులేకదా?

ప్రతా.—(ముక్కుపై వ్రేలిడుకొని) ఎంతమాట? ఉత్తమరాజపుత్రుని నోటవెడలిన మాటకిన్ని మాటలుండునా? ఈయపనిందకుఁ దోడుగ నసత్యదోషమునకుఁ గూడఁ బాలుపడవలయునా? అయ్యో! ఏలతాంగి యందలి యనురాగాతిశయమున నాహృదయమును గఠినపాషాణ మొనర్చుకొని, జనుల యపవాదమును జనని కఠోర వాక్యములును సహించుకొనుచున్నానో యాలతాంగి ప్రమాణముగా నీకోరునది సమకూర్చెద.

కుమా.—ప్రతాపా! నిన్ను నేను గోరునదికూడ నదియే! ఆలతాంగిని నాకొఱకు విడిచిపెట్టుము.

ప్రతా.—(విచారాశ్చర్యముల నభినయించుచు నిశ్చేష్టితుఁ డగుచున్నాడు)

కుమా.—నిశ్చేష్టితుఁడవై మాటాడవేమి? చిరకాలమునుండి నాకామెపై వలపుగలదు. రాజస్థానమునఁగల రాజకన్యకలలో నీయిచ్చకు వచ్చిన చపలాక్షిం దెచ్చి నీకిచ్చెదను.

ప్రతా.—ఎవరికి? నాకా! ఈవరమనిర్భాగ్యునకా? నీవు ప్రయాసపడ నవసరములేదు. లతాంగిని నీవు పరిగ్రహింపుము చాలును. నేనాజన్మబ్రహ్మచారినై యిట్లేగడపెదను. మాపరస్పరానురాగము-మాతల్లికి-ప్రజలకు-ఆప్తులకుఁ గడకు దైవమునకుఁగూడ ననిష్టముగనే యున్నది. వివాహము-రాజ్యము-అభిషేకమున్నగునాజీవితాశయములన్నియు నేటితో సంపూర్ణముగనాశనమైనవి. మహర్షులు సైతము సామాన్యముగఁ ద్రెంపనేరని మోహశృంఖలములు నాయెడ నప్రయత్నముగనే తెగిపోయినవి. ఇంక మాతండ్రీ—ఆహా! అమహా

మహాుని స్మరించినంతమాత్రమున నాయొడలెల్లఁ బులకరించుచున్నది! సకలరాజ్య పరిత్యాగంబు గావించి కిరీటాంగుళీయకముల నాకొసంగినాఁడు. ముదుసలితనంబుఁ బిచ్చి తలంపనితప్పు తలంచితినేకాని, నాగంభీరహృదయుని హృదయతత్వంబు గ్రహింపనేరనైతి. ఇంక నారాజర్షిచరణారవిందముల నాశ్రయించి సేవించుచుఁ దదుపదేశంబు లాలించుచు, నేనును ఋషికుమారునివలెనే సంచరించెదను. ఇంతకంటె నాజన్మమునకు సాఫల్యమేమున్నది?

కుమా—నాకుఁగూడ నిదియే యుత్తమమని తోఁచుచున్నది. ఇంక నీకాజయచంద్రుని జోక్యంబేల? వానిం జెఱపట్టుట లతాంగి కొఱకేగదా!.

ప్రతా—కాదుకాదు. తల్లిగారిమీఁదఁజేసిన శపథము నిలుపుకొనుట కొఱకు. ఆదురాత్మునిఁ బట్టితెచ్చి లతాంగిని నీకు విడిచెదను.

తెరలో—

ఉ॥ పౌరుషవంతులై యకట భండనమందొక యాడుదానితోఁ
బోరొనరింపలేక యెటుపోయెదరో సరదారులార! దో
స్సారుఁడు మీకుఁదోడు జయచంద్రుఁడు వచ్చుచునున్నవాఁడు
చిత్తూరు జయించి సంతసముతోఁ జనవచ్చు నిలుండు పోరునన్॥

ప్రతా—(విని) తల్లిగారి సమరవిజృంభమున కాగలేక పఱగులిడు మొగలాయి సైనికులకుఁ దోడుపడుటకు - ఆదుష్టజయచంద్రుండీ సమీపమునుండియే పోవుచున్నాఁడు. పరుగునఁజని వాని నడ్డగించెద—

(పరుగున నిష్క్రమించును.)

కుమా—(వానిపోకడ నిదానించుచుఁ జనును.)

# నౌరోజా

## —• పంచమాంకము •—

### —• ప్రథమరంగము •—

(యుద్ధరంగమునందలి యక్బరుకార్యస్థానము-ప్రవేశము-అక్బరు-మానసింగు-గడగడ వడకుచు యిరువురు భటులు)

అక్బ—(కోపదృష్టితో) మానసింగ్! ఈపశువుల కీయధికారమునెవ రొసంగిరి! వట్టిసాధుశీలుఁడు- కేవలమువృద్ధుడు-వస్త్రత్యాగి-శస్త్రత్యాగి-ప్రపంచమును వర్జించి ముక్కుమూసికొని యొకమూలఁ గూర్చుండినవాఁడు-అట్టివానిం జెరపట్టితెచ్చి మహావీరులమని విఱ్ఱవీగుచున్నారా? జయచంద్రుఁ డిట్టియకార్యమొనర్చునని నేనెన్నఁడు ననుకొనలేదు. స్వార్థతత్పరుల కాశాభంగముకంటె వేఱుశిక్ష లేదు. అందుచేఁ బ్రస్తుతము వానికిఁగల యైదువేల మన్సబునుండి మూఁడువేల మన్సబునకు దిగద్రొక్కవలెనని నాతలంపు.

మాన—చిత్తము. శ్రీవారు కొంచము శాంతింపవలయును. ఈసంగతి యుద్ధానంతరమున విచారింపవచ్చును.

ప్రవేశము—జమాన్ ఖాన్.

జమా—ఘామసామహారాజ్! (వంగిసలాములు చేయును).

అక్బ—జమాన్ ఖాన్! స్థితిగతులెట్టులున్నవి?

జమా—మహాప్రభూ! ఏమిచెప్పఁగొనగలను! మనజయచంద్రమన్సబ్దారువారు ప్రతాపసింహునిచేఁ జెరపట్టఁబడినారు.

అక్బ—(ఆశ్చర్యముతో) అఁ—మానసింగ్! ఎంతవైపరీత్యము!

మాన—చిత్తము. జయచంద్రుఁడు రాణాను బట్టుకొనుటయే యీవైపరీత్యమునకుఁ గారణము!

అక్బ—(శిరమూపుచు) చిత్తూరుకోట ముట్టడింపవలెనని చిరకాలము నుండి కోరుచుండిన జయచంద్రునకు నేడు తగిన ప్రాయశ్చిత్తమైనది.

జమా—మహాప్రభూ! జయచంద్రుఁడు రాణానుబట్టుకొనుటచే రాజపుత్రులు చావునకుఁ దెగించి వీరావేశమున నొడలుమరచి పోరాడుచున్నారు. మనము తెచ్చిన యిరువదివేల సైన్యములో సగము సైన్యము నశించినది. ఇంచుమించుగ నేఁడెనిమిదివేల సైన్యము నాతల్లి కుమారులే కడతేర్చిరని చెప్పవచ్చును.

అక్బ—(శిరముపంకించి) మానసింగ్! ఇప్పట్టున రాణానువిడిచిపెట్టుట మనకవమానకరము. విడువనియెడ రాజపుత్రుల యుద్ధమింతకింకఁ బ్రబలము కాకతప్పదు.

జమా—తప్పదు. మహాప్రభూ! ఇదివరకే కొన్ని డేరాలపై రాజపుత్రుల పతాకములు నెలకొల్పఁబడినవి. ఇంకమీఁద—

అక్బ—అందుచే మానసింగ్! సత్వరము ఢిల్లీనగరమునుండి ముప్పదివేలసైన్యమున కాజ్ఞాపత్రమునుబంపుము.

మాన—మఱియొకమారు మనము రాణాతో ముచ్చటించి—

అక్బ—ఏమిలాభమున్నది? ఇంకఁ జిత్తూరువారితో సఖ్యమసంభవము! ఒకప్పుడు రాణాను మన మొప్పించినను బ్రయోజనముండదు. వాని మాట వానిభార్యాపుత్రులు సాగనీయరు.

మాన—జమాల్ ఖాన్! రాణావారు సమాధినుండి లేచిరో లేదో మాడు—

అక్బ—లేచినయెడల మాసెలవైనదనిచెప్పి తోడ్కొనిరా!

జమా—చిత్తము. (నిష్క్రమించును)

అక్బ—రాజస్థానమంతయు మనకుఁ గరతలామలకమైనది. మనశాసనమున వర్తించుచున్నది. ఈచిత్తూరుమాత్రమే రాజపుత్ర మహా



మ్మదీయ సఖ్యంబునకు విరోధమై బాధించుచున్నది. ఎట్లో రాకరాకవచ్చి కోట ముట్టడించితిమి. అందుచే గొనచూచువరకు విడువఁగూడదు.

మాన—రాజపుత్రులనుగూర్చియే తమరు తప్పుతలంచుచున్నారని నామనవి. రాజస్థానము శేషమును మీసార్వభౌమత్వమున కెంతలోబడియున్నను, చిత్తూరున కొకకీడు మూడునప్పుడుమాత్రము మీకు వ్యతిరేకముగాఁ దిరుగకమానదు.

(ప్రవేశము-జమాల్ ఖాన్-ఉదయసింగు-)

అక్బ-మాన—(లేచి నమస్కరింతురు)

అక్బ—మహాత్మాజీ! ఇదిగో యాసనము.

మువ్వురు—(కూర్చుందురు)

అక్బ—మీ యోగదీక్షకేమియు భంగముకలుగలేదుకదా! మేమంపిన ఫలాహారమును గైకొంటిరా?

ఉద—కైకొంటిమి. వీధిద్వారముకడ నల్లకల్లోల మధికముగానున్నది. వెనుకవైపుననున్న గుడారమేదైన నేర్పరచినయెడ మాయోగదీక్షకు—

అక్బ—తప్పక యట్లే యేర్పరచెదను. జమాల్ ఖాన్! అట్టియల్లకల్లోలమేల జరుగవలెనో కనుఁగొనిరా!

జమా—(నిష్క్రమించి, ఒక ఫకీరుతోఁ బ్రవేశించి) మహారాజా! ఏలినవారిదర్శనమునకై వచ్చుచుండిన యీ ఫకీరును సిపాయిలడ్డగింప—

అక్బ—ఏల యడ్డగింపవలయును? అల్లాహో! అక్బర్! మహాత్మా! ఇదిగో యాసనము. అజ్ఞానులైన సిపాయిలు గావించిన యపరాధమును క్షమించి తమరాకకుఁ గారణమెరిగింపుఁడు! మహమ్మదీయసన్యాసులైన తమరును హైందవ రాజయోగులైన యీరాణా

వారును నేకకాలమున మాకార్యాలయము నలంకరించుట హిందూమహమ్మదీయసమ్మేళనము సమకూడినట్లే యున్నది.

ఫకీ—తథాస్తు! తథాస్తు! సార్వభౌమా! నీకోరిక నెరవేరుఁగాక! నా రాకయు హిందూమహమ్మదీయసమ్మేళనము కొఱకే! ఇదిగో! ఈ యుత్తరము నీకు సమస్తము విశదపరుపఁగలదు- (ఒక యుత్తరమిచ్చును)

అక్బ—(అందుకొని) మానసింగ్! (ఇచ్చును.)

మాన—(పుచ్చుకొని) "హైందవసామ్రాజ్య చక్రవర్తులగు శ్రీ అక్బరు ఫాదుషా వారి దివ్యసముఖనకు-దేవా! ఆనాడు నౌరోజా యుత్సవమునఁ దమరు నన్ను వరించుట.

అక్బ—(ఆశ్చర్యముతో) ఆఁ-ఆఁ-లతాంగియా? రాజాజీ? మీలతాంగియా?

ఉద—కొసవరకు విన్నఁగాని చెప్పఁజాలను.

మాన—జయచంద్రుని భార్యయైన నర్మద యెట్లో తెలిసికొని నన్ను చిత్తూరు పంపివేయుటచే—

అక్బ—మారువేషధారులైన చిత్తూరు వారెవరో లతాంగిని గొనిపోయినట్లు జయచంద్రుఁడు చెప్పెనే? తుచ్ఛుఁడు-నీచుఁడు—

మాన—నాకృతజ్ఞత తమకుఁ దెలుపుటకు నాకవకాశము దొరకలేదు. మరియు దమరు చిత్తూరు ముట్టడించుటకుఁ గల కారణములలో నే నొక కారణమని తెలియవచ్చుటచేత నీయుత్తరమును వ్రాయుటకు సాహసించుచున్నాను. త్రికరణశుద్ధిగాఁ దమ సేవసేయఁ గోరు నన్నుఁ బరిగ్రహించి-మీరు చిత్తూరువారికి బంధువులును మిత్రులును గావలయునని యీశ్వరుని గోరుచున్నాను-ప్రియురాలు"



అక్బ—(ఉత్తరము తీసికొని సంతోషముతో) శబాస్! లతాంగీ! నీప్రార్థనము సర్వేశ్వరుండు మన్నించుఁగాక! ఫకీర్మహారాజ్! ఈయుత్తరము లతాంగి యెప్పుడిచ్చినది?

ఫకీ—ఏమో! ఆలతాంగి యెవరో నాకుఁ దెలియదు. నేను గోటలో భిక్షాటనమున నుండఁగా నొక రాజకన్యక-పదునెనిమిదేండ్ల ప్రాయముగలది—

అక్బ—ఔను. అంతేప్రాయముండును.

ఫకీ—చక్రవర్తుల భార్యలు ధరింపవలసిన దివ్యాభరణములు దాల్చి—

అక్బ—ఆ యాభరణములన్నియు నేనొసంగినవే—

ఫకీ—అమూల్యంబగు నొక ముత్యాలహారము గళమునఁ దళతళలాడుచుండ—

అక్బ—ఆముత్యాలహారము గూడ నాదియే!

ఫకీ—నన్నుఁ బిలిచి యీయుత్తరమును మీకిమ్మని బ్రతిమాలినది.

అక్బ—మరి సందేహ మేమున్నది? మీ రెఱుగరుగాని యామె పేరే లతాంగి. రాజాజీ! ఈయుత్తరమును జూచియైన లతాంగిని మాకొసఁగుటకు మీ రాజపుత్రులు సమ్మతింతురా!

ఉద—ఆయుత్తరము నే నొకమారు చూడవచ్చునా?

అక్బ—అభ్యంతర మేమున్నది? (ఇచ్చును)

ఉద—(పుచ్చుకొని పఠించి) ఇట్టి యుత్తరము వ్రాసిన లతాంగిని మీకిచ్చుటకు రాజపుత్రుల కభ్యంతరముండఁగూడదు. అయినను మనము సావకాశముగ నాలోచించి కొన్ని సంధిషరతులతో నీయుత్తరమును మానసింహుని ముఖంబునఁ జిత్తూరు రాణికిఁ బంపుదము. ప్రస్తుతము సంధిపతాకము నెత్తింపుఁడు.

అక్బ—సంధి నిర్ణయింపఁబడకయే సంధిపతాకము నెత్తించిననది మా కెంత మోసము!

తెరలో—ఎంత మోసము! ఎంత మోసము! పాదుషావారెక్కడ?

అందరు—(త్రుళ్ళిపడి చూచుచున్నారు.)

భటుఁడు—(ప్రవేశించి) మహాప్రభూ! మోసము! మోసము! రాజస్థానమునఁగల రాజపుత్రులందరు మహాసముద్రమువంటి సైన్యముతో దేవరవారిపై దండెత్తివచ్చుచున్నారు.

అక్బ—(తత్తరపాటుతో) ఆఁ-ఆఁ-మానసింగ్! ఏమియుపద్రవమిది!

ఫకీ—సార్వభౌమా! తత్తరపడకుము! రణమునకుఁగాదు. వారెల్లరు నీ పరిణయమునకు వచ్చుచున్నారు. దండెత్తివచ్చిన యారాజపుత్రులచే నీపెండ్లిలో దండాడింపుటాట యాశింతువుగాని సంధి పతాకమెత్తింపుము.

ఉస—సంశయింపక యీను సంధిపతాకము నెత్తింపుఁడు!

మాన—ఇప్పట్టున మనము సంధిపతాకము నెత్తింపవలయు.

తెరలో—అగే రే రే రే-వచ్చిపడె-వచ్చిపడె-పాదుషా-పాదు-షా
అడ్డగింపుఁడు-అడ్డగింపుఁడు-పాదుషా-పాదుషా.

అందరు—(త్రుళ్ళిపడుచున్నారు.)

భటుఁడు—(ప్రవేశించి) మహాప్రభూ! వచ్చిపడె-వచ్చిపడె-

అక్బ—(ఆతురతతో) ఎవరురా? ఎవరురా?

భటుఁడు—మహాకాళి-మహాకాళి-వీరాబాయి-మహాప్రభూ-వీరాబాయి.

అక్బ—(తొందరగా) మానసింగ్! మానసింగ్! వెంటనే సంధి పతాకము నెత్తింపుము.

---



## —ద్వితీయరంగము—

[యుద్ధరంగము - ప్రవేశము-వీరాబాయి.
ప్రతాపసింహుఁడు - హామీరసింగు.

వీరా—ఇంతవరకు వీరావేశమునఁ బరవశులమైయుండుటచే నత్యంత భీభత్సరస సమగ్రంబులగు నీరక్తపాతములు నీకళేబరవ్రాతములును మనదృష్టుల నాకర్షింపలేదు. శత్రులు పరాజితులై సంధిపతాకము నెత్తిరను సంతసమైనఁ బొందనీయక యీభయంకర పరిదర్శనము మన హృదయముల నెంతకలతవెట్టుచున్నది? అబ్బబ్బా? చూడలేము-చూడలేము.

ప్రతా—అస్థిరములైన కాంతాకనకంబుల యందలి తుచ్ఛమోహమునఁబడి కొట్టుకొనవలదని బోధించుచున్నట్లు-మొండెములనుండి ఖండితములైన యీతలలెట్లు కొట్టుకొనుచున్నవో? అబ్బబ్బా! చూడలేము-చూడలేము.

హామీ—ప్రియసమాగమమునుగూర్చి శంకాకలితస్వాంతయైన కన్యకవలె విజయలక్ష్మి వెలవెలఁ బోవుచున్నదేకాని ప్రత్యక్షస్వరూపమునుజూపి మనకు సంపూర్ణానందము గలిగింపలేదు. బ్రతికియున్నంతకాలము నెందరియాశల నెన్నివిధములఁ బడఁగొట్టితిమని తమ యవజ్ఞతకుఁ తామే నవ్వుకొనుచున్నట్లు వెల్లకిలవ్రాలిన కళేబర ముఖంబులనుండి దంతచ్ఛాయలెంత వికృతముగాఁ గానవచ్చుచున్నవి? అబ్బబ్బా! చూడలేము-చూడలేము.

వీరా—చూడలేము-చూడలేము-ప్రతాపా! హామీరసింగ్! హృదయ నిర్భేదకంబగు నీభీభత్సరంగమును విడిచి చెంతనున్న యీగుడారములోనికిఁ బోవుదము రండు.

ప్రతా—అమ్మా! శాంతి మంత్రములను బఠించుచుఁ గ్రౌర్య దేవతా పిశాచమును మారణహోమము సేయనున్న మన కీఖడ్గములతోడ నింకేమి పనియున్నది? ఈప్రదేశముతోఁ బాటు ఈకరవాలములఁ గూడఁ బరిత్యజించినఁగాని మన హృదయములు కుదురుపడవు.

వీర—అట్లే పారవేయుదము. మరల నీకరవాలములనంటు నవస్థ సర్వేశ్వరుండు కలిగింపకుండుఁ గాక!

ముప్వురు—(ఖడ్గములఁ బాఱవైచి దూరముగాఁ దొలంగుచున్నారు)

వీరా—ముసలితనంపు మతిభ్రాంతియని భ్రాంతిపడి మీతండ్రిగారి యెడ మనమెంత యపరాధ మొనర్చితిమి? ఆమహామహుని మహోపదేశములెల్ల నాకిప్పుడు వేదవాక్యములకంటెను బవిత్రవంతములుగాఁ దోఁచుచున్నవి. నాయనా? ఇంకనిన్నుఁ బట్టభద్రునింజేసి నేనుఁగూడ సర్వస్వమును బరిత్యజించి మీతండ్రిగారి పరిచర్యసేయుచు—

ప్రతా—అమ్మా! క్షమింపుము. వివాహాభిషేకములు రెండును బరిత్యజింపవలెనని నేనింతకుముందే నిశ్చయించుకొంటిని. అందుచే నేనుఁగూడ నీవెంట దండ్రిగారి ననుసరింపవలసిన వాఁడనే.

వీరా—(నవ్వుచు) తప్పా? తప్పు! నీవట్లనఁగూడదు. (దగ్గఱకువచ్చి) కుమారా! కోపాతిశయమున నేనన్నమాటలు నీవింకను మఱువలేదా? అయ్యో! పాపము నీమనసెంత నొప్పించితినో కదా? ప్రతాపా! జయచంద్రునిఁబట్టి లతాంగిం గెలుచుకొన్న వాఁడవు—

ప్రతా—(దూరముగాఁ దొలంగి) అమ్మా! ఇంక లతాంగిపేరు మాత్రము నాయెడ నుగ్గడింపకుము. ఆమెపేరు వినుటకైన నాకింక నధికారములేదు.

హామీ—(తెల్లఁబోవుచున్నాడు.)



వీరా—(నవ్వుచు) వెఱ్ఱివాఁడా! నీకుఁగాక యామె యధికారమింకెవ్వరికిఁ గలదు?

ప్రతా—కుమారసింహుఁడను రాజకుమారుని నీవెఱుఁగుదువా?

వీరా—ఎఱుఁగుదును. ఎఱిఁగిన?

ప్రతా—వాని కోరికపై లతాంగిని వానికి విడిచిపెట్టితిని.

వీరా—నీవు విడిచిపెట్టితివిగాని లతాంగి వానిని బెండ్లాడవలదా?

ప్రతా—అది నాకు సంబంధములేదు. తనకొఱకు లతాంగిని విడిచిపెట్టుమనియే యాతఁడు నన్నుఁగోరెను. నేనంతకే మాటయిచ్చితిని.

ప్రవేశము—కుమారసింగు.

కుమా—అంతే నాకోరిక. అంతే. మేలుప్రతాపా! సత్యవంతుఁడవు!

హామీ—(నేలఁ జతికిలఁబడి నిట్టూర్పులు విడుచును.)

వీరా—ఏమట్టులున్నావు?

హామీ—తల నొచ్చుచున్నది. కొంచెము విశ్రమించెదను. (తలపట్టుకొనును)

వీరా—(అది వినకయే) కుమారసింగ్! మాకుపకార మొనర్చినవాఁడవు తగినట్లు మామన్ననఁ బడసిపోవలయునుగాని యిట్టి కోరికలు కోరవచ్చునా!

కుమా—దేవీ! దత్తద్రవ్యమునుగూర్చి విచారించిన యెడల నాదానఫల ముండదని పెద్దలుచెప్పెదరు. మాటయిచ్చి యిప్పుడు నొచ్చుకొననేల?

హామీ—తనకింకను స్వాధీనముగాని ద్రవ్యమును దాన మొసంగుటకుఁ బ్రతాపసింహునకుఁ గాని పరిగ్రహించుటకు నీకుఁగాని యేమియధికారమున్నది?

కుమా—అంత న్యాయమే విచారించిన నాకింకొక యధికారముగూడ నున్నది. జయచంద్రు నెదిరించి— పోరాడి— నోడించి— చెరపట్టి

కొని రావలయునని చాటించునందులేదు. ఎవఁడు చెరపట్టికొని వచ్చునో వానికే లతాంగి నొసంగెదమని యున్నది. అట్లు చెర పట్టికొని వచ్చినవాడను నేనే! ఏమి ప్రతాపా!

ప్రతా—అమ్మా! ఇందసత్య మేమియునులేదు.

వీరా—జయచంద్రుని నీవేల స్వయముగాఁ జెరపట్టలేదు.

ప్రతా—వాని నెదిరించి— పోరాడి— యోడించుసరికి— ఈకుమారసింహుఁడు పరుగుపరుగున వచ్చి శత్రుమండలమున మీతల్లిగారు ప్రాణావశిష్టులై యున్నారనియు నీవు పరుగునఁ జని తోడుపడని యెడల నామె నీకుఁదక్కదనియుఁ జెప్పుటచే నట్లేవిడిచి—

వీరా—(ముక్కున వ్రేలిడుకొని) ఏమి యీసాహసము! కుమారసింగ్! నేనెన్నఁడైన నీతో నట్లు చెప్పితినా? నీనోటికడ్డులేదా? మహోపకారివలెఁ గపటవేషము ధరించిన నీవెవ్వఁడవు?

హమీ—ఎవఁడైన నేమి! కపటపురుషుఁడు గాని నిజమైన రాజపుత్రుఁడు గాడు!

కుమా—నీవును గపటపురుషుఁడవే!

హమీ—దేవీ! తగినశిక్ష విధింపక శత్రువు నింకను గౌరవించెదవా?

కుమార భట్టు—ప్రవేశము.

భట్టు—దేవీ! తగినశిక్ష విధింపక శత్రువు నింకను గౌరవించెదవా? సౌధోపరితలమున హంసతూలికాతల్పముపై నిట్లింతకాల మా జయచంద్రుని మన్నించెదరు?

వీరా—(ఆశ్చర్యముతో) ఏమేమీ! కవిశేఖరా! జయచంద్రునిఁ గారాగృహమునఁ బెట్టింపలేదా?

భట్టు—మీసెలవు లేదని పెట్టింపలేదు.

వీరా—నాసెలవు లేదని నీకెవరు చెప్పిరి?



భట్టు—విధివశమున శత్రువుఁడైనను జయచంద్రుఁడు మాకు బంధువుఁడగుటచేతఁ జెరలోనుంచక వానిని రాజోపచారములచేఁ బూజింపుఁడని మీరు సెలవిచ్చినట్లు కుమారసింహుఁడు చెప్పెను.

వీరా—(కనులెఱ్ఱఁజేసి) నీదౌర్జన్యమున కంతము లేనట్లున్నది. మమ్మిట్లు మోసపుచ్చుటకుఁ గారణమేమి? క్రూరుఁడవై వీరుఁడనని వేషము వేసికొని నీవిట్లెందరిని మోసపుచ్చితివి? నీకెట్టి శిక్ష విధింపవలెనో నాకుఁ దోపకున్నది.

హమీ—రాజపుత్రు లందరిలో నీ వీరపురుష వేషము నూడదీయించి వీనినిఁ బరిభవించుటయే తగినశిక్ష.

వీరా—అదియే తగినశిక్ష! మహారాజుగారు వచ్చినంతనే నీకవచఖడ్గకిరీటకుండలాదులు లాగించి నిన్ను—

కుమా—దేవీ! నలువురిలో నన్నవమానపరుపనేల? నా కవచాదుల నిప్పుడే తీసివేసెదను. (అని యొక్కొక్కటి తీసివేయుచున్నాడు)

వీరా—ప్రతా—(ఆశ్చర్యముతోఁ జూచుచు గుసగుస లాడుకొనుచున్నారు.)

హమీ—(పరికించి చూచుచు నాశ్చర్యముతో మెల్లగా లేచుచున్నాడు.)

కుమా—(అన్నియుఁ దీసివేసి కడకు సంగీయును విప్పివేయును)

వీరా—(ఆశ్చర్యముతో సంశయించుచు) నర్మదా!

ప్రతా—(వింతగా) అక్కా!

హమీ—(తొందరతో వదినా! (అని నొచ్చుకొనును)

నర్మ—(ఆశ్చర్యముతో) లతాంగీ!

వీరా—(చేతులు చరచి) ఓహో! నర్మదాలతాంగులు! (అని రెండు చేతుల నిరువురం గౌఁగిలించుకొనును)

ప్రతా—అక్కా! ప్రత్యక్షస్వరూపముతో విజయలక్ష్మి మాకిప్పుడు సంపూర్ణానందము కలిగించినది!

నర్మ—విజయలక్ష్మియేగాదు. నీయర్ధాంగలక్ష్మియు నీకుఁ బ్రత్యక్షమైనది. (అని హమీరసింగునెత్తిపై పాగా లాగ నంగీయును దీసివేయును.

వీరా—లతాంగీ! భర్తృసంరక్షణముకొఱకు నర్మదయు-భర్తృనిర్ణయమగువరకు నీవును-ఈమారురూపములతో మమ్మెంత కలత పెట్టిరి?

భట్టు—దేవీ! సంధినిర్ణయము కొఱకుఁగాఁబోలు మానసింహుఁడు వచ్చుచున్నాఁడు.

(ప్రవేశము-మానసింహుఁడు)

మాన—దేవీ! అత్యంత తేజోవంతులైన రాజపుత్రుల యొక్కయు జగదంబావతారమని వినుతికెక్కిన నీయొక్కయు సంగరకళాప్రావీణ్యములకుఁ జక్రవర్తి యత్యద్భుతం బంది- మీచెలిమిగోరుచు సంతోషపూర్వకంబైనసంధివార్తయు రాణావారిక్షేమ వార్తయు మీకెఱింగింప నన్నుఁబంపించెను.

వీరా—అయ్యా! సంధివార్తకంటె రాణావారి క్షేమవార్తమాకెక్కుడుసంతోషకరము.

మాన—లోకమాన్యులైన రాణావారెవ్వరికిఁ బూజ్యులుగారు తల్లీ

వీరా—పూజ్యులను బూజించుటచేతనే చక్రవర్తియు మాకుఁబూజ్యుఁడగుచున్నాఁడు. లతాంగీ స్మరణంబును గప్పంపుఁ దలంపును బరిత్యజించినయెడల నచ్చట రాణావారెట్టి సంధినిర్ణయము గావించినను మాకుసమ్మతమే.

మాన—తల్లీ! కప్పమునుగూర్చి చక్రవర్తి వాక్యమును జిత్తగింపుడు రాజస్థానము నందంతట వీరమాతయని పూజింపబడుచున్న శ్రీ



వీరాబాయి మహారాజ్ఞి మాకుఁ గూడ మాతృసమానయగుటచేత మాతృసేవార్థము చిత్తూరుకప్పమును మేముపరిత్యజించుచున్నాము

ప్రతా—మేలుసార్వభౌమా! మేలు! ఇదిమాతృసేవయేగాదు. భారత మాతృసేవ. హిందూమహమ్మదీయ సమ్మేళమునకిదియే ప్రథమ సోపానము.

వీరా—అట్లనుటకింకను వీలులేదు. ముఖ్యవిషయంబింకను ముందున్నది.

మాన—దేవీ! చక్రవర్తికి వచ్చిన యీయుత్తరమును మీరుచిత్తగించినయెడ నావిషయము గూడసూక్ష్మముగా నిర్ణయింపబడును. (ఇచ్చును)

వీరా—(అందుకొని చూచుచుండును)

(తక్కినవారందరుఁ బ్రక్కలనుండియు నాయుత్తరమును జూచుచు నవ్వుకొనుచు గుసగుసలాడుకొను చుందురు)

వీరా—(నవ్వుచు) అయ్యా! ఈయుత్తరము చక్రవర్తికెవ రొసంగిరి.

మాన—ఒక రాజకన్యక తనకిచ్చినదని ఫకీరొకఁడు తెచ్చియిచ్చెను.

వీరా—రాణావారీయుత్తరమును జూచినారా?

మాన—చూచినారు. చూచియీయుత్తరమును వ్రాసిన లతాంగిని మీకొసంగుటకు నభ్యంతరముండదని చక్రవర్తితోఁ జెప్పినారు.

వీరా—ఔను స్వయంవరము నభ్యంతరపెట్టుట మామతముగాదు. అందుచే మేముఁగూడ సంగీకరించితి మని చక్రవర్తికిఁ జెప్పుఁడు.

మాన—(సంతోషముతో) మహాప్రసాదము తల్లీ! ఇంతకంటె సుదినం బుండునా?

మీరా—రాజోత్తమా! ఇంకమాపక్షమున మేముగోరవలసిన దొక్కటియే యున్నది. అది నౌరోజాయుత్సవము. ఈమీదనాయుత్సవమును జక్రవర్తి యాపివేయవలెను.

మానస—తల్లీ! ఈనౌరోజా యుత్సవమున మనహిందువుల నవరాత్ర్యుత్సవమువంటిది. హిందూ మహమ్మదీయ సమ్మేళనమునకై ప్రయత్నించుచక్రవర్తి—తొలుదొల్త రాజపుత్రస్త్రీలకును మహమ్మదీయస్త్రీలకును బరస్పరస్నేహ మొనఁగూర్చుటకై యీయుత్సవము నుగల్పించెను. మొట్టమొదటఁ దమతమస్త్రీసంఘములనుదమకుఁ దోడుచేసికొనినఁగాని పురుషులు సాంఘిక రాజకీయాది మహాకార్యములలో దేనినైనఁ గొనసాగింపఁజాలరు. భారతీయ మహమ్మదీయకాంతలు స్వేచ్ఛగా నొక్కయెడఁగూడిపరస్పరస్నేహాలాపనకై దేశమును గూర్చియుఁ దమతమసంఘములను గూర్చియు మంచిచెడ్డలను ముచ్చటించుకొనుటకీయుత్సవమే యాధారమైయున్నది ఇయ్యది మీకసమ్మతమైనచో నాపివేయఁ బ్రయత్నించెదను.

వీరా—సరే! శేషించినవిశేషములు రాణావారే నిర్మింపఁగలరు. వారినింకఁ దోడ్కొనివచ్చెదరా?

మానస—అభ్యంతరమేమున్నది! (రెండడుగులుపోయి మరలవచ్చి) అమ్మా! మన మీగుడారములోనుండుటచేఁ గానమైతిమి. అరుగో! చక్రవర్తియు రాణావారును రణనిహతులైన రాజపుత్రమహమ్మదీయులఁ బరిశీలించుచు విచారించుచు నీసమీపముముననే విహరించుచున్నారు. సెలవైనయెడల—

వీరా—మా సెలవెందుకు? ఈగుడారములు చక్రవర్తివేకదా? తోడ్కొనిరండు!

మానస—చిత్తము—(నిష్క్రమించును)

అందరు—(ప్రక్కకుఁదొలంగి చూచుచుందురు)

వీరా—చిరంజీవీ! చూడుచూడు! అరుగో! కౌపీనధారులై బ్రహ్మతేజమున వెలుంగుచుండిన మహారాజుగారు.

లతా—ఆయనప్రక్కయున్న యాఫకీరెవ్వఁడో?



శర్మ—ఉత్తరమిచ్చిన వాఁడాతఁడే కావలయును. అదుగో! చక్రవర్తికడ సెలవుగైకొని వెడలిపోవుచున్నాడు.

భట్టు—దేవీ! హిందువుఁడా? మహమ్మదీయుఁడా యను సంశయమును గల్పించు నాగంభీరపురుషుఁడే సార్వభౌముఁడు.

వీరా—అలాగునా! రాజపుత్రునివలెనే గానవచ్చుచున్నాఁడుసుమా!

భట్టు—ఒకమూర్తిగా మూర్తీభవించిన హైందవమహమ్మదీయ తేజములవలెఁ గానవచ్చుచున్నాడు. శిరమ్మున మహమ్మదీయుల కోలకుళ్ళాయిందాల్చియు—దానిపై హైందవరాజపుత్రుల కుచ్చులపగిది కడునొయ్యారంబుగాఁ జుట్టు; ఆజానులంబమానంబైన బంగరుజరీబుటాల హారంగులరంగారు మహమ్మదీయుల యంగ ధరించియు-హాంబట్టుపుట్టంబున హిందువునట్టులె బిట్టుపసంజెన్నారు బిళ్ళకచ్చంగట్టి; చొక్కపుఁజొక్కాయిపై మహమ్మదీయుల మఖమల్ కబాయిందాల్చియు- హిందువునిచందంబున సింగారంబగు వలెవంపుటుత్తరీయమ్ము మెడం జీరాడవైచికొని; అబ్బురంబైన సహజముఖవర్చస్సు మహమ్మదీయత్వమ్మును-నెన్నుదుటఁ జిరుచెమ్మటలఁ జెమ్మగిల్లు సిందూరతిలకమ్ము హైందవత్వంబును; జాటుచుండ-ఒకవంక మహమ్మదీయోద్యోగులును—ఒకవంక హైందవోద్యోగులును-ఒకవంక మహమ్మదీయ రాజయోగులును - ఒకవంక హైందవ రాజయోగులును-బలసికొలువ—మహమ్మదీయ సమ్మేళనార్థం బవతరించిన యపూర్వపురుషుండోయన విరాజిల్లుచు సార్వభౌముండు సపరివారంబుగ నీ ప్రాంతమునకే బయలుదేరినాడు.

—ప్రవేశము-పరుగుపరుగున ప్రమద—

ప్రమ—దేవీ! మీరాజదంపతులను నుత్సవముతోఁ గోటలోనికిఁ గొనిపోవుటకుఁ బట్టణమునఁ గల రాజపుత్రస్త్రీలెల్లరును విజయానందముతో వచ్చుచున్నారు.

వీరా—(నవ్వుచు) అలాగునా? నీవీ యు[illegible]?

ప్రమ—వారందరివలెనే నేనును వచ్చితిని. [illegible] నర్థము కాలేదు.

వీరా—పోనిమ్ము. నామాట నీకర్థము గాకున్న నీయుత్తరమైన నీకర్థమగునేమో చూడు.

ప్రమ—(శిరము వంచుకొని)

—ప్రవేశము-ఉదయసింగు-అక్బరు-మానసింగు-మరికొందరు—

అందరు—(ఉదయసింగునకు నమస్కరింతురు)

ప్ర[illegible]గా—సార్వభౌమా! విజయోస్తు.

అక్బ—రాజకుమారా! ఇంక మాకు విజయంబెక్కడిది? విజయలక్ష్మి మీ రాజపుత్రులనే వరించినది.

ఉద—ఒక్క రాజపుత్రులనే కాదు. మీ మహమ్మదీయులను గూడ వరించినది-మన యుభయపక్షములను వరించుటచేతనే మనము నేడీసమ్మేళనానంద మనుభవించుచున్నాము.

భట్టు—ఒక్క మనమే గాదు. ఈశుభవార్త నెరింగిన నార్యావర్తమంతయు నీ సమ్మేళనానంద మనుభవింపఁగలదు. రణరంగమున నుభయపక్షములకు జయము గలుగుట యసంభవము. అట్టి యసంభవమైన విజయము సంభవించుటచేత హిందూమహమ్మదీయుల కీదినము శాశ్వత సంస్మరణీయమైనది. ఓ దేవీ! మహారాజా! విశాలహృదయుండును మహౌదార్యధుర్యుండు నగు నీ చక్రవర్తి మీకుఁ జెలికాడును జుట్టంబు నగుట మీ భాగ్యము! సర్వమతాత్మీయుండును సర్వప్రజానురక్తుఁడును స్వార్థపరత్వవర్జితుఁడును నగు నీచక్రవర్తివంటి చక్రవర్తి భవిష్యద్భారతవర్షచక్రవర్తులలో నొక్కఁడేనియు నుండునని నాకుఁ దోఁచదు.



[illegible]
జనిత[illegible]
[illegible] సర్వమత తత్త్వంబుల విచారించె నీ
ఘనునింబోలెడు సార్వభౌముఁడికఁ గల్గంబోడు ముందెన్నడున్.

6. తనవృత్తుల్ తనవిద్యలుం దనమతోత్సాహంబులున్ భారతీ
యనికాయంబునకున్ విధింపక సమత్వాయత్త చిత్తంబుతో
మనవృత్తుల్ మనవిద్యలున్ మనమతామ్నాయంబులుం బ్రోచు నీ
ఘనునిం బోలెడు సార్వభౌముఁ డికఁ గల్గంబోడు ముందెన్నఁడున్.

ఉద—(అక్బరు చెవిలో నేమో చెప్పును)

అక్బ—కవిశేఖరా! ఎట్టి స్వల్పవిషయములైనను గవినోటనుండి వెడలినప్పుడు మాత్రము మనోజ్ఞతయు శాశ్వతత్వమును బొందుచుండును. దేశముకొఱకు దేశీయులకొఱకు మేమింతవరకుఁ గావించిన సత్యల్పము. ఇప్పుడు పవిత్రచరిత్రులైన చిత్తూరు రాజపుత్రులు మాకు మిత్రులగుటచే సమ్మహనీయుల సహాయ్యమ్మున నింకమీఁద నార్యావర్తమున మా నూతన ప్రచారము నిర్విఘ్నముగాఁ గొనసాగఁగలదని తోఁచుచున్నది.

భట్టు—సార్వభౌమా! నిర్వాణము నిష్కల్మషమునగు మీ నూతన మతము నే భారతీయుఁడు స్వీకరింపఁడు? [illegible]న్నతులైన మా చిత్తూరు రాజపుత్రులు హిందూమహమ్మదీయ సమ్మేళనమునకు విజయపతాక నెత్తినట్లు—వారు నౌరోజా యుత్సవమున మీ రుపహరించిన కన్యారత్నమును నేఁడు మీకు సమర్పించుచున్నారు- పరిగ్రహింపుఁడు.

వీరా-నర్మ-లతా—(నవ్వుచు ప్రమదను ముందుకుఁ ద్రోయుదురు)

ప్రమ—(ప్రమద సిగ్గుతో అక్బరు మెడలోఁ దన ముత్యాలహారము వైచును.

ప్రవేశము-ఉగ్రసేనుఁడు.

ఉగ్ర—దేవీ! వచ్చినరాజపుత్రుల కెల్లరకుఁ దగినవసతులేర్పడిన వారెల్లరు మీయాజ్ఞకొఱకెదురు చూచుచున్నారు.

వీరా—ఉగ్రసేనా! సంగ్రామరంగమున మనకుఁ దోడువచ్చిన రాజకుమారుల కెల్లరకు మా కృతజ్ఞత నెఱింగించి ప్రము[illegible]ర్వ[illegible]ములకును లతాంగి ప్రతాపసింగులకును మేము గావింపనున్న వివాహోత్సవములు శుభప్రదంబుగా జరిగింపవలయునని మా ప్రార్థనము వారి కెఱింగింపుము.

—(వింతగా వినుచుండఁగా)

ఉద —(అక్బరు చెవిలో నేమో చెప్పుచుండును)

ఉగ్ర—ఆహా! దేవీ! ఇంతకంటె నింకేమి కావలయును?

భట్టు—ఇంకేమి కావలయును!

మ. మతముల్ జాతులు వేరుగా నొకటియే మా భారతీమాలికన్
మతితో జాతి మహైకమత్యమును సంపాదించి యీపై జగ
ద్ధితకార్యంబుల నప్రమత్తులగుచున్ హిందూము[illegible]
ఖ్యాతతో నెల్లరు నుల్లసిల్లెదరుగా నాచంద్రతా[illegible]

ఓం శాంతిశ్శాంతి శ్శాంతిః



సరస్వతీ పవర్ ప్రెస్, రాజమండ్రి

END OF TITLE